ఫిబ్రవరి, 2024

సంపుటి 04, సంచిక 05

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలంగాణ సాహిత్య మాసపత్రిక







## సమ్మక్క-సారక్క జాతర - 2024



స్వాతంత్ర్య సమరయోధులు, కవయిత్రి

## సరోజినీ నాయుడు

**జయంతి : ఫిబ్రవరి 13, 1879**

*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **BHARATHA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 4th Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక


అహం అణిగిపోతే నువ్వు పైకి లేచినట్టే అని చెప్తున్న **రవీంద్రసూరి నామాల** కవిత **"ఈరోజు గడిచేలోపు"** ....పేజీ 10

పువ్వుగా పరిమళించక ముందే ధ్వంసం అయిన విషాదాన్ని చిత్రించిన నెల్లుట్ల **సునీత** కవిత **"నిష్ఫలయత్నం"** ....పేజీ 42

జనం ముందు పరువు తీయొద్దంటున్న **పరమాత్మ** **"ఆట"** ఈ మాసం కవితగా ....పేజీ 06


23
వలచిన వాడే వరుడై వచ్చిన ప్రేమ కథ **అన్నం పద్మజ రెడ్డి** కలం నుండి **"ఓ ప్రేమ కథ"**


45
ప్రముఖ సాహితీవేత్త, అనువాదకులు **ఎలనాగ**తో **ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్** ఈ మాసం ముచ్చట


39
వ్యవస్థలోని అరాచకాన్ని చెబుతున్న రచన **"వాయిదా పడ్డ అధ్యక్షుని బిడ్డ పెళ్లి"** **కేపీ లక్ష్మీనరసింహ** కథ


27
**"ఆర్తి నిండిన లేదాళ్ళ కవిత "అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి"** కవిత


15
పల్లెటూరి పసి జ్ఞాపకాలను గుర్తుకు తెస్తున్న కథ **లేఖానంద స్వామి** **"జ్ఞాపకాల తడి"**


11
తంత్రీనాదాల్లో మిగిలిన ఏకైక ఆనవాలు పట్టిస్తున్న **జంపాల ప్రవీణ్** వ్యాసం **"జానపద కళల వైభవం ఈనాటి దైన్యం"**

19 నర్తకి రూపంగా వచ్చిన గూఢ చర్యాన్ని ఛేదించిన మంత్రి **అమ్మంగి వేణుగోపాల్** సీరియల్ **"చంద్రరేఖ"**

32 ఎడారి జీవితంలో నుండి ఎడబాటు కోరుతున్న **రమేష్ నల్లగొండ** కవిత **"ఎడారి వాసం!"**

కృత్రిమత్వాన్ని విడిచిపెట్టి సహజత్వంలోకి రమ్మంటున్న **కోటం చంద్రశేఖర్** కవిత **"రా"** ....పేజీ 22

తెలంగాణ కవి సింహం సాహిత్య జీవితాన్ని అవలోకిస్తున్న **సంకేపల్లి** వ్యాసం **"రామసింహ కవి జీవితం ఆత్మకథ ఒక పరిశీలన"** ....పేజీ 35

విదేశాల నుంచి వచ్చిన కూరగాయలను పరిచయం చేస్తున్న **జి.బి. విశ్వనాథ** **"ప్రబంధాలలో నాటి కూరగాయలు...."** ....పేజీ 47

సంక్రాంతి నాడు వచ్చిన కొత్త క్రాంతిని చెప్పిన **దాశరథి** నాటికథ **"సంక్రాంతి సంబరం"** ....పేజీ 7

బ్రతుకు ఉద్వేగాన్ని విడమరిచి చెప్తున్న **కొండి మల్లారెడ్డి** **"రిలీవింగ్ ఆర్డర్"** కవిత ....పేజీ 26

నీడతో వీడని బంధాన్ని చెప్పిన **నాంపల్లి సుజాత** కవిత **"ప్రతిరూపం"** ....పేజీ 33

బహుజన కోణంలో నడిచిన విమర్శను పరిచయం చేస్తున్న **సంగిశెట్టి శ్రీనివాస్** **'మెర'గీసి నిలిచిన రాజ్‌కుమార్ విమర్శ** ....పేజీ 49

**ఇంకా...** మరెన్నో కవితలు, సాహితీ శిఖరం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...


**తంగేడులో ప్రచురిస్తున్న రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు ఆయా సృజన కారుల సొంతం. వీటితో సంపాదకులకు ఏకీభావం ఉండవలసిన అవసరం లేదు. విభిన్న ప్రక్రియలకు, అభిప్రాయాలకు, వేదిక కావడమే తంగేడు లక్ష్యం.**

# దుందుభి

**హనుమచ్ఛర్మ**

ఈ గేయాన్ని ప్రసిద్ధ కవిపండితులు, ఋగ్వేదంలో అసాధారణ ప్రజ్ఞాసమన్వితులు గంగాపురం హనుమచ్ఛర్మ రచించిన "దుందుభి" కావ్యంలోనిది. గంగాపురం హనుమచ్ఛర్మ ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన కవులలో ఒకరు. ఈయన 1925లో వేపూరు గ్రామంలో జన్మించారు. సంస్కృతాంధ్ర విద్వాంసులైన గంగాపురం హనుమచ్ఛర్మ "దుందుభి" కావ్యంతో ప్రసిద్ధిగాంచారు. తెలుగు, సంస్కృత భాషలలో అనేక గ్రంథాలు రచించారు. 1996 ఆగస్టు 15 న మరణించారు.

ఈ దుందుభి కావ్యం విశ్వనాథ 'కిన్నెరసాని', దాశరథి 'మంజీర' లను తలపిస్తుంది. ఈ దుందుభి నది వికారాబాదు జిల్లాలోని అనంతగిరి కొండల నుండి ఈ నది పుట్టి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రవేశిస్తుంది. పురాణ చారిత్రక విశేషం గల గంగాపురం, సురభి పట్టణాల గుండా ప్రవహించి గుండ్లపల్లి వద్ద ప్రాజెక్టును నిర్మించుకొని అనంతరం కృష్ణానదిలో కలుస్తుంది. ఈ దుందుభి కావ్యంలో ఆయా ప్రాంతాలకు సంబంధించిన పట్టణాలను, రాజులను, కృతికర్తలను కవి పరిచయం చేశాడు.

ప్రవహింతువా దుందుభీ!
మాసీమ పాలయేఋగ దుందుభీ!

చిరుగాలి కెరటాల
పొరలెత్తు అలలతో
దరులంటు అమృత శ్రీ
కరములో జలముతో
గిరులంటి, వాని ని
ర్ఝరులంటి, పైపైని
తరులంటి, జాజి క్రొ
వ్విరుల వన్నియలూ!...... ??
ప్రవహింతువా??

చరియ సందుల బుట్టి
చారలై కనుపట్టి
చీమ యూటగ మారి
చెలగి ధారల బారి!

పడిగొనుచు గుమిగూడి,
వాః ప్రవాహమ్ములై:
నురుగులై తరగలై
మనులేత మెరుగులౌ
'పావనానంత గిరి ప్రకృతిసీమల నుండి
స్వాదుపానీయ సంపదలతో బోదలుచును ॥ప్రవహింతువా॥

వల్మీక సుషిరాల వారిధారాల ముంచి
కొన్నాగు పడగలకు క్రొత్త భంగిమ నేర్చి:
చీమ పిండుల నలల జేర్చి తెప్పున దేల్చి
గిజిగాని గూండ్లల్ల గజిబిజిగ నొనరించి: ॥ప్రవహింతువా॥

నీచేతి చలువలకె నేల పులకింపంగ,
తటభూజములనెక్కి
తద్భువానందాన ఖగపాళికలరుతులు
కలసి స్వస్తులుబల్క ॥ప్రవహింతువా॥

పొగడపూవులు దాల్చి, పొంగిపొంగి గమించి,
ఇసుకదిబ్బల దూరి బుసకొట్టి బుసకొట్టి,
కంకణమ్ముల గలంగలల ముంజేతులటు
గండశిలలకు దాకి గమకమ్ముల బల్కి ॥ప్రవహింతువా॥

సేకరణ : భీంపల్లి శ్రీకాంత్

సంపాదకీయం


తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

ఫిబ్రవరి, 2024

సంపుటి 04 సంచిక 05





శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్





డా॥ కాంచనపల్లి గోవర్ధన్ రాజు
అసోసియేట్ ఎడిటర్
9676096614



ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి


# హృదయ వాదం ఎప్పుడూ కళాత్మకమే

ప్రపంచంలో ఏ భాషలోనైనా సృజనపాటమరించడానికి హృదయమే ప్రధానం. స్పందన అపూర్వ సాహిత్య సృజనకు ఎప్పుడైనా మూలం అవుతుంది. స్పందనకు జ్ఞానము అభ్యాసము తోడైతే అది పూర్ణ కళావంతంగా వికసిస్తుంది. కొంతమంది సృజనకు కొన్ని కట్టుబాట్లు నిర్దేశించి గొలుసులు బంధించడానికి చూస్తారు. దీన్నే శాస్త్రం అంటారు. ఛందస్సు, వ్యాకరణం, సౌందర్య శాస్త్రం మొదలైన పేర్లతో పాతవాళ్లు, అభివ్యక్తి, భాష, సౌందర్య శాస్త్రం లాంటి పేర్లతో కొత్తవాళ్లు సాహితీ సృజనకు శాస్త్రాన్ని నిర్మించడం మనం చూస్తుంటాం. కానయితే అసలైన ప్రతిభాకారుడిని ఈ శాస్త్రం నిర్బంధించడం సాధ్యం కాదు. నిర్మించబడ్డ శాసనాలను చీల్చుకొని ప్రతిభ అక్షరాలుగా ప్రవహిస్తుంది. అయితే కొన్నిసార్లు బంధాలు విడిచిపెట్టిన ప్రతిభ అరాచకానికి దారి తీసే ప్రమాదం ఉంటుంది. అందుకే అభ్యాస దశలోని ప్రతి సృజనకారుడు శాస్త్రాన్ని అనుసరించవలసిందే. తనకు అన్ని విషయాల మీద అవగాహన వచ్చాక మొదటి నుండి వస్తున్న శాస్త్రీయత కాకుండా తన ప్రతిభా మూలంగా తాను కూడా కట్టుబాట్లు ఏర్పరచుకోవచ్చు. తాను అనుకున్న విషయాన్ని అందంగా చెప్పవచ్చు.

నిజానికి శాస్త్రం ఏర్పడేది వ్యక్తీకరణను అందంగా ఔచితీవంతంగా మలచడానికే. కానీ కొన్నిసార్లు ఉప్పొంగే హృదయం జ్వలన శక్తిని శాస్త్రం అడ్డుకట్ట వేస్తుంటుంది. ఇక్కడే చిక్కు వస్తుంది. ఒక సాక్షాత్కారంలాగా ఉబికి వచ్చే అక్షరాల ప్రవాహానికి ఏదో పంటి కిందరాయిలాగా అభ్యంతరం అనుభవానికి వస్తుంది. ప్రతిభాకారుడు ఈ విచలింపుకు కారణం గ్రహిస్తాడు. శాస్త్రీయత గొలుసులను కొంత సడలిస్తాడు. తన రచనలు కొనసాగిస్తాడు. ప్రతిభ, దానికి తోడు జ్ఞానం, అభ్యాసం వలసినంత లేనివాడు తనకు విధించిన కట్టుబాటుకు లొంగిపోయి సౌందర్య దృక్పథాన్ని అనుకునేంతగా ప్రదర్శించలేక పోతాడు. వస్తువుని అనుకున్న విధంగా చిత్రించలేకపోతాడు. అలంకారం తనకు అందం తేవాలి కానీ ఆటంకం చేయకూడదని ప్రాథమిక సూత్రం మరిచిపోతాడు. అదే విధంగా శాస్త్రాధికారం కేవలం సృజనను పదును పెట్టడానికి కానీ నిరోధించడానికి కాదని మూల సూత్రం కూడా దెబ్బతింటుంది.

నిజానికి శాస్త్రము, సృజన పరస్పర సహవాసులు. పరస్పర ఆధారితాలు. ఏది శృతి మించినా రచన యొక్క మూల లక్ష్యం దెబ్బతింటుంది. అందుకే ప్రతిభాకారుడు రెండింటిని సమతుల్యంగా పోషించగలగాలి. ఎన్నుకున్న వస్తువును సరైన పద్ధతిలో వ్యక్తీకరించగలగాలి. ఇది కేవలం అభ్యాసం ద్వారా సిద్ధిస్తుంది. అందుచేత కళావ్యక్తీకరణకు అభ్యాసమే మూలధాతువు. ఇది ఈనాడు వస్తున్న చర్చ కాదు. మొదటి నుండి కొనసాగుతున్నదే. అనేక పేర్లతో ఇది కొనసాగుతూ వస్తున్నది. నాడు కావ్య లక్షణాలు అంటే నేడు విమర్శ అంటున్నారు. కాబట్టి ఈ సహోద్యోగం మరింత పరిణితి సాధించి మన సాహిత్యంలో ఎన్నో కొత్త వెలుగులు రావాలని ఆకాంక్షిద్దాం.

జై తెలంగాణ! జై జాగృతి!!

కవిత కల్వకుంట్ల



**ఈ** మాసం కవి ... అందోజు పరమాత్మ వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. ఆయన మొదటి నుంచి ప్రభావవంతమైన కవిత్వం రాస్తారు .1985 నుండి 1992 వరకు కొనసాగిన సమాంతర సాహిత్య వేదిక వ్యవస్థాపకుడు. డిసెంబర్ 9న 2009 తెలంగాణ దీర్ఘ కావ్యం ప్రచురించారు. తెలంగాణ కవిత్వం సిద్ధాంత గ్రంథం ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ లో సమర్పించారు. హైదరాబాద్ కవుల వేదిక లో ఈ నేల వెన్నెల కాయనీ కవితా సంకలనానికి సంపాదకత్వం వహించారు. ఉద్వేగ భరితమైన కవిత్వానికి కేంద్రంగా ఉండే అందోజు పరమాత్మ కవిత ఆట తంగేడు పాఠకుల కోసం ఈ మాసం కవితగా...

# ఆట



పరమాత్మ, అందోజు, 91823 42185

ఆట ఇప్పుడే మొదలయింది
రంగస్థలం తెర తొలిగిపోయి
పాత్రలు ప్రవేశించాయి
నేపథ్యంలో సంగీతం దప్ప
సంభాషణలు రక్తి కట్టించడం లేదు

ఏం...
ఆట.... ఆడడమంటే...
తమాషానా?
ఉంగటం తెగిపోయిన చెప్పును
చేతుల పట్టుకుని నడుస్తున్నట్టు
కుంటిసాకులు చెప్పడమేనా...!

చేతికొచ్చిన పంటను ఎవడో
దొంగరాత్రి దులుపుకపోయినట్టు
ఆ..తాళం.... ఆ...మద్దెలకు.. నడుమ
సంవాదాల లొల్లి దప్ప....
అనుభవాలను గుదిగుచ్చి
ఆటను నడుపే తీరే కనపడ్తలేదు

నిన్నటి విదూషకుడి పాత్రధారి
ఇవ్వాళ రాజువేషంలో వచ్చిండు గదా!
ఆహార్యంలోనూ.. మాటతీరులోనూ...
ఏమైనా సుతి గలుస్తున్నదా...!

ఆటంటే...కల్లంలో తూర్పార బట్టిన
గట్టిగింజలు ఇల్లు చేరినట్టు ఉండాలె గాని
చాట ఊపితే కొట్టుకుపోయే తాలులా
మాటలమూటలు
గాలివాటమైపోతున్నయి గదా!

కిక్కుగొట్ట చేతగానోడు బైకును
గ్యారేజ్ కు తోసుకుపోతున్నట్టు....
ఆటాడలేక మద్దెల ఓడిందన్నట్టు....
అంకానికీ... అంకానికీ...మధ్యన
విరామంలా గీ ఖాళీ... అరచేతులను
పైకెత్తి పంతాలకు పోవుడేంది?

గటుక తిన్నా... గంజిదాగినా...
మీసాలకు మెతుకులంటించుకున్నట్టు
గుంభనంగా కనిపించాలె గానీ
ఆటకు అవకాశమిచ్చిన జనం ముందు
పాత్రల పరువు దీసుకోవడమేంది?

ఆట ఆగమైతున్నది గదా!
తెరవెనుక సూత్రదారులేంజేస్తున్నట్టు?
ఆటకు సరిపడా పతార లేదని
తెర దించాలనుకుంటే.....
పొద్దుగూకటం... తెల్లారటం...
ఏదీ ఆగిపోదూ..?

ముమ్మాటికి......
మీ ఆటను మీరే ఆడుకోండి...
ప్రేక్షకులం.......
సముద్రమంతటి గంభీరులం...
మునగదీయడం ఒడ్డుకు చేర్చడం
మాకు కొత్తేమీ గాదు సుమా..?

నాటి కథ

# సంక్రాంతి సంబరం

సంస్కృతిని మేళవించిన ప్రేమకథ...



దాశరథి

పసుపు రాసులు పోసినట్టు బంతిపూలు పచ్చ పచ్చగా, వెచ్చ వెచ్చగా పూసినై. చేమంతులు రాజుల పూలైతే బంతిపూలు రైతుల పూలు, నల్లటి కొప్పులో పచ్చని బంగారంలాంటి బంతి పూవు చెక్కుకుని సీత పొలం పక్కగా నడిచిపోతుంది. రాముడు గడ్డివామిలో కూచుని దానివైపు చూసి మురిసిపోతాడు. చలిగాలి కత్తిలా కోస్తుంది. పైటకొంగు తల మీదికి ముసుగులా లాక్కుంటుంది సీత. గడ్డి వంటినిండా కప్పుకుంటాడు రాముడు. కళ్లకు పచ్చ పచ్చగా, వెచ్చ వెచ్చగా బంతిపూలు, మనసులో కమ్మ కమ్మగా వలపులు.

సంక్రాంతి రానే వచ్చింది. గరిసెల్లో, గాదెల్లో నిండుగా ధ్యానం. నిరుపేద వాడు సంక్రాంతినాడు మహారాజు. కొత్త బియ్యపు అన్నం తియ్య తియ్యగా దిగుతుంది. లేత లేత ఊసబియ్యం కంకులు కాల్చుకుని నములుతుంటే పాలూరుతాయి. సజ్జరొట్టెలు కాల్చుకుంటున్నారు కొందరు, నువ్వులు బొక్కుతున్నారు కొందరు. సీతకి తిండి మీద దృష్టిలేదు. ముగ్గులంటే దానికి సరదా. రంగు రంగుల పిండితో ముగ్గులు పెట్టింది ఇంటి ముంగిట. పేడతో గురుగులు చేసింది. ఆ గురుగుల్లో రంగురంగుల పూలు గుచ్చింది. నూలు, బియ్యం, రేగుబండ్లూ నింపింది. అక్కడక్కడా ముగ్గులు చెరిపి మళ్లీ సరిదిద్దు తున్నది. బొటన వేలుతో నేలను రాస్తూ ఏదో ఆలోచిస్తున్నది. రాముడు దూరం నుంచి చూశాడు. ముగ్గులు సరిదిద్దుతున్న సీతని చూసే వరకు వాని గుండెలో ఎవరో గుస గుస లాడారు. దగ్గరిగా వచ్చాడు. వెనక నుంచున్నాడు. కొప్పులోని బంతిపూవు పక్కున నవ్వింది.

ఏదో చప్పుడైనట్టై గిరుక్కున వెనక్కు తిరిగి చూచింది సీత. రాముడు అటు తిరిగి చూస్తున్నాడు. "దొంగా యేంటీ ఆట?" అంది సీత.

"అంతలో పొలంలోంచి ఇంటి కొచ్చి ముగ్గులు పెడుతున్నావే?" అన్నాడు రాముడు.

"పొలంలో నన్నెక్కడ చూసినౌ:" అని అడిగింది సీత.

"చూశిన, గడ్డి వామిలోనుంచి"

"దొంగ చూపులు ఎప్పుడు నేర్చినౌ?"

"ఇప్పుడిప్పుడే నేరుస్తున్న"

"పండగపూట ఇంటికి పో"

"ఇదే నా యిల్లు. నేను పోనేపోను"

"అయ్య తంతడు"

"ఎందుకూ?"

"ఆడపిల్లల యెంట పడ్డందుకు"

"మరి మొగపిల్లల యెంట పడమంటవా ?"

"ఏమో. నీకు జవాబులు చెప్పలేను.

"నేను పోనంటే పోను""

"అదుగో అయ్యొస్తున్నడు" అంది సీత. ఉలిక్కిపడి ఇంట్లోకి చూశాడు రాముడు. అయ్యలేడు కొయ్యలేడు.

"అమ్మ దొంగా! భయపెడతావ్?" అని సీతని పట్టుకున్నాడు రాముడు. సీతకి భయం వేసింది. విదిలించుకుంది. కాని రాముడు వదల్లేదు.

అంతలో దూరం నుంచి సన్నాయి వినపడ్డది. పిల్లలు అల్లరిగా అరుస్తున్నారు. ఇద్దరూ అటువైపు చూశారు. నందీశ్వరుడిలాగా ఎత్తైన మూపురం, దాని మీద చుట్టిన ఎర్రటి సిల్కు సెల్లా, వీపున రంగు రంగుల బొంత, మెడలో మువ్వలు, మొఖాన బొట్టు, గంభీరంగా వుంది గంగిరెద్దు. ముందర ఒకడు సన్నాయి వాయిస్తూ నడుస్తున్నాడు. వెనక వొకడు డోలు వాయిస్తున్నాడు. వెంట పిల్లలు పరుగెత్తుకు వస్తున్నారు.

"గంగెద్దొస్తున్నది" అంది సీత.

"రానీ, దాన్నడుగుతా మన పెళ్లెప్పుడో" అన్నాడు రాముడు.

"అమ్మో! పెళ్లే? నీకు పిల్ల నెవ్వడిస్తాడు?"

"మీ అయ్య"

"మా అయ్య నీకు నిజంగానే పెళ్లి చేస్తాడు"

"మరింకేం?"

"కర్రతో పెళ్లి"

"అట్లగా అదీచూస్తా" అన్నాడు

రాముడు. గంగి రెద్దు ఇంటి ముందు ఆగింది.

"పెబువు గారికీ దణ్ణం పెట్టు" అన్నాడు గంగెద్దుల వాడు. ముందటి కుడికాలు వంచి దండం పెట్టింది గంగి రెద్దు. గొల్లుమన్నారు పిల్లలు.

"బాబు పెళ్లి ఈ యేడైతుందా చెప్పు బసవన్నా !" అన్నాడు గంగెద్దుల వాడు,

తల వూపింది యెద్దు. సీత ఇంట్లోకి పరిగెత్తింది. పాత ధోతి తెచ్చి ఇచ్చింది గంగెద్దులవాడికి. రాముడు ముసి ముసి నవ్వులు నవ్వాడు. గంగిరెద్దు మళ్లీ వంగి దణ్ణం పెట్టింది. గంగెద్దుల వాడు డబడబా డోలు వాయించాడు. పిల్లలు కిలకిలా నవ్వారు. సీత తల్లి వొడ్లు చాటలో తెచ్చి గంగెద్ల వాడి జోలెలో పోసింది. ఇటు చూసేవరకు రాముడు కనపడ్డాడు. ఆమెను చూడగానే మొఖం తిప్పుకొని దూరంగా పోతున్నాడు రాముడు. సీత తల్లి రాముణ్ణి పిలిచింది. దగ్గరగా వచ్చి నిల్చున్నాడు.

"ఏం నాయనా పోతున్నావు?" అని అడిగింది.

"ఏం లేదత్తా" అన్నాడు రాముడు.

"అయ్య చూస్తాడని బయపడుతున్నడు" అంది సీత. "నాకేం బయం" అన్నాడు రాముడు. అన్నాడే గాని గుండె గతుక్కుమంటున్నది. బుర్రమీసాల పుల్లయ్య కర్ర తీసుకొని ఎటునుంచొస్తాడో అని భయంగానేవుంది

"మాకూ మీకూవున్న పాత పంచాయితీలకు మీరు కష్టపడుతున్నారు నాయనా మీరేం చేశారని?" అంది సీత తల్లి.

"ఆ ఆలోచన అయ్యకు లేదవ్వా" అంది సీత.

"ఎప్పుడొస్తదో బుద్ది" అని తల పట్టుకుంది సీత తల్లి.

"రమారమణ గోవిందో హరి
హరిలో రంగ, రంగ హరిలో రంగ"

అంటూ సాతాని జియ్యరు గెంతుతూ వచ్చాడు. నున్నగా రాగి చెంబులాంటి తల. తలమీద గుడ్డ చుట్టకుదురు. కుదురు మీద రాగి అక్షయపాత్ర. దానికి బంతి పూల హారం. మొఖాన దట్టంగా ఊర్ధ్వ పుండ్రాలు మెడలో బంతిపూల దండలు నడుముకు ఎర్ర పట్టుకండువా, పింజాలు పోసి కట్టిన తెల్ల ధోతి, చేతిలో చిరతలు, బొమ్మలెగరేస్తూ, పాడుతూ, హుషారుగా వున్నాడు జియ్యరు. అతన్ని చూసి పక్కున నవ్వింది సీత. "నవ్వుతే నవ్వావు గానీ నువ్వులు దానం చెయ్యమ్మా:" అన్నాడు జియ్యరు.

"బావా! నువ్వులు కావాలట" అంది

"తెచ్చి పెట్టవే సీతా:" అని బుగ్గ మీద గిల్లాడు రాముడు.

"ఎవడ్రా వాడు" అని అరుపు విని పించింది. ఉలిక్కిపడి చూచారంతా. బుర్ర మీసాల పుల్లయ్య కర్ర తీసుకుని ఉరికొచ్చాడు. చస్తినిరా అనుకుంటూ రాముడు లగెత్తాడు.

"పండగనాడు వాడిమీదకు ఉరుకుతవేమయ్యా! వాడేమన్నడు?" అంది సీత తల్లి.

"ఆడు మనింటి కెందు కొచ్చినట్టూ అంట?"

"ఏదో ఆడుకుంటాని కొచ్చిండు"

"మీసాలు గడ్డాలు వచ్చినై. ఇంకా ఆటా? అయినా ఆడపిల్లతో ఏమాట?"

"చిలకా గోరింకల్లా వున్నారయ్యా పెండ్లి చేయండి" అన్నాడు జియ్యరు.

"సాతానాయనా! నోరు మూసుకొని నీ దారిన నువ్వు పోతవా? పండగనాడు పంచాయితి పెట్టుకుంటవా?" అని గర్జించాడు బుర్రమీసాల పుల్లయ్య,

"పంచాయతి నాకెందుకు బాబూ. మీ ఇల్లు చల్ల గుండ, సామగ్రి ఇప్పించండి" అన్నాడు జియ్యరు.

"పడేయవే బియ్యం" అని అరిచాడు పుల్లయ్య. సీత భయం భయంగా దోసిలి నిండా తెల్లటి బియ్యం తెచ్చి ఎర్రటి రాగి అక్షయపాత్రలో పోసింది. అక్షయపాత్ర ఆమెకు అందేట్టు మోకాలి మీద గరుత్మంతుడిలా వంగాడు జియ్యరు. దోసిలి సాచి పాత్రలోకి బియ్యం జార



విడిచింది సీత. కంటిలోనించి కన్నీటి చుక్క జియ్యరు బుజంమీద రాలింది. వేడి కన్నీటి చుక్క బుజంమీద పడేసరికి జియ్యరుకు అర్థమైపోయింది. సీత బాధ.

"ఇక పో" అని అరిచాడు పుల్లయ్య,

"పోతున్నా! చల్లగా వర్ధిల్లు తల్లీ" అంటూ వెళ్లాడు జియ్యరు. దూరంగా చిరతల మోత వినిపిస్తుంటే అటేచూస్తూ నిలుచున్నది సీత. ఆ పూట సీతకి అన్నం సయించలేదు. "పండగనాడు అన్నం సరీగా తినవేమే?" అని తల్లి అడిగితే జవాబు చెప్పకుండా చేయి కడుక్కుని లేచిపోయింది సీత..

చుట్ట కాల్చుకుంటూ ఇంటిముందట అరుగు మీద కూచున్నాడు పుల్లయ్య. ఇంతలో సుబ్బరామయ్యగారు దారిన వెళుతూ పుల్లయ్యను చూశాడు.

"రండి రండి దండాలు" అన్నాడు. పుల్లయ్య,

"దీర్ఘాయుష్మాన్ భవ, ఏం పుల్లయ్యా!"

"ఏముందీ. సంకురాత్రి వొచ్చింది. పండుగలు వస్తుంటాయి పోతుంటాయి. పండగ పండగకూ హడావుళ్లు" అని నసిగాడు పుల్లయ్య.

"అలా అనకు పుల్లయ్యా? సంకురాత్రి పెద్ద పండగ. పండగల్లో కెల్లా పండగ. ఇవాళ సూర్యుడు ఉత్తరాయణంలో ప్రవేశిస్తాడు."

"ఏడకు పోతే మన కేమిటంట."

"అట్లా కాదు పుల్లయ్యా! ఇవాళటితో నరకద్వారం బంద్దైతుంది. స్వర్గద్వారాలు తెరుచు కుంటాయి. అందుకే భీష్ముడు ఉత్తరాయణం వచ్చేదాక జీవించివుండి ఆ తరువాత ప్రాణాలు విడిచాడు" అని వివరించాడు సుబ్బరామయ్య. ఇంతలో ఇంట్లోనుంచి సన్నగా ఏడ్పు వినపడ్డది.

"ఎవరా పండగ నాడు ఏడుస్తున్నది?" అనడిగాడు సుబ్బరామయ్య,

"తల్లన్న అయ్యుండాలి, పిల్లన్నా అయ్యుండాలి" అన్నారు పుల్లయ్య,

"పండగనాడు ఏడ్పెందుకు ?"

"అదుగో, ఆ రాముడుగాడితో పరాచికాలు వద్దన్నానని,"

"ఇదుగో పుల్లయ్యా! రాముడు పేదవాడు కావచ్చు గాని మంచివాడు. ఎప్పటి వైరాలో మనసులో పెట్టుకుని మాణిక్యాన్ని పారేసుకోకు."

"ఏం మాణిక్యమో!"

"తప్పి పోయిన్నాడు తెలుస్తుంది. మాణిక్యం విలువ" అన్నాడు సుబ్బరామయ్య.

"అట్లా చెప్పండయ్యా ?" అంటూ వచ్చింది సీత తల్లి.

"ఇవాళ పెద్ద పండగ. పేదలకూ సాదలకూ అందరికీ పండగ, దాన్యం లక్ష్మీవంటిది. ఇళ్ళల్లో ప్రవేశించిన మంచిరోజుల్లో ఈ పండగ వస్తుంది. కనుక ఇవ్వాళ అన్ని ద్వేషాలు మరిచి పోవాలి." అన్నారు. సుబ్బరామయ్య, గబగబా ఇంట్లోకి వెళ్లాడు. సీతని బయటికి తీసుకొచ్చాడు.

"నీవు నా కూతురులాంటి దానివి, నీకు శుభం అయ్యేట్టు చేస్తానమ్మా" అంటూ ఓదార్చాడు.

"ఇదుగో పుల్లయ్యా! నా మీద ఏమాత్రం గురివున్నా నా మాట విను. నీకు మేలు కలుగుతుంది. పెద్దవాణ్ణి చెబుతున్నా" అన్నాడు సుబ్బరామయ్య.

ఇంతలో చుట్టుపక్కల పిల్లలంతా వాకిట్లో గుమిగూడారు.

"గొబ్బిళ్ళో గొబ్బిళ్ళో" అంటూ గొబ్బి తట్టడం మొదలుపెట్టారు. హృదయంలో ఏమాత్రం కళంకంలేని ఆ పసిపాపలను చూస్తుంటే పుల్లయ్య మనస్సు జల్లుమంది.

"అయితే ఏం చేయమంటారు సుబ్బరామయ్యగారూ!" అంటూ దగ్గరగా వచ్చాడు పుల్లయ్య,

"నా మాట విని ఈ పెద్ద పండగ నాడు నీ మనస్సు మార్చుకో. రాముడి తండ్రికీ, నీకు వున్న తగాదా అతను పోయిన్నాడే పోయిందనుకో, చచ్చి ఏ స్వర్గాన ఉన్నాడో అతనూ ఆనందిస్తాడు. రాముడికిచ్చి సీత పెళ్లి చేయి" అన్నాడు సుబ్బరామయ్య.

కిలకిల నవ్వింది సీత. ఇంట్లోకి కొత్త వెలుతురు ఒచ్చినట్టైంది. హృదయాలలో వెచ్చదనం ప్రవేశించింది.

రాముడు దూరంగా దాక్కుని దాక్కుని వెళ్లిపోతున్నాడు. సుబ్బరామయ్య కంట పడ్డాడతను.

"అరే రాముడూ! ఇంకా భయమెందుకూ! రా" అని పిలిచాడు సుబ్బరామయ్య, రాముడు రాలేదు. పుల్లయ్య వాకిట్లోకి వచ్చి "రాముడూ" అన్నాడు.

"రా నాయనా! రా" అంది సీత తల్లి. సీత సిగ్గుతో ఇంట్లోకి పరిగెత్తింది. రాముడు తల వంచుకుని వచ్చి ఇంటి ముందర నిలబడ్డాడు.

"డూ డూ డూ బసవన్నా!" అంటూ పాడుకుంటూ పోతున్నాడు గంగెద్దులవాడు. "బసవన్నంటే ఆ ఎద్దుకాదు. మా పుల్లయ్యే ఇవాళటి నించి బసవన్న. మేం చెప్పినట్టు వింటాడు" అన్నాడు సుబ్బరామయ్య,

"మీ మాట చలవవల్ల మా యిల్లు నిలబడింది. సుబ్బరామయ్యగారూ" అంది సీత తల్లి.

"అదంతా నా మహిమకాదు. సంకురాత్రి మహిమ. సూర్యుడు అడుగో మనందరికీ సాక్షి, ఆతడు మకరంలోకి ప్రవేశించాడు. పుల్లయ్య తన మొనలి పట్టు వదిలి పెట్టి దారికొచ్చాడు" అన్నాడు సుబ్బరామయ్య...

"ఏదో నాకు సరైన దారి చూపించారు సుబ్బరామయ్యగారూ" అన్నాడు. పుల్లయ్య. గబగబా లోపలికిపోయి ఇన్ని దోసకాయలూ, లేత లేత జొన్న కంకులూ తెచ్చి సుబ్బరామయ్య ఒడిలో పోశాడు. రాముడు సుబ్బరామయ్యకు దండం పెట్టాడు.

"అత్తా మామలకు దండం పెట్టు, నాకు దండం పెట్టడానికేం గాని" అన్నాడు సుబ్బరామయ్య.

అంతా కిలకిలా నవ్వారు. రాముడు సమయం చూచి తుర్రుమన్నాడు. సీత పెరటి దారిని పొలంగట్టుకు చేరింది. గడ్డివామి వద్ద ఇద్దరూ కలుసుకున్నారు. వాలిపోతున్న సంక్రాంతి సూర్యుడు వారి ఇరువురి ఒడులలో దోసిళ్లకొద్దీ బంతిపూలు కుమ్మరించాడు.

**(యువ పత్రిక నుండి)**

కవిత

# ఈరోజు గడిచేలోపు



రవీంద్రసూరి నామాల, 98483 21079

నిన్నటిని తీసుకొస్తవా
రేపు జరగబోయేదాన్ని ఆపుతవా..!
నువ్వు ఏం చేయాలన్నా ఈరోజే

ఇలా జరిగిందేంటని వెతుకులాటొద్దు
అయ్యో..!
అలా జరగబోతోందని బెంగపడొద్దు

పట్టింపులు, పంతాలకు స్వస్తి పలకాలి
తెలిసో, తెలియకో గతంలో చేసిన
పాపాల పరిశుభ్రతకు, పశ్చాత్తాపాలకు
సరైన సమయం నేడు..

ఈరోజు గడిచేలోపు
మనిషిగా మారే అవకాశం ఉంది నీకు

నువ్వు ఆడిన అబద్ధాలు
నిజం చేయడానికి ఓ గంట
మరో గంట గడిచేలోపు ఎదుటి వాడిపై
నీ కడుపు మంటను అణిచేయొచ్చు
నీ బంధువులను దూరం చేసుకుని
నిన్ను నువ్వు అమ్ముకొని
సంపాయించిన పాపపు సొమ్ముకు నిప్పంటించాలి
నిప్పుతో కాలితే ఇనుమే కాదు
ఇగో కూడా వొంగుద్దని నిరూపించే నీ రోజు ఇది

శత్రువులైన నీమిత్రులు
నిన్ను మనిషిగా గుర్తించడానికి
మరో అవకాశం ఈరోజు
ఈరోజు నీది
దాన్ని గతం చేయడమా...
నీ పాత మనిషిని ఖతం చేసుకోవడమా
నీ చేతుల్లోనే ఉంది

రోజు రోజుకు మించేస్తున్న
అహం అణిగి పోయిందంటే
నువ్వు పైకి లేచినట్టే

ఈరోజు నీలో ఉంది
ఛలో నిన్ను చంపేద్దాం
ఈరోజు గడిచేలోపు
కొత్త మనిషై మళ్లీ పుట్టొచ్చు



వ్యాసం

# తంత్రీనాదాల్లో నిక్షిప్తమైన జానపద కళల వైభవం... ఈనాటి దైన్యం

**బుర్రవీణ కళాకారుడు దాసరి కొండప్ప కళామయ దైన్య జీవితం...**



జంపాల ప్రవీణ్
99512 11817

జానపద సాహిత్య కళారూపాలు సామాజిక విజ్ఞానానికి ఆధార గ్రంథాల వంటివి. అందులోనూ ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాలలోని జానపద కళా రూపాలు చాలా వరకు పరిశోధనార్హత కలిగి ఉన్నాయి. అవి ఎంతో ప్రాముఖ్య తని, ప్రజాదరణని పొంది ఉన్నాయి. ముఖ్యంగా గిరిజన, ఆదివాసి సమూహాల జీవనరీతులు వారి పట్ల ఒక సదవ గాహనతో కూడిన అధ్యయనాలు ఇంకా రావాల్సి ఉంది. ఎందుకంటే జానపద ఆదివాసి సమాజంలో వాయిద్యాల పుట్టుక నుంచి ఇప్పటిదాకా వింటున్న, వాయిస్తున్న ధ్వనులలో జీవన వాస్తవికత ఎక్కువగా చోటు చేసుకుని ఉంది. పరిశోధనల వల్ల చాలా కళారూపాలు వెలికి వస్తున్నాయి. రకరకాల సంగీత ధ్వనులు,బాణీలు, పాటలతో సమాజాన్ని ఒక సమూహంగా చైతన్య పరచడానికి వాయిద్యాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. రోజువారీ జీవన విధానంలో ఎన్నో ధ్వనులు వింటుంటాం, ఒక స్వరంలో శృతిలో విన్న పాటలు సంగీతాలు అన్నీ కూడా మూలవాసులైన ఆదివాసుల నుంచి వెలువడినట్లుగా తెలుస్తున్నది. కళలు, సంగీతం, చిత్రం జానపద కళారూపాలలో వేరువేరువి కాదు. అవి అన్నీ కలగలిసిన సమాహార రూపం. ప్రస్తుత ఒడిదొడుకుల జీవితంలో ఈ కళారూపాలను పట్టించుకునేవారు అరుదుగా ఉన్నారు. వర్తమానంలో జానపద కళలు వేగంగా అంతరించి పోతున్నాయి. నగరీకరణ, సాంకేతిక మార్పుల వలన పాత ఉత్పత్తి సంబంధాలు లుప్తమై పోతుంటే కళలు అంతరించే వేగం పెరిగిపోయింది.

అలాంటి వాటిలో బుర్రవీణ ఒకటి.



ఒక్కొక్క కులానికి, ఉపకులానికి ఒక ప్రత్యేక సంగీత వాద్యంతో పాటు అపురూపమైన ప్రదర్శన విధానం కూడ ఉంటుంది. సంగీత వాద్యాలు ప్రధానంగా ప్రదర్శనల పేర్లు, కథల పేర్లు తమలో నిబిడీకృతమై ఉన్నట్టుగా ఉంటాయి. ఉదా: శారద కథ, జమీడిక కథ, ఒగ్గుకథ వంటివి. అలాంటి వాటిలో బుర్ర వీణ ప్రాముఖ్యమైనది. ఇంత విలక్షణమైన సంగీత వాద్యం గురించి, దాని వాదకుడి జీవనశైలీ, గతం, వర్తమాన పరిస్థితుల గురించి తెలియజేయటమే ఈ వ్యాసం ఉద్దేశం.

బుర్రవీణ కళాకారుడు దాసరి కొండప్ప. ఇతని వయస్సు 70 ఏళ్లు. ఈయన తెలంగాణలోని నారాయణపేట జిల్లా (ఉమ్మడి మహబూబ్ నగర్) దామరగిద్ద గ్రామానికి చెందిన వ్యక్తి. మాల దాసరి/దండ దాసరి (దళిత) కులానికి చెందినవారు. వీళ్ల మాలలకు ఆశ్రితులు. అందుకే వీరిని ఆశ్రిత కుల వ్యవస్థలో భాగంగా చూడాలి. ఈ కళాకారుడు వాయించే తంత్రీ వాయిద్యం పేరు బుర్రవీణ.

బుర్రవీణ ఏక్తారా, తాంబూర కుటుంబానికి చెందినది. ఇది 'భూమి

వీణ', 'విల్లాడి వాయిద్యాన్ని' పోలినట్టుగా ఉంటుంది. కొండప్ప కన్నడం, తెలుగు, హిందీ భాషలలో ఎన్నో పాటలు పాడుతారు. అందులో జ్ఞాన తత్వం, ఆత్మ తత్వాలకి సంబంధించిన గీతాలు ఉంటాయి. ఈ వాయిద్యంలో 24 రకాల స్వరాలు పలికించగలనని కొండప్ప చెప్తాడు. కుడి చేతితో చిన్న వెదురు బద్దతో తీగలపై కొడుతూ అద్భుతమైన సంగీతం వెలువరిస్తాడు. దానికి చేతితో అల్లిన మువ్వల ద్వారా శ్రావ్యమైన ధ్వని వినిపిస్తుంది. ఈ ధ్వని ప్రదర్శనలో మొత్తం నాలుగు రకాల సంగీత ధ్వనులు వస్తాయి. ఒకటి నోటి నుంచి వచ్చే శబ్దం పాట వెలువడే రూపంలో, రెండోది బుర్ర నుంచి మంద్రస్వరంలో వచ్చే నాదం, మూడోది తీగల ధ్వని, నాలుగోది మువ్వల శబ్దం. ఇలా ఒకేసారి వినసొంపైన సంగీతాన్ని వినిపిస్తాయి.

కొండప్ప మాలలని ఆశ్రయించి తత్వగీతాలు, భాగవత, రామాయణ గీతాలు, బతుకమ్మ పాటలు, సత్య హరిశ్చంద్ర, భక్తి పాటలు, వీర బ్రహ్మంగారి కాలజ్ఞాన తత్వాలు, మన్యంకొండ హనుమద్దాసు కీర్తనలు పాడతాడు. ఈ పాటలన్నీ ధారాళంగా ఒక్కడే వివరించి పాడగలడు. అంటే దాదాపు రెండు మూడు గంటలకు పైగా వినసొంపుగా గానం చేస్తాడు. ప్రారంభంలో తన వాయిద్యాన్ని చేతితో మొక్కి దండం పెట్టుకొని పాటను ఎత్తుకుంటాడు. తరువాత 30 సెకండ్ల నుంచి 40 సెకండ్ల వరకు వాటి నాదాలని శృతి పెట్టుకొని వెలువరిస్తారు. ఆ తరువాత పాటను మొదలుపెడతాడు. ఈయన నిరక్ష రాస్యుడు అయినా వందలాది మందికి చెప్పే సత్తా తనకు ఉన్నది. ఈయనకు కీర్తిశేషుడైన తండ్రి వాయిద్యం నేర్పిస్తే, వాళ్ల అన్న గీతాలను వారసత్వంగా అందించారు. కథను మొత్తం మౌఖికంగా చెబుతాడు. ముగింపులో గోవింద నామంతో ఆయనకు ఇష్టమైన శ్రీ వేంకటేశ్వరస్వామిని తలుచుకొని ముగిస్తారు. భిన్నమైన రాగాలలో స్వరాలను ఆలపిస్తాడు పాటను పాడుతాడు. ఇలాంటి సంగీత కారుడు తెలంగాణలో దాసరి కొండప్ప ఒక్కడే సజీవంగా ఉన్నారు. దళిత బహుజన పాటలు ఇందులో కలుపుకొని వచ్చే తంత్రీ వాయిద్యంగా బుర్ర వీణతో తత్వ గీతాలను ఆలపిస్తారు. ఇంత విలక్షణమైన వాద్యాన్ని తయారు చేసే విధానం చెప్పుకోదగింది.

**బుర్రవీణను** తయారు చేసేటప్పుడు ముందుగా ముదురు సొరకాయనికానీ, గుమ్మడికాయనికానీ ఎన్నుకుంటారు. ఈ కాయలు ముదురు అవ్వడానికి చెట్టుమీద సుమారు 8 నెలలు లేదా ఒక సంవత్సర కాలం పడుతుంది. తెంపిన ఈ కాయలు అరడానికి 2నెలలు పడుతుంది. బీటలు పడకూడదు ఎందుకంటే బుర్రలు బీటలు వారితే నాదం పలకదు.

బుర్రవీణను తయారు చేసేటప్పుడు ముందుగా ముదురు సొరకాయనికానీ, గుమ్మడికాయనికానీ ఎన్నుకుంటారు. ఈ కాయలు ముదురు అవ్వడానికి చెట్టుమీద సుమారు 8 నెలలు లేదా ఒక సంవత్సర కాలం పడుతుంది. తెంపిన ఈ కాయలు అరడానికి 2నెలలు పడుతుంది. బీటలు పడకూడదు ఎందుకంటే బుర్రలు బీటలు వారితే నాదం పలకదు.

బుర్ర ఎండిపోయిన తర్వాత దాని లోపలి గింజలు తీసి ఒక వెదురు బొంగు కర్రను తెచ్చి దానిని సొరకాయ లేదా గుమ్మడికాయ బుర్రలోకి అమర్చి బుర్ర మీద ఒక చెక్క మెట్టుని మైనంతో పెట్టుకొని మూడు ఇనుప తీగలు కడతారు. తీగలు వివిధ రకాల నాదాలు రావడానికి వీలుగా చిట్టెలు, మామిడి కలపతో తయారు చేసిన కొమ్ములను చివరి బొంగు కర్రకు బిగిస్తారు. మీటడానికి వెదురు బద్ద పుల్లలతో ఒక వెదురు పుల్లకు గుండ్రంటి ఆకారంలో తీగతో గజ్జలు కట్టి ఇంకోపుల్లను ఆ గజ్జల కొప్పుకు బిగిస్తారు. ఈ పరికరాలన్నీ సహజంగా ప్రకృతి నుంచి వచ్చినవి. వాళ్ళు నివసించే ప్రాంతమైన నల్లమల్ల అడవులలో ఇవి దొరుకుతాయి. కొండప్ప ఈ వాయిద్యాన్ని తానే స్వయంగా తయారు చేసుకుంటాడు.ఇది తయారు చేయడానికి సుమారు వారం పది రోజులు పడుతుంది.

### బుర్రవీణ, కళాకారుని అలంకరణ...

ఈ విధంగా తయారైన వాద్యం బుర్రకు తెల్లని విభూది,కుంకుమ నామాల బొట్లతో అలంకరిస్తాడు దాసరి కొండప్ప. తెల్ల పంచె, అంగి వేసుకొని, నెత్తికి రుమాల్ చుట్టుకొని నుదుటిమీద నామల బొట్టు పెట్టుకొని ఎడమ భుజం మీద కండువా వేసుకొని ఇతను నేలమీద పరిచిన చాప పై కూర్చొని పాటను ప్రారంభిస్తాడు. వాయిద్యానికి చూడముచ్చటైన రూపంతో అలంకరణ చేస్తాడు. ఈ అలంకరణతో తన కులాల వాళ్ల ఇండ్లకు సంచరిస్తూ ఉంటాడు. మాల దాసరుల వైష్ణవ భక్తిని ప్రచారం చేస్తారు.

**వీరు పాడే ఒక గీతం**

శీర్షిక: కానరయ్య గురుని,
కల్యాణి రాగం ఆది తాళం,
జ్ఞాన తత్వం
కానరయ్యా గురుని
మానరయ్యా భ్రమలు
కానరయ్య గురుని నరులు
మానరయ్యా మాయ భ్రమలు
నానా జన్మము తిరిగి వచ్చిన మానవ జన్మమ్ములో ముక్తి
కానరయ్య గురుని మానరయ్య భ్రమలు
యోనిలోనే పుట్టి
మూత్రపు యోనినే మోహించి
మురికి యోనిమర్మము తెలియక
మతి హీనులై చెడిపోయేటినరులు
కానరయ్యా గురుని
మానరయ్యా భ్రమలు
కానరయ్యా గురుని నరులు
మానరయ్యా మాయ భ్రమలు
నానా జన్మము తిరిగి వచ్చిన
మానవ జన్మములో ముక్తి
కానరయ్యా గురునీ మానరయ్యా భ్రమలు
ఆలుపిల్లలు తన వారనుచూ

వ్యాసం

చాలా నమ్మి యుండేటివారు
కాలం వచ్చి పోయేటప్పుడు
వాళ్లు ఎవ్వరూ కమ్మీపోదురు
కానరయ్య గురుని మానరయ్య భ్రమలు
కానరయ్య గురుని నరులు
మానరయ్య మాయ భ్రమలు
నానా జన్మము తిరిగి వచ్చిన
మానవ జన్మమ్ములో ముక్తి
కానరయ్యా గురుని మానరయ్యా భ్రమలు
తొంట తొంట పనులు చేసి
గంటూ సంపాదించి మోసి
మట్టిలోన పోయేటప్పుడు
సొంతి కొమ్మైనా ఎంటరాదు
కానరయ్యా గురుని మానరయ్యా భ్రమలు
కానరయ్య గురుని నరులు
మానరయ్యా మాయ భ్రమలు
నానా జన్మము తిరిగి వచ్చిన
మానవ జన్మములో ముక్తి
కానరయ్యా గురుని మానరయ్యా భ్రమలు
యసనే బహుమోసం అనుచు
మోసమే యమపాశం అనుచు
పాశంముఖ పొరలి పొరలి
వ్యసనంబై అయ్యేటి నరులు
కానరయ్య గురుని మానరయ్య భ్రమలు
కానరయ్య గురుని నరులు
మానరయ్య మాయ భ్రమలు
నానా జన్మము తిరిగి వచ్చిన
మానవ జన్మములో ముక్తి
కానరయ్యా గురుని మానరయ్యా భ్రమలు
జ్ఞాన భక్తి తెలిసి నిత్యాదాన ధర్మం
చేసి పరశివ
ధ్యానం అందునా ధ్యానము మరసి
ఆనందమున చెందనివారు
కానరయ్య గురుని మానరయ్యా భ్రమలు
కానరయ్య గురుని నరులు
మానరయ్య మాయ భ్రమలు
నానా జన్మము తిరిగి వచ్చిన మానవ
జన్మములో ముక్తి
కానరయ్య గురుని మానరయ్య భ్రమలు
భూతపంచ స్థూల తనవు తాత శ్రీ
గురువన్న దానికి
విఖ్యాతముగ నరపించి నిజ
అవధూతమున చెందని వారు
కానరయ్యా గురుని మానరయ్యా భ్రమలు



కానరయ్య గురునీ నరులు
మానరయ్యా మాయ భ్రమలు
నానా జన్మము తిరిగి వచ్చిన మానవ
జన్మములో ముక్తి
కానరయ్యా గురుని మానరయ్యా భ్రమలు
జై, రామము రామము రామము సత్ గురునాత్ మహరాజుకు జై, లక్ష్మి పార్వతి రమణ దేవికి జై,

మూఢనమ్మకపు భ్రమలో మానవుల మధ్యన ఉండే సామాజిక అసమానతలు, అరాచకాలను ఈ జ్ఞాన తత్వంలో వివరిస్తుంది. అదే గీతం కళాకారుని నోట జాలువారుతుంది. మానవుల భ్రమల గురించి మాట్లాడుతూ వెలువరించిన యోని మర్మము చాలా లోతైన తాత్వికతను తెలుపుతుంది. పుట్టుకకు స్థానమైన యోని తిరిగి మోహ స్థావరమై మరొక జన్మకు దారి తీస్తుంది. ఇది జీవన వలయం. జీవనాన్ని అలవోకగా ఈ తత్వ గీతం విశదీకరిస్తుంది. ఎన్నిజన్మముల తరువాత తిరిగి వచ్చినా మానవ జన్మం ద్వారా కలిగే ముక్తి గురించి ఈ పాటల్లో చూడవచ్చు. ఇహబంధాల నుండి గురువు ఇచ్చే సన్మార్గం జీవితానికి దారి చూపెడుతుంది. కుటుంబ సభ్యులకు ఇచ్చే గౌరవ మర్యాదలు డబ్బు, జబ్బుతో మట్టిలో కలిసి పోతాయని కవి భావంగా చూడొచ్చు. ఏది కూడా స్వంతం, శాశ్వతం కాదు అని నిరూపిస్తుంది. ఐహిక జీవితానికి ఆవల పంచ భూయుక్తమైన తనువు నశ్వరత గురించి కూడా ఈ గీతం తెలుపుతుంది. ఈ మాయ భ్రమ నుండి ముక్తి మార్గం వైపుకి గురువు మాత్రమే తీసుకొని వెళ్తాడు అనేది గీతపు పరమార్థం. ఇలాంటి తత్వాలు 10 నుంచి 15 దాకా రికార్డు చేసి ఉన్నాయి. వీటి ద్వారా సమాజం కొంత ఆచరించి ఆలోచనలను కల్గించి సరియైన మార్గంలో నడుస్తుందని భావిస్తున్నాను.

**బుర్ర వీణ పరిపోషణ, పరిరక్షణ...**

2016 సంవత్సరంలో ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు బృందం బుర్ర వీణ కళాకారున్ని గుర్తించి సమాజానికి పరిచయం చేశారు. నైపుణ్యం గల కళాకారుడిగా కీర్తించారు. ఆయన బుర్రవీణ మీద వ్యాసాలు రాశారు. 2019 సంవత్సరంలో ప్రొ॥ గూడూరు మనోజ గారు కొత్త తరం పిల్లలకు కొండప్పతో బుర్రవీణ నేర్పించే ఏర్పాటు చేశారు. కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయం మహబూబ్ నగర్ లో 25-30 మంది బాలికలకు నెల రోజులు శిక్షణ శిబిరం నిర్వహించారు. అందులో ముగ్గురు పిల్లలు పూర్తిగా నేర్చుకున్నారు. ఆ సంవత్సరంలో జనవరి 26 గణతంత్ర దినోత్సవ వేడుకల నాడు ఈ ముగ్గురు పిల్లలు వాళ్ల విద్యాలయంలో బుర్ర వీణ గానాన్ని ప్రదర్శించారు. 2021 సంవత్సరంలో మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ జానపద కళా రూపాలను 67 మంది కళాకారులతో నిర్వహించారు. ఈ ప్రదర్శనలో బుర్రవీణ వాయిద్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.పల్లె నుంచి

పట్టణానికి బయలుదేరిన బుర్రవీణ చదువుల తల్లి లాంటి ఉస్మానియా విశ్వ విద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో 2019 మార్చి 9న హైదరాబాదులో 200 మంది కళాకారులతో మూలధ్వని కార్యక్రమం జరిగింది. ఒకే వేదికపై ప్రదర్శన ఇచ్చారు. తంత్రివాద్యాలలో బుర్రవీణ ప్రాముఖ్యమైనది. మూలధ్వని కార్యక్రమం ద్వారా వివిధ రకాల జానపద వాయిద్యాల చరిత్రను మూలధ్వని పుస్తకంలో ముద్రించారు. ఈ పుస్తకం జానపద పరిశోధకులకు ప్రామాణిక గ్రంథంగా ఉపయోగపడుతుంది. మూలధ్వని నుంచి ఆదిధ్వనికి పరిణమించిన బుర్ర వీణ ఇక్కడ తన ప్రత్యేకతను సంతరించుకుంది. 2019లో స్టేట్ ఆర్ట్ గ్యాలరీ మాదాపూర్ హైదరాబాదులో ఈ ప్రదర్శనను నిర్వహించారు. తెలంగాణ నుంచి ఆంధ్ర ప్రాంతమైన గుంటూరులో నన్నపనేటి ఫౌండేషన్, బొమ్మిడాల ఫౌండేషన్ వారు 2020 సంవత్సరంలో ఆది ధ్వని కార్యక్రమం ఏర్పాటు చేసి దాని ద్వారా అక్కడి ప్రజలకు ఈ బుర్ర వీణ పాటను చూసే అవకాశం లభించింది. ఈ కళాకారులని అభిమానించే కృష్ణారావు గారు కొండప్పకి బతికి ఉన్నంతకాలం నెల నెల రెండు వేలు ఆర్థిక సహాయాన్ని పంపిస్తానని మాట ఇచ్చారు ఇప్పటికీ ఆ ప్రాంతం నుంచి ఈ కళాకారునికి ఆర్థికంగా సాయం అందిస్తున్నారు. 2021 సంవత్సరం ఆగస్టు 15న ఈ వాయిద్యాన్ని మరోసారి మాదాపూర్ స్టేట్ ఆర్ట్ గ్యాలరీ ఆద్యకళ ప్రదర్శనలో పెట్టడం జరిగింది. ఈ ప్రదర్శన ద్వారా చాలామంది మేధావులు, రాజకీయవేత్తలు, వ్యాపారవేత్తలు, సినిమా వాళ్లు గుర్తించే అవకాశం లభించింది. 2023 పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రొ॥ జయధీర్ తిరుమలరావు గారి తొవ్వ ముచ్చట్లు 7వ భాగం పుస్తకావిష్కరణ దాసరి కొండప్ప చేతుల మీదుగా జరిగింది. బలగం సినిమాలలో బ్యాక్గ్రౌండ్ మ్యూజిక్‌లో తన గానాన్ని వినిపించారు ఈ సినిమా దర్శకుడు గీతాన్ని రెండు చరణాలు పాడి వినిపించే అవకాశం తెలుగు సినిమా ఇండస్ట్రీలో మొదటిగా పాడాను అని చెప్పుకొచ్చారు కొండప్ప. "అయ్యో శివుడా ఏమాయే ఎనుకట దానికి సరిపాయే" అనే పాటలో జ్ఞానాన్ని తెలుపుతాడు. మ్యూజిక్ డే సందర్భంగా ఆద్య కళబృందం సాలార్జంగ్ మ్యూజియంలో బుర్రవీణ వాయిద్యం ఆకర్షణగా నిలిచింది. ఇదే సంవత్సరంలో చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీ మాదాపూర్లో ఇండో ఫ్రెంచ్ సంగీత సంగమంలో తెలుగు జానపద పాటలకు గుబాళింపులో భాగంగా సుకాంత బోస్, శాంతినికేతన్ (వోకల్స్), అలెగ్జాండ్ర జూరైన్ ఫ్రాన్స్ (ఎస్రాజ్), ఉస్తద్ నజ్మొద్దీన్ జావిద్ హైదరబాదు (తబలా), దాసరి కొండప్ప దామరగిద్దె (బుర్రవీణ) స్వరంతో వీళ్ళందరూ కలిసి బృందగానం సుమారుగా 2 గంటల పాటు ప్రదర్శన చేశారు. ఇతను పాడిన పాటల లిరిక్స్ ఇంగ్లీషులోకి ట్రాన్స్‌లేషన్ చేసుకున్నారు. భారతదేశంలో తెలంగాణకు చెందినటువంటి కళాకారుడు వీళ్ళతో కలిసి ప్రదర్శించడం అనేది చాలా గౌరవ ప్రదమైంది. జానపద కళల చరిత్రలో మరుపురానిది.

### సమస్యలు, పరిష్కారాలు...

బుర్ర వీణ కళాకారుడు దాసరి కొండప్ప ఒక్కడు మాత్రమే ఉన్నాడు. చిన్నకొండ పైన చిల్లులు పట్టిన రేకుల ఇంట్లో జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. పాటలు పాడడం వల్ల పొట్ట గడవడం లేదు.కుటుంబ సభ్యులు కూలి నాలి చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. వచ్చేతరానికి తెలియజేయాలంటే అంతరించిపోతున్నటువంటి ఈ కళకు చాలా శిక్షణ శిబిరాలు జరగాల్సి ఉన్నాయి. సృజనాత్మకతమైన కళాకారుడు దాసరి కొండప్ప ఎంత ఆధునికీకరణ జరిగినప్పటికి దానికి అనుకూలంగా నేర్పించే ఓపిక తనలో ఇంకా ఉన్నది. ఎందుకంటే చిన్నపిల్లలకు నేర్పించినప్పుడు తనలాంటి గాయకుడ్ని తయారు చేయగలను అనే ఆశయంతో నిరీక్షిస్తున్నడు. సాంస్కృతిక ప్రభుత్వ రంగ సంస్థలు, రాష్ట్ర అధికారుల చేతుల మీదుగా అవార్డులు అందుకున్న కొండప్ప వాళ్లు ఇచ్చిన షీల్డు ప్రశంస పత్రాలను కళ అభిమానం ఉన్నవ్యక్తులకు చూపిస్తూ కళను ఎలాగైనా బ్రతికించాలని తపనతో ఖుషిలా తన ఇంటి ముందు గీతాల తపస్సు చేస్తుంటాడు. జానపద పరిశోధకులు, విద్యార్థులు రాసే రాతలతో పాటు వాళ్ళ చేతలలో కూడా చూపించాల్సిన అవసరం ఇప్పుడు ఉన్నది. ఎందుకంటే వైవిధ్య భరితమైన బుర్ర వీణ వాయించడం నేర్చుకుంటే ఈ మౌఖిక చరిత్రను పునరుద్ధరించిన వాళ్లమవుతాం. కళాభిమానం ఉంటే సరిపోదు, అతను పడే కష్టాన్ని కూడా మనము అర్థం చేసుకోగలగాలి. ఆ విధంగా మన చేతలు, ప్రణాళికలు తయారు కావాల్సి ఉన్నది. ఒకవేళ ఈ కళాకారుడు చనిపోతే ఈ వాయిద్యాన్ని తయారుచేసే పనిమంతుడు మరియు కళాకారుడు పోయినట్టే వీళ్ళిద్దరూ కూడా ఒకే మనిషిలో సజీవంగా ఉన్నారు. అనుకోని సంఘటన జరిగితే ఈ కళారూపం అంతరించిపోయే ప్రమాదం ఉన్నది. ప్రస్తుత పరిస్థితులలో వాద్యం బుర్ర దెబ్బతినగా దానికి ప్లాస్టరుతో తాత్కాలిక మరమ్మత్తులు చేస్తూ కార్యక్రమాలను కొనసాగిస్తున్నాడు. కళాకారుడి దీనస్థితికి ఈ వాయిద్యం ప్రతిబింబంగా ఉంది. ఎందుకంటే ఈ వాయిద్యానికి కావాల్సిన బుర్రలు చాలా అరుదుగా దొరుకుతున్నాయి. కానీ ఆద్యకళ బృందం ఈ బుర్రలను కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో తెచ్చే ప్రయత్నం చేస్తున్నది. కానీ ఒక దృఢ సంకల్పంతో ప్రజా వ్యవస్థలో భాగమైన ప్రభుత్వం వీటికి సహకారం అందిస్తే ఈ కళలు నిలుస్తాయి. అప్పుడే అంతరించి పోయే కళలు బతికిబట్ట కడతాయి. ఈ తంత్రీ నాదాల్లో నిక్షిప్తమైన జానపద కళావైభవం అందరం కలగలిసి కాపాడుకోవలసి ఉంది.

(పద్మశ్రీ అవార్డు పొందిన సందర్భంగా...)

# జ్ఞాపకాల తడి

చిన్నప్పటి యాదితో మురిపించే కథ...



డా॥ లింగనబోయిన
లేఖానంద స్వామి
94415 65165

బస్సు దిగి ఇంటి ముఖం పట్టాను. మా ఇల్లు పాత ఊర్లో ఉంటుంది. కొత్త ఊరికి పాత ఊరికి సుమారు ముప్పావు కిలోమీటర్ ఉండొచ్చు. మా ఊరు స్టేజి దగ్గర ఒక పెద్ద జువ్విచెట్టు ఉంది. ఆ చెట్టుకు ఇరువైపులా బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవానికి స్వాగతం సుస్వాగతం అంటూ చాలా ఫ్లెక్సీలు వెలిశాయి. యూత్ వ్యక్తిగతంగా పెట్టినవి, సాహితీ కళా రంగాలకు సంబంధించిన సంస్థలు పెట్టినవి, రకరకాల రంగులతో అందంగా తీర్చిదిద్ది ఆ స్టేజిని నింపాయి. దుమ్ము ధూళితో గుంతలమయంగ వుండే దారి ఈమధ్యనే తారురోడ్డు వేసినట్లున్నది. వయస్సు మీదున్న నల్లత్రాసు పడుకొని వున్నట్లుగా తళతళా మెరుస్తుంది. రోడ్డు పొడుగునా రకరకాల ఫ్లెక్సీలు  స్వాగత మంటు కట్టబడ్డాయి. అక్కడక్కడ రావి వేప మామిడి మండలతో తోరణాలు వేలాడదీయబడ్డాయి ఆ తోరణాలను చూస్తూ ఉంటే నూతన వధూవరుల నుదుట బాసింగాలు వేలాడుతున్నట్టుగా అనిపిస్తుంది. ఊరంతా సంబరాలను సంతరించుకుని ఉత్సాహంతో ఉరకలు వేస్తున్నట్టుగా కనిపిస్తుంది. బస్టాండ్ నుండి పాత ఊరికి ఆటోలు చీమల బారులా పరుగులు పెడుతున్నాయి. ఆరోజు ఆటోలన్నీ ఉచితంగా ఊళ్ళోకి వచ్చే అందర్నీ  చేరవేస్తున్నట్టుగా చాలామంది ఆటో పిల్లవాళ్ళు చెప్పారు. నన్నూ రమ్మని కొందరు ఆటో డ్రైవర్లు అడిగారు కానీ ఆరు నెలల తర్వాత నేను మా ఇంటికి వెళుతున్నాను కనుక నడుచుకుంటూ వెళుతూ నా పల్లె పొలాల చెల్క చేలనుండి చల్లగా వీచే గాలులను ఊరు అందాలను ఆస్వాదించాలని సున్నితంగా తిరస్కరిస్తూ నడుస్తున్నాను. అర కిలోమీటర్ దూరం వెళ్లగానే నారాయణ రెడ్డి సారు ఇల్లు వచ్చింది. అక్కడ సారు కుర్చీ వేసుకుని వేప చెట్టు కింద కూర్చొని ఉన్నాడు. 'నమస్తే సారు!' అనగానే 'ఏం బాబు బాగున్నావా?' అని నన్ను గుర్తు పట్టి పలకరించాడు. కుశల ప్రశ్నలు వేసిన తర్వాత నేను ముందుకు సాగిపోయాను. మధ్యలో చాలామంది నా పాత స్నేహితులు 'ఎప్పుడొస్తున్నావ్ అన్నయ్య.. ఇప్పుడేనా రాక బావగారు ఇప్పుడే నా రావడం' అనే నాపల్లె జనాల ఆత్మీయ పలకరింపు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తూ ఉంది. ప్రతి ఇల్లు వివిధ రంగులను అద్దుకొని కొత్త పెళ్లి కూతురులా అలంకరించబడి ఉంది. వెనుకటి కాలంలో నైతే మట్టి గోడలతో కట్టబడి గడపలను అలుకు పిడసతో ఎర్రమట్టితో అలికి చీమల బారులు పరిగెడుతున్నట్టుగా సున్నం బొట్లు పెట్టేవాళ్ళు. దాని కింది వైపు తీగలు పాకుతున్నట్టుగా ముగ్గులు పెట్టేవారు. ఇప్పుడు మట్టి గోడల స్థానంలో సిమెంటు బ్రిక్స్ తో నిర్మించబడిన ప్రహరీ గోడలు రంగురంగుల సున్నాలతో అలంకరింపబడి ఉన్నా గడపలన్నీ జాజుతో ఎర్రగా పూయబడ్డాయి. వాటికి తెల్లటి రంగుతో చీమలబారు లాంటి బొట్లు రకరకాల తీగ లాంటి ముగ్గులుతో ప్రతి ఇల్లు నూతన వధువు పాదాలకు పారాణి పూసుకున్నట్లుగా కనిపిస్తుంది. జనమంతా నూతన వస్త్రాలతో వెలిగిపోతున్నారు. యువతులు సీతాకోకచిలకల్లాగా రంగురంగుల వస్త్రాలను ధరించి ధగధగ మెరిసే బట్టలు కట్టి తిరుగుతున్నారు. ప్రతి వీధి మామిడి రావి, వేపా ఆకుల తోరణాలతో వేలాడదీయబడ్డాయి. మొత్తానికి మా ఊరు నూతన ఉత్సాహంతో ఉరకలు పెడుతుంది. ఇలా చూస్తూ చూస్తూ పావుగంట తర్వాత మా ఇంటికి నేను చేరుకున్నాను. ఇల్లు చేరుకుంటే మెయిన్ డోర్ అయితే తెరిసి ఉంది కానీ లోపల ఇంటికి తాళం వేసి ఉంది చుట్టుపక్కల వాళ్ళని వాకబు చేయగా బొడ్రాయి దగ్గరకు మా తమ్ముడు వాళ్ళు వెళ్లినట్లుగా తెలిసింది. మా మరదలు సర్పంచ్ కాబట్టి బొడ్రాయి ప్రతిష్టా కార్యక్రమాన్ని దగ్గరుండి జరిపించాలి కాబట్టి వాళ్ళు అక్కడికి వెళ్లినట్లుగా గమనించాను. తర్వాత కాళ్ళు చేతులు కడుక్కొని పక్కనే వున్న ముత్యాలక్క ఇంటికి వెళ్లాను.

క థ

ఆరుబయట టెంటు వేయబడి వుంది. బంధుమిత్రులు కూర్చొని ఎవరి ముచ్చట్లలో వారు పడి మాట్లాడుకుంటున్నారు. టెంట్ కిందనే ఓ పక్కగా కూర్చొని కొంచెం దూరంగా మాట్లాడుతున్న సరోజనక్కను గుర్తు పట్టి 'అక్క బాగున్నావా' అని అడిగాను 'నువ్వు బాగున్నావా తమ్మి' అంటూ సరోజనక్క నన్ను గుర్తుపట్టి అడిగింది. చాలా రోజుల తర్వాత కనిపించావు' అంటూ ఆనందం వ్యక్తం చేసింది. 'మావయ్య వచ్చాడా?' అని అడిగాను. 'అదిగో మామయ్య' అంటూ దూరంగా కూర్చున్న మామయ్యను చూపించింది. 'నమస్తే మామయ్యా! బాగున్నావా' అంటు దగ్గరికి వెళ్లాను.

'నిన్ను గుర్తుపట్టలేదండి' అని మావయ్య సమాధానమిచ్చాడు.

నన్ను నేను పరిచయం చేసుకుని ఫలానా అని చెప్పగానే వెంటనే గుర్తించి దిగ్గున లేచి నన్ను ఆసాంతం చుట్టి వేశాడు కుశల ప్రశ్నలు వేసిన తర్వాత ఎక్కడ? ఏమిటంటూ అడిగాడు.

మావయ్య యాభైఏళ్ళ కింద మావయ్య ఎట్లా వున్నాడో అట్లనే రివటలాగ వున్నాడు. అదే విషయాన్ని 'ఏంటి మామ నీ విజయ రహస్యం' అంటూ అడిగాను.



సమాధానంగా చిరునవ్వు నవ్వాడు మామయ్య.

'50 సంవత్సరాల కింద ఎట్లా ఉన్నావు ఇప్పుడు అట్లానే ఉన్నావు. ఫుడ్ హ్యాబిట్స్ మంచిగా మెయింటైన్ చేస్తున్నట్టుగా అనిపిస్తుంది. అదంతా మా సరోజనక్క చలవేనంటూ కొంచెం చనువుతో ఆట పట్టించాను. అంతేగా అంటే

'అదేం లేదు తమ్మి మీ మామయ్య మొదటి నుంచి అంతేగా ఉండేది' అంటూ సరోజనక్క నవ్వుతూ సమాధానం చెప్పింది.

ఈ లోపులో మేము మాట్లాడుతుండగా దూరంగా కూర్చుని మమ్మల్ని గమనిస్తున్న గంగమ్మ లేచి మా దగ్గరికి వచ్చింది.

ఎవరు అంటూ తేరిపార చూస్తూ 'వివేక్ అన్నయ్య' అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేసింది. అవునంటూ సమాధానం ఇచ్చాను.

ఆనందపడుతు ఎన్నాళ్లకెన్నాళ్లకు అన్నయ్య అంటూ ఆనంద భాష్పాలు రాలుస్తూ అమాంతం అలుముకుంది. గంగమ్మ తోడబుట్టిన చెల్లెలు కాకున్నా, కులాలు వేరైనా అన్నా చెల్లెలు లాగా చిన్నప్పుడు పెరిగి పెద్దయ్యాము తనకు పెళ్లయింది నాకు పెళ్లయింది నేను ఉద్యోగంతో ఊరు విడిచి వెళ్ళిపోతే తాను పెళ్లి చేసుకొని పెనుగంచిప్రోలుకి వెళ్ళిపోయింది. 40 ఏళ్ల తర్వాత మరల ఇప్పుడే కలవడం చాలా కాలానికి కలవడం వల్ల నాకు ఆనందంతో పాటు ఆశ్చర్యం కలిగింది. ఒకప్పుడు వాళ్ళు ఇక్కడ పొలం పనులు చేస్తూ మంచి జీవనం గడిపే వాళ్ళు. ఆ తర్వాత కాలం కలిసి రాక వాళ్ళ నాయనమ్మ చనిపోవడం అమ్మ అనారోగ్యంతో మిర్యాలగూడ వెళ్ళిపోవటంతో మొదట ఇల్లు అమ్ముకొని ఆ తర్వాత పొలాలు కూడా అమ్ముకొని వాళ్ళ తమ్ముడు వెంకటేశ్వర్లు మిర్యాలగూడలో మఖాం పెట్టాడు. ఇప్పుడు 70 సంవత్సరాల తర్వాత ఊళ్లో బొడ్రాయి ప్రతిష్ట జరుగుతుంది. ముత్యాలక్క కు తోడబుట్టిన అక్కా చెల్లెలు, అన్నా తమ్ముళ్లు లేకపోవడంతో ఈ ప్రతిష్టా కార్యక్రమానికి తన కొడుకుతో చెప్పగా వెంకటేశ్వర్లు వీళ్లను పిలిచాడు. గంగమ్మ ఆ మాట ఈ మాట మాట్లాడుతూ చిన్నప్పటి ఆటలు వామన గుంటలు ఉప్పు బెరా, నాలుగు రాళ్ళాట, అష్టాచమ్మా, వెన్నెల కుప్పలు, దాగుడు మూతలు, ఉడిల్లు, నాలుగు స్తంభాలాట ఆడుకున్న విషయాలను గుర్తు చేసుకున్నాం.

ఈలోపులో మా చిన్నప్పుడు మాతో ఆడుకున్న మా సహవాసగాళ్ళను యాది చేసుకొనే క్రమంలో మట్టయ్యను కూడా గుర్తు చేసుకున్నాం. మట్టయ్య బావ చాలా మంచోడంటూ కళ్ళ నీళ్లు పెట్టుకుంది. ఏందిరా చెల్లే మట్టయ్య గుర్తున్నాడా? అని నేను అడిగాను మట్టయ్య బావను అంత ఇదిగా మర్చిపోతానా బాగా గుర్తు ఉంటది అన్నయ్య అంటూ కళ్ళల్లో నీళ్ల కారుతుండగా పైటకొంగుతో ఒత్తుకుంది.

ఏం గుర్తుకుంటుంది రా చెప్పు ఏం గుర్తుకున్నదో? అంటూ నేను ఒత్తిడి చేశాను ఎందుకు ఉండదు! పొట్టోడు. బైండ్లోని తాటి చెట్టు కింద ఆడుకున్న ఆటను నేనెప్పటికీ మరువను అన్నయ్య అంటూ తను కళ్ళనీరు కారుతుండగానే పక పక నవ్వింది. బావ చనిపోయి ఎన్ని సంవత్సరాలు అవుతుంది. అన్నయ్య అంటూ నన్ను అడిగింది. సుమారు 20 సంవత్సరాలు కావచ్చు చెల్లి అంటూ

సమాధానం ఇచ్చాను. అలా మాట్లాడుతుండగానే నా మనసు ఒక 50 సంవత్సరాల వెనక్కు వెళ్ళింది.

★ ★ ★

అప్పుడు నేను ఐదో తరగతి చదువుతున్న రోజులు ఏప్రిల్ మొదటి వారం ఒంటిపూట బళ్ళు ఉదయం స్కూలుకు వెళ్ళొచ్చి మధ్యాహ్నం పూట బావుల్లో ఈతకు వెళ్లేవాళ్ళం ఆరోజు రూపక్కయ్య కందికొర్లు ఆముదపు కొర్లనుపిడకలు ఏరుకొని రారా అంటే పెండతట్ట తువ్వాలను తీసుకొని నేను మట్టయ్య దగ్గరికి వెళ్లాను మట్టయ్య తను ఒక పెద్ద పెండతట్టను ఒక తువ్వాలను తీసుకొని ఇద్దరం పోతుండగా అష్టాచమ్మ ఆడుతున్న గురువమ్మ గంగమ్మ మా ఇద్దరిని చూసి యాడికిపోతున్నరని మొదటగా గంగమ్మ నన్ను అడిగింది. కొర్లకు పిడకలకు పోతున్నాం అంటూ సమాధానం ఇచ్చాను. మేం కూడా రావచ్చా అన్నది గంగమ్మ. ఎందుకు రాకూడదు అంటూ మీరు రండి అందరం పోయి పిడకలు కొర్లు ఏరుకొని వద్దాము అంటూ వాళ్ళ ఇంటి ముందు యాప చెట్టుకింద కూర్చున్న తర్వాత ఇంట్లోకెళ్ళి రెండు పెండ తట్టలను తీసుకుని మా వెంట బయలుదేరారు. మేము అందరమూ రామలక్ష్మ బీట్లో బాలయ్య పటేల్ సేలో పిడకలను కొర్లను ఏరుకుని ఎండ అవుతుండగా బైండ్లోని తాటి చెట్టు కిందకి చేరుకున్నాము. అప్పుడు తాటి చెట్టు వేపచెట్టు దగ్గర దగ్గరగానే ఉన్నాయి. వేపచెట్టు ఆకులు రాల్చి అప్పుడప్పుడే చిగుర్లు వేస్తుంది నీడ అంతగా లేదు. తెరపలు తెరపలుగా ఉన్న నీడ కిందనే మా తట్టల్ని దించి కొద్దిసేపు కూర్చున్నాము. ఈ లోపులో గంగమ్మ అన్నయ్యా మనం అమ్మానాన్న ఆట ఆడుకుందామా అంటూ మమ్మల్ని అడిగింది. దానికి మట్టయ్య గురువమ్మ కూడా సరే ఆడుకుందామంటూ ఆటకు రెడీ అయ్యాము. గంగమ్మ మట్టయ్యకు మరదలు వరుస కావాలి గురువమ్మ నాకు అత్త వరుస కావాలి. కాబట్టి రెండు జంటలుగా విడిపోయి ఆటాడటానికి సిద్ధమయ్యాం. మేము రెండు ఇల్లు కట్టుకోవడానికి మట్టిని కట్టలుగా పోసి వేరువేరు ఇల్లు కట్టుకున్నట్టుగా కట్టలుగా పోసి అమ్మానాన్న అన్న తర్వాత రకరకాల వృత్తులు చేయాలి కాబట్టి మా నాన్న పంతులు కాబట్టి నేను పిల్లగాళ్ళకు చదువు చెప్పే ఆటను ఎంచుకున్నాను. మట్టయ్య నాయనా తాటిచెట్టు ఎక్కి కల్లు గీసే వృత్తి కాబట్టి తను ఆటనే ఎంచుకున్నాడు. నేను ఇరవై ముప్పై రాళ్లను ఏరుకొని చదువుకునే పిల్లల్లాగా వరుసగా నిలబెట్టాను. నేను కూర్చునేందుకు ఒక పెద్ద రాయిని తీసుకుని వచ్చి పెట్టాను. అలాగే దూరంగా ఉన్నా పొదల్లో నుంచి ఒక పెద్ద బెత్తాన్ని కూడా తీసుకొచ్చి నా పక్కగా పెట్టుకున్నాను. ఆ విధంగా నేను రోజు బడికి వెళ్లి రావడం పిల్లలకు పాఠాలు చెబుతున్నట్టుగా నటించడం కొనసాగుతుంది. మట్టయ్య కల్లు గీసుకుని రావడానికి పోయినట్లుగా నటిస్తూ దగ్గరలోనే ఉన్న వాళ్ల మండవ దగ్గరికి వెళ్లి మోకు, ముస్తాదు, గుదిగట్టే తీసుకొని వచ్చాడు. దగ్గర పట్ల ఉన్న తాటి చెట్లను మోకు వేసుకొని కొంత కొంత పైకి ఎక్కి దిగుతూ కల్లు తీసుకొని వచ్చినట్లుగా వాళ్ళుకట్టుకున్న ఆట ఇంటి దగ్గరికి వస్తు పోతూ ఉండేవాడు. ఇంటిదగ్గర పెద్దవాళ్ళు ఏ విధంగానైతే చిన్న చిన్న సమస్యల కోసం కొట్లాడుకుంటారో ఆ విధంగానే వాళ్ళు చిన్నచిన్న మాటలతో కస్సుబుస్సులాడుకునేవాళ్లు. ఈలోపులో మట్టయ్య గంగమ్మ వీపుపై ఒకటి రెండు దెబ్బలు వాయించటంతో పుట్టింటికి వచ్చినట్టుగా మా ఇంటికి వచ్చేది. మా ఇంటికి వచ్చిన తర్వాత రెండు మూడు రోజులు ఇంట్లోనే ఉన్నట్టు ఈలోపులో మట్టయ్య కూడా మా ఇంటికి వచ్చి ఏవే పుట్టింటి కాడ ఇంకెన్ని రోజులు ఉంటావే పిల్లగాడు అక్కడ ఏడుస్తున్నరు నువ్వు వెంటనే వచ్చేసెయ్ అని గదమాయిస్తున్నట్టు అనేవాడు. నేను రాను పో! నన్ను కొడుతున్నావు, బాగా తాగుతున్నావు, పోరంబోకుల తిరుగుళ్ళు తిరుగుతున్నావు నేను రాను అంటూ మొరాయించేది గురవమ్మ. అట్లయితే పిల్లా కల్లు కాలమప్పుడు ఇక్కడే ఉంటే ఎట్లా మీ పిల్లల్ని ఎవరు చూస్తారు. చూడు గంగమ్మ మేము ఎన్నాళ్ళని చూస్తావమ్మా వెళ్ళు బిడ్డ అంటూ ఆమె వాళ్ళ ఇంటిదాకా సాగనంపి వచ్చేది. అట్లా ఒకటి రెండుసార్లు గంగమ్మ అలిగి రావడం మేము తోలి రావడం జరిగింది. వాళ్ళ ఇంటి దగ్గరనే గంగమ్మ మరల మట్టయ్యను తిడుతూ ఉంటే వీపు పైన రెండు మూడు దెబ్బలు గట్టిగా వేశాడు. వీడు నన్ను చంపాడు నాయనో అంటూ పెడబొబ్బలు పెట్టింది. నన్ను వాడు వీడు అంటావానే అంటూ గుది గట్టుతోనే వీపు పైన కొడుతూ జుట్టు పట్టుకుని ఈడ్చుకుంటూ నిజంగానే బాగా కొట్టాడు. గంగమ్మ ఆ దెబ్బలను తట్టుకోలేక విలవిల్లాడిపోయింది. నేను గురవమ్మా వెళ్లి ఏందిరా మట్టయ్య అమ్మాయిని ఇట్లా కొడుతున్నావ్... అంటే ఇది ఏం మాటలు మాట్లాడుతుంది అని బజారు మాటలు మాట్లాడుతుంది అంటూ మళ్ళా కొట్ట పోతున్నాడు. మేము వారించి పక్కకు తీసుకొని వచ్చాము. గంగమ్మ ఒకటే ఏడుపు వీపు పట్టుకుని బాగా ఏడుస్తుంది. నేను గురవమ్మలు జాకెట్టు తీసి చూడగా వీపంతా వాతలు పడి ఎర్రగా మారిపోయింది మట్టయ్య గజగజ వణికిపోయాడు. తప్పయింది గంగమ్మ అంటూ చేతులు పట్టుకున్న ఆ దెబ్బలకు గంగమ్మ ఇంకా ఏడుస్తూనే తిడుతూనే వుంది. ఇంటికి పోయిన తర్వాత మా నాయనమ్మతో చెప్పి మీ ముగ్గురు సంగతి చెప్తానంటూ బాగా మారం చేస్తూ ఏడుస్తుంది. మాకు భయం అయింది. నల్లలంని తీసుకొచ్చి బాగా వీపు మీద రుద్దాము పక్కనే తాళ్ళవాగులోకి తీసుకొని వెళ్లి బురద ఇసుక పెట్టి బాగా రుద్ది స్నానం చేయించాము. అయినా కూడా ఆ బర్రలు తగ్గలేదు స్నానం చేయించి వేప చెట్టు దగ్గరికి వచ్చి తట్టలు ఎత్తుకొని ఇంటికి బయలుదేరాము.

దారి వెంట గంగమ్మ ఏడుస్తూనే ఉంది, తిడుతూనే ఉంది, నేను మా ఇంటి

ముందు నుంచి కాకుండా మా ఇంటి వెనకాల బొబ్బిర్లోరి చేలో నుంచి ఇంట్లోకి మెల్లగా బతుకు జీవుడా యంటు జారుకున్నాను. వాళ్లు వాళ్ళ ఇంటికి వెళ్లి పోవడం జరిగింది. గంగమ్మకు బాగా చెప్పాము చెల్లె ఇంకెప్పుడు ఇట్లాంటి పని చేయము నాయనమ్మకు చిన్నమ్మకు చెప్పకు అంటూ బ్రతిమిలాడాను. గురువమ్మ మట్టయ్య కూడా గంగమ్మను బతిమిలాడారు అయినా కూని రాగం తీస్తూ ఆమె ఇంటి ముఖం పట్టి వెళ్ళిపోయింది. నేను ఇంటికి వచ్చినా కూడా మనసు మనసులో లేదు ఎప్పుడు వచ్చి నాయనమ్మ చిన్నమ్మ ఇంటి మీద పడి మా నాన్నకు జరిగిన విషయం చెప్తారని బాగా భయం వేసింది. కానీ గంగమ్మ తను వాళ్ళ నాయనమ్మకు అమ్మకుచెప్పితే ఆమెనే కొడుతారని భావించి వాళ్ళకు చెప్పలేదు.

ఇంటికి పోయాను అనే కానీ మనసులో మనసు లేదు. రాత్రి ఒకటే భయం నిద్ర సరిగా పట్టలేదు. గంగమ్మ వాళ్ళ తరపు వాళ్ళు ఎప్పుడు వచ్చి నాన్నకు చెప్తారోనని భయపడి రాత్రి పొద్దుపోయేదాకా మేలుకొనే పడుకున్నాను. కానీ ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు తెల్ల తెల్ల వారుతుండగానే ముందు అందరికంటే ముందుగా లేచి వాకిలూడ్చి, పోగులెత్తి దిబ్బలో పారబోశాను. రోజు రూపక్కయ్య వాకిలి వూడిస్తే పోగులు ఎత్తిపోయటం నాదే వంతు కానీ రూపక్కయ్య తెల్లవారిన తర్వాత నేను లేసి ఇంటి ముందర వూడ్చేది. మా ఇంటి ముందరే గంగమ్మ వాళ్ళ ఇల్లు వాళ్ళ నాయనమ్మ వాళ్ళమ్మ లేస్తారని భయపడి ముందే ఊడ్చి పోగులేత్తి పోసాను. రూపక్క ఆశ్చర్య వ్యక్తం చేసింది. నా భయం నాది కాబట్టి నేను అన్నయ్య తమ్ముడు కంటే ముందే ముఖం కడుక్కొని స్నానం చేసి స్కూలుకు వెళ్లడానికి రెడీగా ఉండేవాడిని. అన్నం అయిన తర్వాత తిని నా పుస్తకాల సంచిని సంకకు తగిలించుకొని ఇంటి వెనుకాల నుండే స్కూలుకు వెళ్లేవాడిని. అక్కడే మట్టయ్య కూడా కలిసేవాడు. మట్టయ్య కూడా మా బజార్ దగ్గరికి రావడానికి ఆడుకోవడానికి భయపడి రావడం లేదు. గురువమ్మ కూడా మా ఇంటి వైపు మా బజారు వైపు తొంగి చూడటం లేదు.

ఈ విధంగా రెండు మూడు రోజులు గడిచింది. నేను ముందుగా లేచి మా ఇంటి ముందు తలుపు సందులో నుంచి గంగమ్మ వాళ్ళ ఇంటి వైపు రోజు చూసే వాణ్ణి. ఒక్కోరోజు గడిచి పోతుండటంతో మనసు కొంచెం కుదుటపడుతుంది. ఒకనాడు సాయంత్రం పూట ఎల్లమ్మ నాయనమ్మ పాపులమ్మ చిన్నమ్మ బుడ్డోడి భుజానేసుకొని మా ఇంట్లోకి వచ్చారు. అప్పుడు నేను మంచంపై పడుకొని ఉన్నాను. నాకు కాళ్లు చేతులు భయంతో చల్లబడ్డాయి నిద్రపోతున్నట్టుగా నటించాను.

నాయనమ్మను ఏంది చిన్నమ్మ పని మీదకు వచ్చారని నాన్న అనగానే ఏం లేదు నాయనా ఓ మాట అనగానే నేను ఇంకా మంచంలోనే కుచించుకుపోయి పైప్రాణాలు పైనే పోయినట్టుగా ఫీలయ్యాను. ఏంది చిన్నమ్మ దాయటం ఎందుకు చెప్పు అంటుండగానే ఇంతలో భూదేవమ్మ పిల్లను సంకన పెట్టుకొని వచ్చింది. ఆమెను చూసిన నాయనమ్మ ఏం లేదు కొడుకా ఈ సంటోనికి మూడు రోజుల నుంచి ఒకటే జ్వరం తగ్గట్లేదు, పెట్టట్లేదు పిల్లగాడు పచ్చగ పోతుండు విరోచనాలకు సందులనుకుంటున్నాను సరి సంవత్స రాలు ఒక యంత్రం రాసిస్తవని వచ్చాము. కొంచెం పిల్లగాని చెయ్యి చూడయ్యా అనగానే నాన్న లేచి పాపులమ్మ చిన్నమ్మ భుజం మీద ఉన్న బుడ్డోని చేతులు కాళ్ళు ఒల్లంతా తడిమి చూశాడు. కొంచెం జరం జారినట్టుంది. చిన్నమ్మ తగ్గుద్దిలే ఇప్పుడే ఒక యంత్రం రాసిస్తా.

మంచిదయ్యా గట్టి యంత్రం రాసియ్యి కొడకా అంది. నాన్న ఇంట్లోకి వెళ్లి కాగితం కలం తెచ్చి ఒక యంత్రం రాసిచ్చాడు. ఏందమ్మా భూదేవమ్మా ఇటు వచ్చావు అంటే ఇయ్యాలా బేస్తారంగా అన్నయ్య మీ కోడలుకు సుస్తి చేసింది. ఈ అమ్మాయి కూడా జ్వరం తగ్గట్లేదు. మూడు రోజుల సంధి ఏం పాడో ఏమో ఊళ్ళని జరాలే నీ దగ్గరకు వచ్చి చూయించిన తర్వాత నీ చేత్తో రాయించిన యంత్రం కడితే తగ్గిపోద్దని ఇటు వచ్చినా అన్నయ్య అన్నది. సంకనున్న పిల్లను నాన్న దగ్గరికి తీసుకు వచ్చింది. ఆ అమ్మాయిని నాన్న ఒళ్లంతా తడిమి చూశాడు. కొంచెం వెచ్చవెచ్చగా ఉంది. నీకు కూడా ఒక యంత్రం రాసిస్తా పట్టని చెప్పి కాగితం తీసుకొని ఒక యంత్రం రాసి మంత్రాలు చదివి ఈ యంత్రం తీసుకొని వెళ్లి తెల్ల గుడ్డలో కట్టి సాంబ్రాణి పొగ ధూపం వేసి ఎడమచెయ్యికి కట్టమ్మ, చిన్నమ్మా మీ బుడ్డోనికి కుడి చేతికి కట్టు. నువ్వు కూడా తెల్ల గుడ్డలో యంత్రాన్ని పెట్టి సాంబ్రాణి పొగ వేసి కుడి చేయికి కట్టు అన్నాడు. అట్లా అనగానే నాయనమ్మ పాపులమ్మ చిన్నమ్మ ఇంటి బాట పట్టారు. అట్లనే భూదేవమ్మ అత్త కూడా ఇంటికి వెళ్ళింది. నా మనసు కుదుటపడింది. వాళ్ళు పోయిన ఐదు పది నిమిషాల తర్వాత లేచి గండం గడిచిందని ధీమాతో బయటికి అడుగులు వేశాను.

★ ★ ★

ఏంటి అన్నయ్య ఆలోచిస్తున్నావు అని గంగమ్మ అడగగానే ఈ లోకంలోకి వచ్చి పడ్డాను. ఏం లేదు చెల్లె మన చిన్నప్పుడు జరిగిన బైండ్లోని తాడిచెట్టు కాడి ఆట గుర్తుకొచ్చింది అని అంటుండగానే ఈ లోపులో ముత్యాలమ్మ కొడుకు వెంకటేశ్వర్లు పరుగులాంటి నడకతో వచ్చి మావయ్య అక్కడ అందరూ నవధాన్యాలు వేస్తున్నారు. మనం కూడా పోదాం పదండి. అని చెప్పటానికి వచ్చాను అన్నాడు. అందరూ బొడ్రాయి ప్రతిష్టాపన దగ్గరికి రండి అంటూ వచ్చినంత వేగంగానే మరలా బయటకు వెళ్లాడు. వెంకటేశ్వర్లు, నేను గంగమ్మ వాళ్ళ అక్క సరోజన అక్కడ కూర్చున్న ప్రతిష్టాపనకు వచ్చిన అందరూ మాట్లాడుకుంటూ కదిలి వెళ్లాం.

సీరియల్

ప్రతాప యుగంధర కథలు... 3

# చంద్రరేఖ

మంత్రి యుగంధరుని మహావ్యూహం...




అమ్మంగి వేణుగోపాల్
94410 54637


చక్రవర్తి ప్రతాపుడు ప్రజాపాలకుడనే పేరు తెచ్చుకున్నాడు. అప్పుడప్పుడు గజారోహణం చేసి గాని, రథారోహణం చేసి గాని, ఓరుగల్లు నగర వీధులలో విహారయాత్ర చేసేవాడు. వీధికి ఇటూ అటుగా జనం నిలిచి జయజయ నాదాలు చేస్తూ అభివాదాలు చేసేవారు. ప్రతాపుడు ప్రత్యభివాదం చేస్తూ దరహాస చంద్రికలు కురిపిస్తూ ముందుకు సాగేవాడు.

ఒక పున్నమిరోజు ఉభయ సతీమణులు లక్ష్మాదేవి, విశాలాక్షీదేవి ఇరువైపులా రథం మీద ఆసీనుడై ఉండగా రాజవీధిలో విహారయాత్రకు బయలు దేరాడు. జనం ఇరువైపులా బారులు తీరి ఉన్నారు. మరింత దగ్గరగా చక్రవర్తిని చూడాలని కొందరు, వారి మీద పడేటట్లుగా పూలు విసిరేయాలని మరికొందరు ఉబలాటం కొద్దీ ముందుకు దూసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నారు. వాళ్ళను నియంత్రించలేక భటులు సతమతమవుతున్నారు.

ఇంతలో సుమారు ఇరవయ్యేళ్ళ యువతి భటులను తోసుకుంటూ రథాశ్వాల ముందుకు హఠాత్తుగా ఉరికి వచ్చింది. రెండు చేతులు పైకెత్తి "మహారాజా నన్ను మీరే రక్షించాలి, రక్షించాలి" అని ఏడుస్తూ ఆర్తనాదం చేసింది. "సారథి అప్రమత్తంగా ఉండటం వల్ల ప్రమాదం తప్పింది. లేదంటే రథచక్రాల కిందికి వచ్చేదే" అని జనం అనుకోసాగారు.

ఇంతలో వెనుక రథంలోని రక్షక శ్రేణిలో ఉన్న యుగంధరుడు ఆయన భటులు పరిగెత్తుకు వచ్చారు.

"ఈ ప్రతాపరుద్ర చక్రవర్తి పాలనలో అబలలకు ప్రమాదమా?" అన్నాడు యుగంధరుడు.

"అవునయ్యా, నేను దిక్కులేని దాన్ని నాలుగు రోజులుగా ఇక్కడి సత్రంలో ఉంటున్నాను. పొట్టపోసుకోవటానికి నాట్యం తప్ప మరో విద్య తెలియదు. అక్కడక్కడా నాట్యప్రదర్శనలు ఇస్తుంటే పోకిరీలు వెంటబడి నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మహారాజుగారే రక్షించాలి" అన్నది ఆ అబల.

"యుగంధరా! తగిన విచారణ జరిపించు. అందాక మన ఆస్థాన నర్తకి ఇంట్లో ఆమెకు బస ఏర్పాటు చేయించు" అని ఆజ్ఞాపించాడు చక్రవర్తి.

యుగంధరుడు "చిత్తం ప్రభూ" అంటూ అభివాదం చేసి ఆమెను ఆస్థాన నర్తకి ఇంటికి తరలించాడు.

వారం తర్వాత ఆమె విషయం నివేదించుకోవటానికి యుగంధరుడికి చక్రవర్తి ఆజ్ఞ అయింది. ఆయనప్పుడు అంతఃపురంలో పట్టమహిషి లక్ష్మాదేవితో చదరంగం ఆడుతున్నాడు.

యుగంధరుడు ఆ ఇరువురికి అభివాదం చేశాడు. ఆసనం స్వీకరించాడు.

"ఊ.." అన్నాడు చక్రవర్తి, చెప్పమన్నట్టుగా.

"ఆ అమ్మాయి చెప్పిందాన్నిబట్టి ఆమె పేరు చంద్రరేఖ. నెల్లూరు మండలం నుండి ఇక్కడకు వచ్చింది. తమది చితికిపోయిన కుటుంబమని అంది. యాభయి ఏండ్ల తండ్రి స్వగ్రామంలో ఉన్నాడట. అక్కడ కళలకు ఆదరణ లేకపోవటంతో ఒంటరిగా వచ్చి నాలుగు రోజులపాటు పడమటి వీధిలోని సర్వేశ్వరాలయం సత్రంలో ఉన్నది. ఒంటరి అమ్మాయి, డబ్బు ఆశించి నాట్య ప్రదర్శనలు ఇస్తుంటే కొందరు పోకిరీ యువకులు అల్లరి చేసినట్లుగా గుడి పూజారులు చెప్తున్నారు. అయితే ఈ చిన్న విషయాన్ని భద్రతాధికారులు దృష్టికి తీసుకుపోతే సరిపోయేది. రథయాత్రకు అడ్డుపడి ఎందుకు చెప్పిందా' అని సాలోచనుడయ్యాడు.

యుగంధరుని మాటల్ని పెద్దగా పట్టించుకోకుండా లక్ష్మాదేవి కలుగజేసుకొని

"ఇప్పటి నాట్యగత్తె ఎప్పుడూ ఏదో ఒక జబ్బుతో బాధపడుతున్నది. ఈ కొత్త అమ్మాయిని మా అంతఃపురలో ప్రవేశపెట్టండి. మాకూ కాలక్షేపంగా ఉంటుంది" అన్నది.

సీరియల్

యుగంధరుడు చక్రవర్తివైపు చూశాడు.

"ఇంకేం, సమస్య పరిష్కారమయినట్లే కదా! రాణీవారు చెప్పినట్లు చేయండి. అంతఃపురం వారి సామ్రాజ్యం. ఇక్కడ వారి ఆజ్ఞలకే చెల్లుబాటు ఉంటుంది" అన్నాడు చక్రవర్తి రాణి వంక నవ్వుతూ చూసి. ఆమె కూడా నవ్వుతూ యుగంధరునికి ఆతిథ్యం ఏర్పాటు చేసింది.

చంద్రరేఖకు అంతఃపురంలో ఒక గది కేటాయించారు. ఆమె నృత్యప్రదర్శనలు జోరుగా సాగుతున్నాయి. రెండుమూడు మాసాల తర్వాత తన తండ్రిని రప్పించి రాణిగారి ద్వారా చక్రవర్తికి చెప్పించి ఒక చిన్న ఉద్యోగం ఇప్పించుకుంది. తొందరలోనే లక్ష్మీదేవికి తలలో నాలుకయింది. ఈ పరిణామాలన్నింటిని యుగంధరుడు ఓ కంట కనిపెడుతున్నాడు.

ఈలోగా కటకం వారికి ఓరుగల్లు వారికి యుద్ధం వచ్చిపడింది. చక్రవర్తి ప్రతాపుడు ఆ యుద్ధంలో పాల్గొనక తప్పలేదు. కుటుంబ కారణాలవల్ల ఆ యుద్ధానికి యుగంధరుడు వెళ్ళలేకపోయాడు. నెల తర్వాత ప్రతాపుడు విజేయుడై వేంచేశాడు.

అప్పుడు ఉభయరాణులు కర్పూర హారతులు పట్టారు. రాజ్యం అంతటా విజయోత్సవాలు ప్రారంభమయ్యాయి. యుగంధరుడు కూడా వచ్చి చక్రవర్తికి తీపివార్త చెప్తానని తెలియజేసి వెంటనే వెళ్ళిపోయాడు.

"మేడపైకి వెళ్ళి నగర ప్రజలు చేసుకున్న దీపాలంకరణలను, కాల్చుకుంటున్న బాణసంచాను చూద్దామా?" అని అడిగాడు లక్ష్మాదేవిని.

"సరే మహారాజా! సరంజామా అంతా మేడపైకి తెప్పిస్తాను" అంటూ చంద్రరేఖకు పనులు పురమాయించి చక్రవర్తితో పైకి వెళ్ళింది రాణి.

ఆహ్లాదదాయకంగా ఉన్న ఆ వాతావరణాన్ని చక్రవర్తి, వారి పట్టమహిషి ఆనందిస్తున్నారు. ఒక చెలికత్తెతోపాటు చంద్రరేఖ సరంజామాతో పైకి వచ్చింది. రాణిగారి ఆజ్ఞతో రెండు బంగారు పాత్రల్లో ద్రాక్షసవం కలిపింది. ఒక పాత్రను జాగ్రత్తగా చక్రవర్తికి అందించబోతున్న సమయంలో, కిందినుంచి బాజాభజంత్రీలతో ఒక చిన్న ఊరేగింపు కాళికాలయం వైపు సాగిపోతున్నది. అది విజయోత్సవాలలో భాగం కాదని గ్రహించిన చక్రవర్తి-

"ఏమిటీ బాజాభజంత్రీలు" అని

"యుగంధరుల వారికి కొడుకా?" అని పరమాశ్చర్యంతో ప్రశ్నించింది చంద్రరేఖ. అట్లా అంటున్నప్పుడు ఆమె కంఠం పారబోయింది. చిన్నగా దగ్గు వచ్చింది. మహారాజులవారికి అందిస్తున్న ద్రాక్షసవం వొలికి పోయింది. ఆమె మాటల్లో "యుగంధరునికి కొడుకెట్లా పుడతాడు" అన్న భావం ఉందని చక్రవర్తికి అర్థమైంది. సూటిగా ఆమె కళ్ళల్లోకి చూశాడు. తడబాటు స్పష్టంగా కనిపించింది.

అడిగాడు చెలికత్తెతో.

"అదా మహారాజా! యుగంధరుల వారి కుటుంబం వారు ప్రత్యేక అర్చనలు జరిపించటానికి కాళికాలయానికి వెళ్తున్నారు" అందామె.

"ఎందుకో" అన్నాడు చక్రవర్తి కుతూహలంతో.

"యుగంధరులవారికి కొడుకు పుట్టాడు కదా మహారాజా, అందుకు" అంది చెలికత్తె. అప్పుడు

"యుగంధరులవారికి కొడుకా?" అని పరమాశ్చర్యంతో ప్రశ్నించింది చంద్రరేఖ. అట్లా అంటున్నప్పుడు ఆమె కంఠం పారబోయింది. చిన్నగా దగ్గు వచ్చింది. మహారాజులవారికి అందిస్తున్న ద్రాక్షసవం వొలికి పోయింది. ఆమె మాటల్లో "యుగంధరునికి కొడుకెట్లా పుడతాడు" అన్న భావం ఉందని చక్రవర్తికి అర్థమైంది. సూటిగా ఆమె కళ్ళల్లోకి చూశాడు. తడబాటు స్పష్టంగా కనిపించింది. కాని ఏమీ జరగనట్టే కొంతసేపు అక్కడ గడిపి చక్రవర్తి శయనాగారానికి వెళ్ళిపోయాడు.

చంద్రరేఖకు ఆరాత్రి నిద్రపట్టలేదు. పలాయనం చిత్తగించటమే మంచిదనే నిర్ణయించుకున్నది. ముందుచూపుతో ఆమె అదివరకే ఐదారుసార్లు గుర్రం మీద కోట దాటి వాహ్యాళికి వెళ్ళి వచ్చింది. ఆమె రాజనర్తకి స్థాయిలో ఉండేది కనుక



సీరియల్

ఎవరూ అనుమానించేవారు కాదు. ఆరోజు ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో కోట దాటింది. ఆమెతోపాటు తండ్రికూడా బయలుదేరాడు. కరీంనగరం దాటి మరో యాభై మైళ్ళు వెళ్ళగలిగితే ప్రమాదం నుండి బయటపడ్డట్టేనని, ఎక్కడైనా తురుష్క గుడారం తారసపడితే అక్కడి వారిని ఆశ్రయించవచ్చునని అనుకున్నారు.

ఉదయం ఆరుగంటలకే చక్రవర్తి యుగంధరుణ్ణి పిలిపించాడు.

"యుగంధరా! నీకూ చంద్రరేఖకు మధ్య ఏం జరిగింది?" అని సూటిగా ప్రశ్నించాడు. రాజు గారికి "ఆ విషయం" ఎట్లా తెలిసిందా అని ఒకవైపు ఆశ్చర్యపోతూనే, మరోవైపు ఆయన కుశాగ్రబుద్ధికి లోలోన జోహారు చెప్పుకున్నాడు.

"ప్రభూ! పదిహేను రోజుల క్రితం మీరు అక్కడ యుద్ధభూమిలో వీరవిహారం చేస్తున్నప్పుడు, ఒకరోజు అంతఃపుర పరిరక్షణకు మరిన్ని రక్షణ చర్యలు తీసుకోవాలన్న ఉద్దేశంతో పట్టమహిషిగారి ఆజ్ఞతో వెళ్ళాను. ఎక్కడా లోపం కనిపించలేదు. ఎందుకైనా మంచిదని చంద్రరేఖ గది తలుపులు తట్టాను. వెంటనే తెరవలేదు. రెండవసారి తట్టినప్పుడు ఎవరూ" అంటూ వచ్చి తెరిచింది. నేను లోనికి ప్రవేశించాను.

"తమరా మహామంత్రీ! ఎన్నాళ్ళకెన్నాళ్ళకు నామీద దయ కలిగింది" అంటూ ఆహ్వానించింది. నేను లోనికి ప్రవేశించగానే తానే తలుపులు మూసింది.

"నీకు ఏర్పాట్లన్నీ బాగున్నాయి కదా! ఏమైనా సహాయం అవసరమైతే చెప్పు" అన్నాను.

అప్పుడు కొంత జాణతనం ప్రదర్శించి-

"మీరే నా మీద దయచూపటం లేదు" అంది నిష్ఠూరంగా

"అంటే"

"మీకు ఉపయోగపడని ఈ నా అందచందాలెందుకు?" అంటూ నన్ను కౌగిలించుకునే ప్రయత్నం చేసింది. నన్ను రెచ్చగొట్టింది. ప్రాధేయపడింది. అక్కణ్ణుంచి బయటపడడానికి నాకో ఉపాయం తట్టింది. వెంటనే నేనామెతో-

"చంద్రరేఖా! నువ్వెంత కవ్వించినా లాభం లేదు. స్త్రీలను సుఖపెట్టే సామర్థ్యం నాలో లేదు" అన్నాను, నిరుత్సాహంగా ముఖం పెట్టి.

"మన్నించండి మహామంత్రీ! అంటూ పాదాభివందనం చేసి తలుపులు తెరిచింది" అంటూ ముగించాడు యుగంధరుడు.

చంద్రరేఖ ఆమె తండ్రి పరారయ్యారని గ్రహించి, వెంటనే అంచె వేగులను హెచ్చరించాడు యుగంధరుడు. నలువైపులా గాలింపు మొదలైంది. కొన్నిగంటల్లోనే సామ్రాజ్యం దాటకముందే ఆమె, ఆమె తండ్రి పట్టుబడ్డారు. చక్రవర్తి ఆజ్ఞతో ఆ ఇద్దరిని బంధించి విచారణ జరిపారు. వాళ్ళిద్దరు శత్రుదేశపు గూఢాచారులని తేలింది. చంద్రరేఖ దగ్గరున్న వస్తువుల్లో ఒక చీర దొరికింది. ఆ చీరమీద ఏవేవో గుర్తులు, సంకేతాలు ఉన్నాయి. అవన్నీ రాజ్యంలోని ముఖ్యభవనాలు, చెరువులు, సరోవరాలు, గుడిగోపురాలకు సంబంధించిన స్థూలచిత్రాలని తేలింది.

"క్షమించండి సార్వభౌమా! నేను శత్రుదేశపు గూఢాచారిణే. కాని నా రాజ్యం నుండి ఎంత ఒత్తిడి ఉన్నా సేకరించిన ఏ సమాచారాన్నీ పంపలేదు. కొన్నిరోజులు గడిచిన తర్వాత ఇక్కడి పౌరులకు లభిస్తున్న గౌరవాదరాలను గుర్తించి ఈ రాజ్యాన్ని ప్రేమించసాగాను. మహారాణులు నా పట్ల ప్రదర్శిస్తున్న ప్రేమ నన్ను కట్టిపడేసింది. నన్ను నమ్మండి. ఉరికంబం మీద కూడా ఇవే మాటలు చెప్తాను. నేను ఏ ద్రోహమూ చేయలేదు" అన్నది చంద్రరేఖ, దుఃఖం నిండిన కంఠస్వరంతో

"ప్రభూ! పదిహేను రోజుల క్రితం మీరు అక్కడ యుద్ధభూమిలో వీరవిహారం చేస్తున్నప్పుడు, ఒకరోజు అంతఃపుర పరిరక్షణకు మరిన్ని రక్షణ చర్యలు తీసుకోవాలన్న ఉద్దేశంతో పట్టమహిషిగారి ఆజ్ఞతో వెళ్ళాను. ఎక్కడా లోపం కనిపించలేదు. ఎందుకైనా మంచిదని చంద్రరేఖ గది తలుపులు తట్టాను. వెంటనే తెరవలేదు. రెండవసారి తట్టినప్పుడు ఎవరూ" అంటూ వచ్చి తెరిచింది. నేను లోనికి ప్రవేశించాను.

నాలుగైదురోజులు విచారణ తర్వాత చక్రవర్తి ఆ ఇద్దరికి శిక్షలు విధించాడు.

"చంద్రరేఖ మాటల్ని పూర్తిగా నమ్మలేం. గూఢాచార వృత్తే నమ్మదగింది కాదు. అందుకే ఆమెకు పది సంవత్సరాల జైలు శిక్ష విధిస్తున్నాం. ఈ పదేండ్లు ఆమె ఖైదులో ఉండే స్త్రీలకు నాట్యం నేర్పుతూ గడపాలి. ఆమె రాణివాసం వారికి కొన్నినెలలుగా వినోదం అందించిన కారణంగా ఈ మాత్రం కనికరం చూపటం జరిగింది. ఈమె తండ్రికి మాత్రం ఆజన్మకారాగారవాసం విధిస్తున్నాం" అంటూ ధర్మాసనం మీద నుండి తీర్పు వినిపించి పైకి లేచాడు చక్రవర్తి.

మరునాడు నిండు పేరోలగంలో తన యుద్ధానుభవాలను సభాసదులతో పంచుకుంటున్నప్పుడు చక్రవర్తిని యుగంధరుడు కలుసుకున్నాడు.

"యుగంధరా! నీవు తండ్రివైన సందర్భంలో సంతోషంతో ఇదిగో ఈ బంగారు మాడీను బహూకరిస్తున్నాను" అన్నాడు చక్రవర్తి.

"మన్నించండి మహారాజా! రేపు నామకరణోత్సవం. మీరే స్వయంగా పిల్లవాడి చేతికి అందజేస్తే బాగుంటుంది" అన్నాడు యుగంధరుడు.

"అవునవును. వాడు కొన్నేండ్ల తర్వాత మా యువరాజుల వారికి యువమంత్రి అవుతాడు గదా!" అన్నాడు చక్రవర్తి.

చక్రవర్తికీ, మహామంత్రికి మధ్య నెలకొన్న సౌజన్యాన్ని సభాసదులు కరతాళ ధ్వనులతో అభినందించారు.

కవిత

# రా



కోటం చంద్రశేఖర్ 94920 43348

ఒకసారి రా
సిమెంట్ రోడ్ వదిలి రా
ఫోకస్ లైట్ వీడి రా

రా
హీరోహోండా విరగ్గొట్టి రా
కోకాకోలా బాటిల్ పగలేసి రా

రా
సిన్మాకళ్ళని గుద్దేసి రా
క్లబ్బుమనసుని రుద్దేసి రా

రా
హైటెక్ హంగులు
ఫైస్టార్ రంగులు వదిలేసి రా

రా
సెల్ఫోన్ గల్లు కాదు
సైకిల్ బెల్లు విందువు రా

రా
ఈ నేల మీద పాదం మోపు
శుకపికాదులు గళమిప్పుతాయి
ఈ నేల మీద పాదం మోపు
మధుమయురాలు పురివిప్పుతాయి
అంతరాలకి దూరం ఈ నేల
అవాంతరాలకి దూరం ఈ నేల
షవర్లో షాంపూ స్నానాలు కాదు
స్నోలు పౌడర్లు లిప్స్టిక్ కాస్మోటిక్
కాంతులతో కాదు

రా
గోరువెచ్చని బోరునీరు సిద్ధం
పంటికి వేపపుల్లలు
ఒంటికి పిడకభస్మాలు సన్నద్ధం

రా
చెర్లాకోలా చేతబట్టి బండిలో
ఊరేగే పంచతమ్ముని పౌరుషమూ
సద్ది మోసుకెళ్తున్న లంగావోణీ
చెల్లెలి ప్రేమపాశమూ
చూద్దువురా

రా
ఏటిగలగలలు గూటికిచకిచలు
విందువురా

రా
గాలికెరటాలలో నీలి మేఘాలలో
పల్లెపాట విందువురా
ఎన్ని వేలరూపాలకి సమానం
వరినాట్ల దృశ్యం
నేలతల్లి ముద్దుబిడ్డల కలుపుతీతల
పైరుకోతల సదృశ్యం
ఒక్కసారి టె (ట)క్కుల నగరికి టాటా చెప్పవా
ఒక్కసారి అక్కున అల్లుకొనే పల్లె సుందరి బాట పట్టవా
పట్నం పొమ్మనే పొగలకుంపటి
పల్లె రమ్మనే కలలదుప్పటి
వస్తు వ్యామోహాల వ్యాపార సమ్మోహ సందోహాల
మధ్య
నగరమంటే నిజాలు దాచిపెట్టే కలర్స్
అబద్ధాలు బయటపెట్టే కమర్షియల్స్
నగరమంటే తెరచాటు లాలూచి
పాలకపక్షాలకి పరిచిన తివాచి
జారిపోయే వలువల నగరిలోంచి
తెగటారిపోయే విలువల నగరిలోంచి
నిర్మల పల్లెపిల్లతో సాగుదువురా
అమలపూర్ణపల్లెలో సాగుచేద్దువురా
మెరుపుమెరుగుల వెలిగిపోయే కాంతిలో
తళుకుబెళుకుల కాంతులీనే భ్రాంతిలో
నలిగిపోయే శ్రమాహరణం
కరిగిపోయే భ్రమావరణం
మాకువద్దని మాకుకద్దని
విషవైకృత వైదేశిక విధ్వంసక ఛాయలు వీడిరా
విధికల్పిత విస్వాసిత విస్మయాత్మ మాయలు వీడిరా

రా
గ్లోబల్ దారాలు తెంపేసిరా
గ్లోబల్ ద్వారాలు మూసేసిరా

కథ

# ఓ ప్రేమ కథ

కొత్త మలుపుల ప్రేమ...



అన్యం పద్మజ రెడ్డి
94415 07852

"ఇవ్వాళ ఎలాగైనా సరే ప్రపోజ్ చెయ్యాలి". మరొక్కసారి క్రాఫ్ సర్దుకుంటూ రెడ్ రోజ్ తో సిద్ధంగా ఉన్నాడు ఆదిత్య.

తన క్యాబిన్ నుంచి డైరెక్ట్ గా తను కనపడేట్లుగా కుర్చీ సర్దుకుని ఎదురు చూస్తున్నాడు.

మధుమాసపు వెన్నెల్లా ఆఫీసులోకి అడుగు పెట్టింది ఆముక్త.

గుండెల్లో రైళ్లు పరిగెట్టాయి ఆదిత్యకి. ఒళ్ళంతా ముచ్చెమటలు పట్టాయి. "ఒకవేళ కాదంటే తను తట్టుకోగలడా" ఆ భయంతో ఇన్ని రోజులు తాత్సారం చేశాడు. ఇక మనసాగక ఈ రోజు ఎలాగైనా సరే మనసులో మాట చెప్పేయాలని నిర్ణయించుకున్నాడు.

**"ఏమైందే అమ్మ అంతలా నవ్వుకుం టున్నావు." అమ్మ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా పడీ పడీ నవ్వుతున్న ఆముక్తని చూసి తల కొట్టుకుంటూ అనసూయ వెళ్ళిపోయింది. తన ప్రేమకోసం ఇంకా ఏమేమి చేస్తాడాని ఆలోచిస్తూ నిద్రలోకి జారుకుంది ఆముక్త. మరుసటి రోజు ఉదయం ఆఫీస్‌లో అడుగు పెడుతూనే అప్రయత్నంగా దృష్టి ఆదిత్య క్యాబిన్ వైపుకి వెళ్ళింది.**

"హలో ఆముక్త గుడ్ మార్నింగ్" అంటూ విష్ చేస్తూ దగ్గరికి వెళ్ళాడు.

తన సీట్‌లో కూర్చుని తలవంచి ఏదో ఫైల్ చూస్తూనే క్యాజువల్‌గా విష్ చేసింది ఆముక్త.

కొన్ని రోజులుగా గమనిస్తూనే ఉంది అతన్ని మాటిమాటికీ దొంగచూపులు చూడటం, ఏదో చెప్పాలని ప్రయత్నించడం. ఆ చూపులకర్థం తెలీయనంత అమాయకురాలేం కాదు తను మనసులో నవ్వుకుంటూ ఇంకా అలాగే నిలుచున్న ఆదిత్యని ఏమిటన్నట్టు చూసింది.

ఎక్కడలేని ధైర్యం తెచ్చుకుని రెడ్ రోజ్ చేతిలో పట్టుకుని "ఐ లవ్ యూ" అన్నాడు. గొంతు పూడుకుపోయి తన మాటలు తనకే సరిగ్గా వినపడలేదు.

ఆశ్చర్యంగా పువ్వు వంక చూసింది ఆముక్త. పొద్దుటినుండి జేబులో దాచాడేమో రెక్కలు రాలి కాడ మాత్రం మిగిలింది.

చేతిలో వెక్కిరిస్తున్న కాడని అలాగే వదిలేసి సిగ్గుతో గిరుక్కున వెనక్కి తిరిగి తన సీట్లో కూలబడ్డాడు ఆదిత్య. మరి సాయంత్రం వరకు ఆమె కంట పడకుండా జాగ్రత్త పడ్డాడు.

రాత్రి మంచం మీద వాలగానే చేతిలో రెక్కలు రాలిన కాడతో కొయ్యబారిన ఆదిత్య ముఖం గుర్తొచ్చి పకపకా నవ్వింది ఆముక్త.

"ఏమైందే అమ్మ అంతలా నవ్వుకుంటున్నావు." అమ్మ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా పడీ పడీ నవ్వుతున్న ఆముక్తని చూసి తల కొట్టుకుంటూ అనసూయ వెళ్ళిపోయింది. తన ప్రేమకోసం ఇంకా ఏమేమి చేస్తాడాని ఆలోచిస్తూ నిద్రలోకి జారుకుంది ఆముక్త.

మరుసటి రోజు ఉదయం ఆఫీస్‌లో అడుగు పెడుతూనే అప్రయత్నంగా దృష్టి ఆదిత్య క్యాబిన్ వైపుకి వెళ్ళింది. చూసీ చూడనట్లు యథాలాపంగా చూసింది ఆముక్త.

సీట్లో ఆదిత్య లేడు.

"ఇతనికేమైంది ?ఎందుకు రాలేదు ?"

మేనేజర్ సుధాకర్ ని అడుగుదామా? ఏమనుకుంటారోనని అడగలేక పోయింది. సాయంత్రం దాకా అన్యమనస్కంగానే పని ముగించి అన్నీ సర్దేసి ఇంటికి బయల్దేరింది.

అమ్మ ఏవైనా కూరగాయలు తెమ్మంది. ఏంటో అసలు ఓపిక లేనట్లు చాలా చిరాగ్గా ఉంది ఈరోజు ఎందుకు ఇలా అనిపిస్తుంది. ఒకవేళ తను కూడా అతన్ని ప్రేమిస్తుందా? ఏమో! ఆఖరికి ఏవో రెండు రకాలు కూరలు తీసుకుని ఇంటి

క
థ

దారి పట్టింది.

ఆ తర్వాత రెండు రోజుల పాటు ఇదే పరిస్థితి. “అసలు ఇతను ఏమైపోయ్యాడు. ఏదైనా ఊరు వెళ్ళాడా? లేకపోతే ఆరోగ్యం బాలేదా?” ఆముక్త మనసు మనసులో లేదు తను కూడా అతని ప్రేమిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు అతని గురించిన సమాచారం ఎలా తెలిసేది? ఆలోచనలతో సతమత మవుతున్న ఆముక్తని “రేపు సెలవు పెట్టు నీకు పెళ్ళిచూపులు ఏర్పాటు చేశారు మీ నాన్నగారు” తల్లి మాటలకు పిడుగు పడ్డట్లు ఉలిక్కిపడింది ఆముక్త. ఏం చెప్పాలో తెలీలేదు కాదని చెప్పడానికి కారణం దొరకలేదు.



అమ్మానాన్నల కోసం మౌనంగా పెళ్ళిచూపులకు కూర్చుంది.

అనసూయ తెగ హడావిడి పడిపోతుంది. స్వీట్లు అవీ సర్ది కూతుర్ని అందంగా అలంకరించింది. వచ్చే సంబంధం కుదిరితే బావుణ్ణు అని ముక్కోటి దేవతలను వేడుకుంది. అబ్బాయి చాలా మంచోడంట. పైగా దూరపు చుట్టరికం కూడా ఉంది.

అక్కా అక్కా పెళ్ళికొడుకు వాళ్ళు వచ్చేశారు. సినిమా హీరోలా ఉన్నాడు అంటూ వర్ణించి చెప్పింది పిన్ని కూతురు రాజీ. చిరాగ్గా చూసేసరికి చిన్నబోయింది రాజీ.

దానికేం తెలుసు తన పరిస్థితి.

కాఫీ ట్రేతో హాల్లో సోఫాలో కూర్చున్న వాళ్ళకి ఇచ్చి ఖాళీ ట్రే ని టేబుల్ మీద పెట్టి తను మరో సోఫాలో కూర్చుంది.

“అబ్బాయిని చూడమని అమ్మ చెవిలో గుసగుసలాడింది.”

ఊహూ....తల ఎత్తలేదు చూడలేదు.

“నాకు మీ అమ్మాయి చాలా బాగా నచ్చింది.మీరు అనుమతిస్తే ఒకసారి తనతో మాట్లాడతానని “అన్నాడు అబ్బాయి.

అంతే ఒక్కసారిగా చటుక్కున తల ఎత్తి పరిసరాలు మర్చిపోయి చూస్తూ అలాగే ఉండిపోయింది ఆముక్త. ఆశ్చర్యం

**ఆ తర్వాత రెండు రోజుల పాటు ఇదే పరిస్థితి. “అసలు ఇతను ఏమైపోయ్యాడు. ఏదైనా ఊరు వెళ్ళాడా? లేకపోతే ఆరోగ్యం బాలేదా?” ఆముక్త మనసు మనసులో లేదు తను కూడా అతని ప్రేమిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు అతని గురించిన సమాచారం ఎలా తెలిసేది?**

ఎదురుగా చిరునవ్వుతో ఆదిత్య నిలబడి ఉన్నాడు. ఆమని కోయిల జీవన వేణువు ఊదినట్లుగా మనసు తీయగా మూల్గింది. ఇదెలా సాధ్యం ఇతను ఇతను పెళ్ళికొడుకా? తనని తాను గిల్లుకుని కెవ్వుమంది.అందరూ నవ్వేసరికి వెంటనే సిగ్గుపడి అక్కడ్నించి లోపలికి పారిపోయింది.

అంగరంగ వైభవంగా పెళ్లి జరిగింది.

“ఇదంతా కలలోలా అనిపిస్తుంది. మీకు ఇదంతా ఎలా సాధ్యమైంది” ఆత్రంగా అడిగింది తొలిరాత్రి భర్తని. నీకు డైరెక్ట్‌గా చెప్పలేక ఇటునుంచి నరుక్కొచ్చా.

ఎలా ఉంది మన ప్లాన్ అన్నాడు ఆదిత్య భార్య వైపు మురిపెంగా చూస్తూ. సంతోషంతో ఉక్కిరబిక్కిరవుతూ భర్త గుండెల మీద వాలిపోయింది ఆముక్త.



**సాహిత్యానికి నోబెల్ బహుమతి, 1978, ఫ్లోరిడాలోని సర్ఫ్‌సైడ్‌లోని ఒక వీధికి, న్యూయార్క్ నగరంలోని ఒక వీధికి, లియోన్సిన్‌లోని ఒక వీధికి, బిల్గోరాజ్‌లోని ఒక వీధికి అతని గౌరవార్థం పేరు పెట్టారు. అతని గౌరవార్థం రాడ్జిమిన్‌లోని ఒక పార్క్ స్క్వేర్, లుబ్లిన్‌లోని ఒక సిటీ స్క్వేర్‌లకు ఆయన పేరు పెట్టారు.**

## నవలలు, చిన్నికథల రారాజు

# ఐజాక్ బషెవిస్ సింగర్

రష్యన్ సామ్రాజ్యం లోని పోలాండ్ దేశంలోని రాడ్జిమిన్ అనే ప్రాంతంలో 1904 జూలై 14వ తేదీన ఐజాక్ బషెవిస్ సింగర్ జన్మించారు. నవలలు, చిన్నకథల రచనలతో చక్కని ప్రభావం చూపిన ఆయన 1978లో సాహిత్యరంగానికి ప్రకటించిన నోబెల్ బహుమతి అందుకున్నారు. పోలాండ్ మరియు యునైటెడ్ స్టేట్స్‌లో యూదుల జీవితాన్ని వర్ణించే అతని రచనలలో కల్పన, వ్యంగ్యం, చమత్కారాల మేళవింపు కనబడుతుంది. సింగర్ యిడ్డిష్ భాషలో వ్రాసి ప్రచురించేవారు. అతని నవలలు వార్తాపత్రికలలో ధారావాహికలుగా ప్రచురించబడ్డాయి. అతని చిన్న కథలను కూడా అనేక పత్రికలు ప్రచురించాయి. అతని నవలలు మరియు కథలు ఆంగ్లంలోకి అనువదించబడ్డాయి. అతని భాష సాధారణంగా సరళంగా మరియు సహజంగా ఉంటుంది.

అతని అన్న ఐ.జె. సింగర్ నవలా రచయిత. అతని సోదరి ఎస్తేర్ క్రెట్‌మాన్ (క్రీట్‌మాన్) కూడా ప్రసిద్ధ రచయిత్రి. వారిలాగే ఐజాక్ బషెవిస్ సింగర్ కూడా రచయితగా పేరు తెచ్చుకోవాలని అనుకున్నాడు. 1925లో అతను "ఆఫ్ డెర్ ఎల్టర్" ("ఇన్ ఓల్డ్ ఏజ్") కథతో సాహిత్య రంగంలోకి ప్రవేశించాడు. అతని మొదటి నవల "డెర్ సోట్న్ ఇన్ గోరే" (సాతాన్ ఇన్ గోరే). అతను 1935లో యునైటెడ్ స్టేట్స్‌కు వలస వెళ్ళే ముందు పోలాండ్‌లో ఈ నవల ప్రచురించబడినది. ఆంగ్ల అనువాదంలో సింగర్ యొక్క ప్రసిద్ధ చిన్న కథల సంకలనాలు "గింపెల్ ది ఫూల్" (1957 "గింప్ల్ టామ్"), "ది స్పినోజా ఆఫ్ మార్కెట్ స్ట్రీట్" (1961), "అన్ ఆండెరే డెర్ట్‌సీలుంగెన్"(1963), "షార్ట్ ఫ్రైడే" (1964), ది సీన్స్ (1968), "ఎ క్రౌన్ ఆఫ్ ఫెదర్స్" (1973 నేషనల్ బుక్ అవార్డ్), "ఓల్డ్ లవ్" (1979), మరియు "ది ఇమేజ్ అండ్ అదర్ స్టోరీస్" (1985) ఆయనకు ఎంతో పేరు తెచ్చాయి. అనేక చలనచిత్రాలు సింగర్ రచనల ఆధారంగా రూపుదిద్దుకున్నాయి. "ది మెజీషియన్ ఆఫ్ లుబ్లిన్" (1979) అతని నవల ఆధారంగా అదే పేరుతో ఒక సినిమా మరియు యెంట్ల్ (1983) అనే నవల ఆధారంగా ఆ పేరుతోనే మరో సినిమా తీశారు. "స్టోరీస్ బిహైండ్ ద స్టో" ఆధారంగా సినిమాలు వచ్చాయి. ఎనిమీస్, ఎ లవ్ స్టోరీ (1989), లవ్ కమ్స్ లేట్లీ (2007), మిస్టర్. సింగర్స్ నైట్మేర్ ఆర్ మిసెస్ పుప్కోస్ బార్డ్ [67], ఫూల్స్ ప్యారడైజ్ లు కూడా సింగర్ రచనల ఆధారంగా వచ్చిన సినిమాలు మరియు రంగస్థల ప్రదర్శనలు. ఆయన రచనలకు ఎన్నో అవార్డులు పట్టంకట్టాయి. జ్యూయిష్ బుక్ కౌన్సిల్ ఫర్ ది స్లేవ్, 1963, ఇట్జిక్ మాంగెర్ ప్రైజ్, 1973, నేషనల్ బుక్ అవార్డ్ (యునైటెడ్ స్టేట్స్), 1974, సాహిత్యానికి నోబెల్ బహుమతి, 1978.

ఫ్లోరిడాలోని సర్ఫ్‌సైడ్‌లోని ఒక వీధికి, న్యూయార్క్ నగరంలోని ఒక వీధికి, లియోన్సిన్‌లోని ఒక వీధికి, బిల్గోరాజ్‌లోని ఒక వీధికి అతని గౌరవార్థం పేరు పెట్టారు. అతని గౌరవార్థం రాడ్జిమిన్‌లోని ఒక పార్క్ స్క్వేర్, లుబ్లిన్‌లోని ఒక సిటీ స్క్వేర్‌లకు ఆయన పేరు పెట్టారు. 1991 జూలై 24న అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలోని సర్ఫ్‌సైడ్ ప్రాంతంలో ఆయన మరణించారు.





# రిలీవింగ్ ఆర్డర్



కొండి మల్లారెడ్డి, 96521 99182

పత్రం మీద
పచ్చసిరా తడిఆరకమునుపే
ఆదేశాలు అమలులోకొస్తాయి
లిప్తపాటులో
కాళ్ళకిందినేల పరాయిదైపోతుంది

క్షణాల వ్యవధిలో
కలలన్నీ నీటిబుడగల్లా పేలిపోతాయి
బిక్కుబిక్కుమంటూ పిల్లలు
బిక్కమొహాలేసుకొన్న తరగతి గదులు

హత్తుకునే ఆప్తులు
సాగనంపే సహచరులు
అయినా ఏదో వెంటాడుతున్న వెలితి

చుట్టూరా
అసహజత్వం ఆవహించి
అసౌకర్యంగా తోస్తుంది
ఉన్నచోటే నిలువునా చీలి
తలదాచుకోవాలనిపిస్తుంది

నిన్నటిదాకా అన్నింటాతానే
సుద్దముక్కనుంచి స్కూలుముద్రవరకు
హాజరు పట్టీ నుంచి అక్విటెన్స్ దాకా
అన్నీ చిరపరిచితమే

పాఠ్యాంశాలు ప్రయోగశాలలు
సాంస్కృతిక సభానిర్వహణలు
మధ్యాహ్న భోజనాలప్పుడు
మైదానంలో ఆటలప్పుడు
వొక్కటేమిటి
మాయాబజార్ సినిమాలోలాగా
ఎటుచూసినా అటు
అన్ని పాత్రలలోనూ తనే దర్శనమిచ్చేది

అప్పటిదాకా ఆటల్లో లీనమైన
పసిపాప చేతుల్లోంచి
బొమ్మను లాగేసుకున్నట్టు
లాంగ్ స్టాండింగ్
గుండెను మెలిపెడుతుంది

వొక్కపోటుతో
జీవితం విరిచి విసిరేసిన
చాక్‌పీస్‌లా మారుతుంది

బదిలీ ఏదైనా
బతుకు తత్వాన్ని
విడమర్చి చెప్పే జీవనపత్రమే
రిలీవింగ్ ఆర్డర్....

# ఆర్తి నిండిన లేదాళ్ళ కవిత “అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి”

చీమకాలు విరిగిన చప్పుడు వినగలిగే కవిపై విశ్లేషణ...

డా॥ కాంచనపల్లి గోవర్ధన్ రాజు

సాధారణంగా ఏ కవి సృజన శక్తిని అంచనా వేయాలన్నా అతను తన సంపుటానికి పెడుతున్న శీర్షికే ప్రధానం. శీర్షికే కవిలోని ఆర్తిని వస్తువుతో అతనికున్న గాఢానుభవాన్ని పట్టిస్తుంది. మామూలు మనుషులకు కొన్నిసాధారణాంశాలుగానే కనిపిస్తాయి. కాని సృజన చైతన్యం ప్రోది చేసుకున్న కవులకు అవి hyperboleగా ఉంటాయి. వాళ్ళ దార్శనిక శక్తి వల్ల అవి అసాధారణ ప్రాధాన్యం సంతరించుకుంటాయి. లేదాళ్ళ వెలువరించిన “అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి” కవితా సంపుటి ఇట్లాంటి అసామాన్య అనుభవాన్ని గుండె దీపం వెలిగించి చూపిస్తుంది. శీర్షికే ఈ కవి ఆర్తిని, అతను ఏ మానవ వేదన నుండి మాట్లాడబోతున్నాడో తెలుపుతుంది.

లేదాళ్ళ కవిత్వం అతి సాధారాణంగా ఓ మనిషి వైయక్తిక అనుభవం మనకు పంచుతున్నట్టే మొదలౌతుంది. కాని ఆయన సాధారణ వాక్యాలే పోయెం చివరికల్లా అసాధారణ అభివ్యక్తిగా మనముందు నిలుస్తుంది.

నిజానికి ఏ కవి అయినా ఒక అంతర్మథనం జరిగాకే హృదయాన్ని అక్షర రూపంలోకి ఆవాహన చేస్తాడు. ఇలియట్ తన Three Voice Of Poetryలో ఈ రకమైన కవన రచనా పరిణామాన్ని ఈ విధంగా చెబుతాడు. The First voice is the voice of the poet talking him self - or to nobody. The second is the voice of the poet addressing an audience, whether large or small. The third is the voice of the poet when he attempts to create a dramatic character speaking in verse. లేదాళ్ళ కవిత్వంలో కూడా ఈ అంతర్మథనం జరిగాకే ఒక రూపాన్ని సంతరించుకున్న కవిత వచ్చిందని ఆయన సంవిధానాన్ని చూస్తే అర్థమౌతుంది. అనేకమంది కవుల్లాగే లేదాళ్ళ కవిత్వంలో 1) అమూర్త చింతన 2) సామాజిక చింతన రెండూ




కనిపిస్తాయి. బహుశా ఏ కవిలోనైనా జీవిత కాలపు చింతన, మరణానంతర ప్రశ్నల చింతన రెండూ ఉంటాయనుకొంటాను. కాగా ఒకటి ప్రధాన అంశంగా నిలిస్తే ఒకటి ఉపాంశంగా నిలవడం చూస్తుంటాం. ఈ సంపుటిలో రేకుల ఇల్లు, కదిలే దండెం, నర్సవ్వ, దువ్వెన, అంకూసమ్మ హెూటల్, గిరిక, గూర్ఖా, వాడికి ఆకలేసింది. మొక్క, చీపురుకట్ట, మొదలైన కవితలన్నీ సామాజిక చింతనతో కొనసాగేవే. నవ్వులన్నీ నిజమేనా, నీడలు, పురి విడిపోతుంది, చీకటి, దేవుడి దు:ఖం, పెట్టె ఖాళీ అయిపోయింది, కొన్నాళ్లుం టానని వచ్చానిక్కడికి, పోయిందేమీ లేదు లాంటి కవితలన్నీ అమూర్త చింతన నుండి వచ్చినవే.

లేదాళ్ళ ఎన్నుకున్న కవితా వస్తువులను చూస్తే సామాజిక చింతనలో అతను ఏ వైపునుండి మాట్లాడుతున్నాడో తెలిసిపోతుంది. మహా ప్రస్థానానికి ముందుమాట రాసిన చలం “కృష్ణ శాస్త్రి దు:ఖం సమాజానిదైతే సమాజ దు:ఖం శ్రీశ్రీ ది” అన్నాడు. భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం లాంటి విగడనలున్న కాలంలో ఈ మాట బాగా సరిపోయింది. లేక ఆ కాలానికి కొత్తగా అనిపించింది. కాని ఇవ్వాళ్ళ కవిత్వాన్ని ఇంత స్పష్టంగా తూచడం సాధ్యం కాదు. ఈ రెండూ జమిలిగా ఉన్న ఈయన ప్రారంభ కవిత

పుస్తక పరిచయం

"ఒక పద్యాన్ని నేను రాసుకోవాలి"
ఒకసారి చూడండి,

... చీమ కాలు విరిగిన చప్పుడు
గురించో రాత్రి అరచిన కీచురాయి
ఆవేదన గురించో మానవ మేధ కందని
ఒకానొక దు:ఖిత హృదయాన్ని గురించో
ఆకలి రాత్రి అలసిన దేహాన్ని గురించో..
గాలి తాకిడికి పండుటాకులు చేసే ఖేద
సంగీతాన్ని గురించో రాత్రిని చూసి
ఫక్కున నవ్వే చుక్కల చెక్కిళ్ళ గురించో
ఒక పద్యాన్ని నేను రాసుకోవాలి
ఈ రాత్రి నిదుర మానుకొనైనా సరే
ఒక పద్యాన్ని నేను కన్నీటి సిరాతో
రాసుకోవాలి

పై పోయెంలో లేదాళ్ళ ఎవరూ చూడలేని అంశాలను చూసిన విలక్షణమైన కవితనం కనబడుతుంది. ఇల్లాంటి Romantic అభివ్యక్తిలోనే అకస్మాత్తుగా ఆయన "ఆకలి రాత్రి అలసిన దేహం" గురించి ప్రస్తావించి తన విలక్షణతను చాటుకున్నాడు.

ఆయన స్వీకరించిన మరో అరుదైన వస్తువు "కదిలే దండెం". దండెం దండెం గానే కొనసాగి మనిషి జీవితంతో simileగా మారుతుంది.

...ఉదయమైతే చాలు మొనదేలిన
క్లిప్పుల దంత క్షతాలే నా ఒళ్ళంతా
తప్పించుకోలేని అనివార్యపు
సంసార బంధంలో చిక్కిన ఇల్లాలిలా
నా నిండా మోయలేని బరువులు-
బాధ్యతలే......

క్లిప్పుల దంత క్షతాలు అన్న Metaphor దండెంలో పొదిగిన మానవ లక్షణాలను స్ఫురింపిస్తుంది.

ఇంతటితో ఆగకుండా దండెం ఆవేదనను కొత్త కోణంలో చూస్తూనే దండాన్ని క్రమంగా (Humanization) మానవీకరిస్తాడు.

... పిల్లల అల్లరి భరించే తల్లిలా
నా హృదయం ఆనందమై మురిసి
పోతుంది

ఒక Metamorphosis తో దండెం తల్లిగా రూపాంతరం చెందింది.

లేదాళ్ళ కవితలు కొన్నిసార్లు ఈ



వరకే చెప్పినట్టు వస్తు ప్రధానంగా కొనసాగుతాయి. నిరలంకార సౌందర్య సాధన ఈయన చాలా సార్లుఎన్నుకునే కవితా లక్షణం. నిజానికి ఈ పద్ధతి చాలా క్లిష్టమైంది. ఆధునిక కవిత్వం Symbols, Images ప్రధాన సూత్రాలుగా కొనసాగుతున్న కాలంలో పూర్తి స్థాయి నిసర్గంగా కొనసాగి మెప్పించడం లేదాళ్ళకే చెల్లింది. ఈయన టైటిల్ కవితే ఇందుకు ఉదాహరణ.

"అమ్మకో జత చెప్పులు కొనాలి
ఎలాగైనా అనుకునే వాన్ని" చిన్నప్పుడు

కవిత ఆద్యంతం ఇటువంటి సామాన్య వాక్యాలే ఉంటాయి.

... మరొకసారి అమ్మ కాళ్ళకు
కొనలేని మెత్తని చెప్పులు గుర్తొచ్చి
కన్నీటి ప్రవహామౌతాను...

....జానాతో కొలిచిన అమ్మ కాళ్ళ
కొలతలు ఇక ఏ మాత్రం తొలగిపోలేనంత
గ్యాపకాలైనయి....

ఇప్పుడా చెప్పులు గూట్లో స్తబ్దంగా
కనిపిస్తాయి.

ముట్టుకున్నపుడల్లా మెత్తగా..
అమ్మ పాదాలు కంది పోతాయేమోనన్నంత
మృదువుగా..

కవితలో అమ్మ పట్ల కవికున్న ఆర్తి స్వభావ రమ్యంగా వ్యక్తీకరించబడింది.

అట్లాగని ఇతను అలంకారాల నుండి పూర్తిగా విముక్తం అయాడనలేం, అయితే ఇతని అలంకారాలన్నీ పూర్తిగా అలవోకగా వచ్చి చేరేవే.

వ్యాపకాల వింజామర, బ్రతుకు యంత్రం, ఊహల గుర్రాలు, కోపపు కొరడాల వంటి Metaphorలు,నేనో నదిని అంటూ మనిషి పూర్తిగా రూపాంతరం చెందే Metamorphosisలు, కన్నులతో మొలకెత్తడంలాంటి paradoxలు, సొట్టలే బుగ్గలనిండా ఆక్రమించాయి లాంటి Juxtapositionలు, మనం చూడవచ్చు. ఈ అలంకారాలను ఇదమిద్ధంగా ఇవే అని తేల్చలేకపోయినా వాటి ఛాయలను ఇందులో గమనించవచ్చు.

కాలం ఆమె అయితే, కాలమొక కఠిన ప్రియురాలు, లాంటి ఆమూర్తమైన కాలం మానవీకరణ చెందింది. వంట బ్రాహ్మడు, వాల్ క్లాక్ లాంటి కవితలు కొత్త కోణాన్ని ఆవిష్కరించాయి.

ఎంత సహజంగా చెప్పాలనుకున్నా ఆయనలోని కవి, వాక్యాలలో ఒదిగి కనిపిస్తాడు. దు:ఖం మొలిచిన ప్రతిసారి నీడలు నిలబడుతాయి, వెలుగు ప్రసరించినపుడే కదా నీడల నగ్నత్వం బయట పడేది, సూర్యుడు దిక్చక్రం పై కునుకు తీసే వేళ, రెప్పవాల్చని రాత్రులని వాళ్ళకోసం ధారపోశాం, కొండైనా గుండైనా దగ్గరగా ఒదిగి చూడు ఎన్ని గాయాల ఎత్తులో, లాంటి వాక్యాలు మనలను వెంటాడుతాయి. కిరాయోల్ల గోస తెలంగాణ భాషలో సాగిన కవిత. పాముదంగ, అర్రలల్ల, కల్యామాకు, లాంటి తెలంగాణ పదాలు కవితలలో చక్కగా ఒదిగిపోయాయి. మౌన వేళ, అభౌతిక లాంటి వ్యాకరణ విరుద్ధ పదాలు కవి ప్రయోగాకాంక్షని తెలియజేస్తాయి.

కవి కేవలం అనుభవం చెబితే సమాచార ప్రదర్శన అవుతుంది. దానికి కళాత్మకత, దానికి సామాజికత, దాని వెనుక పూసలలో దారం వలె తాత్త్వికత సమపాళ్లలో జోడించబడ్డపుడే ఉత్తమ కవిగా నిలబడగలుగుతాడు.

లేదాళ్ళ రాజేశ్వరరావు ఈ పరిణతి దిశగా అడుగులు వేస్తున్న కవి అని నా విశ్వాసం. ఆయన "అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి" కవితా సంపుటి ఈ ప్రయాణంలో ఒక మైలురాయి అని నేను భావిస్తున్నాను.

వ్యాసం

# పల్లెవాసుల మనసులు పట్టుకున్న నల్ల పిల్లనగ్రోవి కథలు...

యవ్వన మనస్తత్వాలను సహజంగా చిత్రించిన కథలు...



గిడ్డకింద మాణిక్యం
94921 64107

**The short story is not an accident form : it is a sign of the real sense of fleetingness, fragility.**

**- H.G.Wells**

ప్రముఖ రచయిత హెచ్.జి. వెల్స్ కథపై అభిప్రాయమిది. ఆయన అభిప్రాయాన్ని అందరూ ఏకీభవించాలని లేదు. కానీ ఆలోచించాలి. కొన్ని కథలు పాఠకుడి మనసుని కొన్ని క్షణాల పాటు విరగొట్టి, ఒక విధమైనటువంటి తన్మయస్థితికి తీసుకుపోతుంది. సరిగ్గా అలాంటి కథల కోవలోకి చేరే కథలే గూండ్ల వెంకట నారాయణ రాసిన నల్ల పిల్లనగ్రోవి కథలు. రొటీన్గా గ్రామీణ కథలంటేనే పచ్చదనం, కరువు, నీటి సమస్య, ఫ్యాక్షన్ వంటి భౌతిక సమస్యలనే కథలుగా స్పృశిస్తూ వస్తున్న ఈ కాలంలో, అందుకు భిన్నంగా పల్లెవాసుల మానసిక స్థితి, వారి ఆలోచనల పైన కథల్ని రాశారు కథకుడు గూండ్ల వెంకట నారాయణ. ఇది అభినందించదగ్గ విషయమే. ఈ కథలు చదివాక, ఇదేదో పైకి సాధారణ కథనంతో ఎలాంటి పైపై మెరుగులు అద్దకుండా కథకుడు తన ఊరి గురించి, తన అనుభవాల గురించి, ఆ ఊరిలోవుండే తనలాంటి వయసున్న యువకులు వేరే వ్యక్తులను చూసే చూపులు గురించి, లోలోపల అనుకునే ఆలోచనలు అన్నీ కుంటలో చేపపిల్లలను సైతం వదలకుండా




వలలో పట్టుకున్నట్టు అనిపిస్తుంది.పైకి సాదాసీదా విషయాలు కథావస్తువులైై నప్పటికీ దానికి beyond గా ఆలోచించాల్సిన అవసరమున్న కథలు.

ఈ మధ్య ఒక సాహిత్య కార్యశాలలో యువకుల దగ్గర నుండి యవ్వన మనస్తత్వాలు, వారి చిలిపి చేష్టలపై కథలు రావాల్సినంత రాలేదని విన్నాను.ఈ నల్ల పిల్లనగ్రోవిలోని ఎనిమిది కథలు ఆ ఖాళీలను పూరించిందని (filling the gaps with untold stories) నమ్ముతున్నాను. ఈ కథలన్నీ ఎలాంటి సామాజిక దృష్టి కోణం లేకుండా కేవలం పాత్రల యొక్క Point of view నుండి లేనిదాన్నీ వున్నట్టుగాని, వున్నదాన్నీ లేనట్టుగా గానీ కథను సృష్టించే ప్రయత్నం చేయలేదు. కథలను తను చూసిన లేదా తను అనుభవించిన సంఘటనలను Neutral State నుండి మాత్రమే నడిపారు. కథలను నడిపే క్రమంలో వర్ణనలు, దానికి వాడిన ప్రతీకలు చాలా కొత్తగా ఆకట్టుకుంటున్నాయి. కథల్లో పాఠకుడిని సూటిగా విషయం పై తీసుకుపోయే ప్రారంభ వాక్యాలు పాఠకుడి ఆలోచనా పరిధికి వదిలేసి (over to you) అనే విధంగా ముగింపు వాక్యాలు పాశ్చాత్య రచనలను పోలి ఉంటాయి. కథల్లో ఎక్కువ పాత్రలు పెట్టి పాఠకుడిని సంక్లిష్టతకు గురిచేయలేదు. అలాగే ఎక్కువ సంభాషణలు లేదు, వున్న సంభాషణలు రాయలసీమ కర్నూలు మాండలికపు యాసతో అందంగా వున్నాయి. సగానికి పైగా కథల్లో పాత్రలకి పేర్లు కూడా చెప్పకుండా ప్రయోగం చేశారు రచయిత. నిజానికి పేర్లు పెట్టాల్సిన అవసరం లేదని కూడా రచయిత ఆలోచన అయ్యుండొచ్చు. ఇంక కథల్లోకి వస్తే మొదటి కథ 'పాత కుందేలు బొమ్మ'లో వయసులో పెద్దవారైన అమ్మ మూఢ నమ్మకాలు, అరిష్టాలు చుట్టూ తిరుగుతూనే, చిన్న పిల్లల Children Psychologyని పట్టి

వ్యాసం

చూపిస్తుంది. పిల్లలు వాళ్ళకి ఇష్టమైన వాటిని పట్టుబట్టి ఎలా సొంతం చేసుకుంటారో, దాన్ని ఏ విధంగా కల్మషం లేకుండా ప్రేమిస్తారో చూడొచ్చు. పాత కుందేలు బొమ్మ పాడైపోయిన దిగులుతో "బుజ్జి కుంతేలు - బుజ్జి కుంతేలు" అని కలవరిస్తూ చివరకు బొమ్మ కుందేలు చనిపోయినట్టు పాప కూడా చనిపోతుంది. ఈ కథ చదువుతున్నప్పుడు మన బాల్యంలో ఏదొక తిరణాలులోనో లేదా జాతరలోనో బొమ్మ కోసం పట్టుబట్టి మొండికేయడం కూడా మనకు గుర్తుకొస్తుంది.

'నల్ల పిల్లనగ్రోవి' కథ ఒక Re-Created Myth. కృష్ణుడు, రాధ, యశోద వంటి పురాణ పాత్రలు తీసుకుని వర్తమాన కుల సమస్యతో కథను నడిపిన తీరు అబ్బురపరుస్తుంది. పిల్లన గ్రోవితో చెట్టు పై రాధ కోసం వేచివున్న కృష్ణుడు. ఆ సమయంలో యానాది పిల్లవాడు కృష్ణుడికి విద్య నేర్పించటం."ఆ మాల పిల్లతో కృష్ణుడికి స్నేహం ఏమిటి?" అని యశోద రాధాకృష్ణులు ప్రేమను విడదీయటం. కృష్ణుడి రాగం గురించి రచయిత వర్ణించిన తీరు ఎంతో గొప్పది.

I think action is unreal.It is the thing that we do in the dark that is more real -Virginia wolf.

మానవుని భౌతిక చర్యలకంటే, మానవుని ఆలోచనలే ఎక్కువ వాస్తవిక మైందని ఆమె గట్టిగా నమ్ముతుంది. వాస్తవానికి ఆవిడ రచనలు కూడా ఈ విషయాలను ధృవపరుస్తాయి. ఆ ప్రకారంగానే ఈ పుస్తకంలోని మిగతా కథలు సాగుతాయి. 'తండా వాళ్ళ అమ్మాయి' పట్ల కథకుడు పెద్దనాన్న కొడుకు చేసే ఆలోచనలు. తండా అమ్మాయిని ఎలాగైనా ప్రేమ పేరుతో వశపరుచుకుని అనుభవించాలన్న కోరిక, ఉత్సాహాన్ని చూపిస్తూనే కథకుడికి అమ్మాయిల పట్ల వున్న భయం, ఇంట్లో వారిపట్ల గౌరవాన్ని కూడా చూపిస్తారు. తమ కన్నా తక్కువ జాతి స్త్రీ పట్ల యువకులు ఎలాంటి Mind Set కలిగి ఉంటారో చూపిస్తారు. నిజానికి కథకుడు అన్న తన కళ్ళ వర్ణకంలోను, వ్యక్తిత్వంలోనూ మోసం అంతర్లీనంగా దాగుంది. చివరకు తండా వాళ్ళ అమ్మాయి దిక్కు తెలియక అయోమయంలో పడిన దయనీయ స్థితిని చూపుతారు. ఇంకొంచం లోతుగా పరిశీలిస్తే oppressed classes వారి ప్రేమ నిజమైందనే సత్యాన్ని కూడా అర్థంచేసుకోవచ్చు. ఈ కథ బంజార జీవితాలపై బంజారేతరుడు రాసిన మంచి కథగా చెప్పవచ్చును. 'ఊళ్లోకి నాయకుడు వచ్చాడు' కథలో కథకుడు రాజకీయాల పై విసిగిపోయి ugly Political Commentator పాత్ర పోషిస్తే పాఠకుడు Spectatorగా మారిపోవల్సిందే. నాయకుడు ఊరిలోకి వస్తే ఆ పార్టీ మనుషులు చేసే హడావుడి, హంగామా, ఏర్పాట్లు ఒక పక్క చూపిస్తూ మరో పక్క ఎవరు వస్తున్నారో? ఎందుకు వస్తున్నారో? తెలియని అమాయక స్థితిలో వుండే సాధారణ ప్రజలను కూడా చూపిస్తారు. కేవలం అయిదు వందల రూపాయిల కోసం ఒక ముప్పై వయసున్న తండా మహిళల జీవిత పోరాటం ఎలాంటిదో వివరిస్తారు. ఇంత కాలం ఆ జనాలను పేదరికంలో వుంచిన రాజకీయ కుట్ర బట్టబయలైంది. ప్రస్తుత రాజకీయ నాయకుల వలే కథలో కూడా విషయ పరిజ్ఞానం లేకుండా

> **'ఒక కాలు ఒక చెయ్యి మనిషి' కథలో పోలియోతో వికలాంగుడైన తిరుమలను తోబుట్టువులు, గ్రామంలోనీ జనం చూసే చిన్నచూపును. "అవిటోడికి ఆస్థి అంతస్తులెందుకు? పెళ్ళాం బిడ్డలను సాకబోతాడా?" అని అన్నదమ్ములే అనడం." ఎట్లా నీకిచ్చేదిరా? చచ్చిందాక అన్నీ పనులు చేసిపెట్టి నా బిడ్డ సుఖం లేకుండా చావాలి" అని సొంత అక్క అనడంతో తన పెద్ద అన్న బుర్రయ్యా చేరదీయడం.**



content లేని మాటలు, విద్వేషాన్ని రెచ్చగొట్టి వుసిగొల్పే మాటలు చెప్పి గొడవలు సృష్టించి తద్వారా కలిగే అమాయక ప్రజల ప్రాణ నష్టం అన్నిటినీ కళ్ళ ముందు దృశ్యకరించారు. నాయకుడేమో తన స్పీచ్ లో మహిళలు పట్ల గౌరవం ఉందంటారు. వాళ్ళ పార్టీ కార్యకర్తేమో ముప్పై ఏళ్ల తండా మహిళతో అత్యాచారానికి పాల్పడుతాడు. చెప్పేదొకటి చేసేదొకటి లాగ. ఒకవేళ నాయకుడు దళితుడో లేదా గిరిజనుడో అయ్యుంటే కార్యకర్తలు ఇదేవిధంగా హంగు ఆర్భాటం చేసేవారా? దళిత నాయకులకు యింత మర్యాద, గౌరవం దక్కుతుందా? అనే సందేహాలు కలుగుతాయి.

'ఒక కాలు ఒక చెయ్యి మనిషి' కథలో పోలియోతో వికలాంగుడైన తిరుమలను తోబుట్టువులు, గ్రామంలోనీ జనం చూసే చిన్నచూపును. "అవిటోడికి ఆస్థి అంతస్తులెందుకు? పెళ్ళాం బిడ్డలను సాకబోతాడా?" అని అన్నదమ్ములే అనడం." ఎట్లా నీకిచ్చేదిరా? చచ్చిందాక అన్నీ పనులు చేసిపెట్టి నా బిడ్డ సుఖం లేకుండా చావాలి" అని సొంత అక్క అనడంతో తన పెద్ద అన్న బుర్రయ్యా చేరదీయడం. తిరుమలకు కడుపాకలిని, దేహాకలిని తీర్చిన తన వదిన చెంచమ్మ పాత్ర మరిచిపోలేనిది. ఈ కథలో Characters perspective నుంచి చూస్తే ఎవరిది తప్పు కాదు. కానీ సంప్రదాయ

వ్యాసం

సమాజ కళ్లద్దాల నుండి చూస్తే అందరిది తప్పే అవుతుంది. వికలాంగులకు భౌతికమైన సమస్యలనే కాకుండా మానసిక సమస్యల్లో భాగమైన, హార్మోనల్ ప్రభావం వలన కలిగే శారీరక సుఖ సమస్యలు కూడా అందరి మనుషుల్లాగే ఉంటాయనే నిజమైన నీతిని మాత్రం బలంగా చెప్పగలిగింది.

ఇక 'గోయి' కథలోని పాత్రలోని అమ్మాయి విచిత్రమైన వ్యక్తిత్వం కలిగినది. అందరిలాగ డబ్బు కోసం లొంగే వ్యక్తి కాదు, ఇష్టమని ఎవరు వచ్చినా ఇష్టంతో కలిసే రకం. ఒక తన భర్తతో తప్ప. ఎందుకంటే తన భర్త మాటవరసకు కూడా ఎప్పుడూ ఆవిడని అందంగా ఉన్నావని చెప్పలేదు కనుక. ఇందులో ఆడవాళ్ళు పొగిడితే పడిపోయే Female praising or Female admiring psychologyని కూడా చెప్పకనే చెబుతాడు రచయిత. 'కోరిక జబ్బు' కథలో Opposite sex Attraction గురించి చెబుతూ శారీరక సుఖం పొందిన తర్వాత కలిగే విరక్తిని యిలా చెబుతాడు "ఎవుంది దాంట్లో ఓ సారి పోతే కారిపోయే సుఖం అది"ని అంటాడు. చివరి కథ 'కవి గూండా సామ్రాట్' కథ satire on literary individuals అనే చెప్పాలి, అంటే అందరినీ కాదు కొందరిని. కథలోని వచనం హాస్యస్పదంగా అలరిస్తుంది.

ఈ కథల్లోని సగానికి పైగా కథలు Romantic Style of Narration కనిపిస్తోంది. యవ్వనంలో వుండే సాధారణమైన Adolescent behaviour కనిపిస్తోంది. కానీ పురుషుడు స్త్రీని sexual కోణం నుండి మాత్రమే చూస్తాడని కథల్లో సృష్టించారు రచయిత. పాత్ర స్వభావాన్ని Conversationలో కాకుండా రచయిత Proseలోనే చెప్పేశారు. ఇది ఒకరకంగా చలం గారు చెప్పిన దానికి విరుద్ధంగా వున్నా కొత్త ప్రయోగంలాగ అనిపించింది. ఆ క్రమంలో చేసిన వర్ణనలు దానికోసం వాడిన metaphors అమితంగా ఆకట్టుకుంటాయి. అందులో కొన్ని చీకటి పట్టి తల మీద పింఛాల్లా చుక్కలు విచ్చుకున్నాయి (తండా వాళ్ళ అమ్మాయి)

కొయ్య రెక్కల్లా పార్టీ జెండాలు (ఊళ్ళోకి నాయకుడు వచ్చాడు)

మబ్బుల్లోంచి నెల పొడుచుకు వస్తున్నట్టు చను బొడిపెలు జాకెట్టుని గుచ్చుకుని కనబడతాయి (గోయి)

ఆకు మీద పురుగు చేరి దాన్ని కొరుక్కు తిన్నట్టు (కోరిక జబ్బు)

పీడకల ఒంటి చుట్టూ పాములా చుట్టుకున్నట్టు (కోరిక జబ్బు)

వాన బొట్టు బరువుకి కిందకి వాలిన తడిపూలకొమ్మలాగ.

ఈ కథలు చదివి ఎవరైనా ఏమైనా అనుకుంటారేమోనని కాకుండా ఎలాంటి భయం లేకుండా నిజాయితీగా రాసిన కథలనే చెప్పాలి.

నిజానికి ఇలాంటి చెప్పలేని చెప్పుకోడానికి ఎబ్బెట్టుగా వుండే Sensitivity కలిగిన కథలను రాయడానికి కూడా కొంత guts కావాలి. అందరూ ఇలాంటి కథలు రాయలేరు కూడా. ఈ విషయంలో రచయిత నిజంగానే ప్రశంసనీయులు. ఈ కథలన్నీ Purity, genuinity, Soulfulగా వుంది. భవిష్యత్తులో మరిన్ని చెప్పుకోలేని పార్శ్వాలను కూడా ఇదేవిధంగా రచయిత కథలుగా చిత్రిస్తాడని ఆశ కలుగుతోంది.

కవిత

# మబ్బుల చాటు చందమామ

- డా॥ అంజనా శ్రీ కంభం, 77025 38453



చందమామ మబ్బుల చాటుగా
సుదీర్ఘ సమయం నుండి నన్ను వెక్కిరిస్తున్నట్లు
నవ్వుతున్నట్లుగా ఉంది
అక్కడక్కడ చినుకు చినుకులుగా
కురుస్తున్న మంచు తుమ్పారులు
మనసుకు హాయి కలిగిస్తున్నాయి
జీవితానికి వెలుగు రేఖలుగా
కొత్త కొత్త దృశ్యాలను
కొత్త కొత్త చిత్రాలు అన్ని ఆస్వాదిస్తాను
కాల గమనంలో నీవు నేను అందరం
కొత్తదనాన్ని ఆహ్వానిస్తున్నాను కోటి భావాలను
లక్ష ఆలోచనలను నేను నిక్షిప్తం చేస్తున్నాను.



# ఎడారి వాసం!



రమేశ్ నల్లగొండ, 83094 52179

పేదరికం ఎడారిలో ఏకాకి నిరుపేదను నేను
మండుటెండలో మండే గుండెతో నేను

ఎడారి రాతిరి శీతలవాయువుల
మధ్యాహ్న ఎండల ఉష్ణగాలుల కరవాలాల  ఇసక ప్రాంతం
ఏ పర్వత శ్రేణుల అడ్డుగోడలో
ఏ తేమగాలుల అలకలో ఈ అనార్ద్ర నేలతనం
ఏ నదుల అంతర్ధానమో-ఈ ఎడారీకరణం!
ఈ పేదరికపుటెడారి రాకాసిభూమిని తింటూ
ఆక్రమిస్తోంది ప్రపంచమంతాను
యేటేట పెరుగుతున్నది ఎడారి విస్తీర్ణం

రాశుల కొద్ది ఇసుక కోసులకొద్ది ఇసుక
ఈ బీడుభూమిలో ఎంతని నడవను
ఒంటరిగా ఈ గడ్డుకాలాన్ని ఎలా గడపను?
ఎడారిలో నేను ఆకలితో నేను
సమస్తఅందాల, ఆనందాల భూతలంచేరాలనే ఆశతో నేను
మన్ను, మాను, మనిషి కానరాని
సస్యశ్యామలం కాని ఖాళీ రాతితలంలో జడమౌనంలో నేను
సమసిపోని సంఘర్షణలో నేను
ఈ ఇసుక నేలలో ఎందువల్ల నాకీ దౌర్భాగ్యం
ఏది నా ఊహల జీవితం? ఏదీ నా వసంతం?
ఎవరు దోచుకెళ్లారు?

ఎడారి ఉదయస్తమయాల సొగసులు తప్ప
ఎండమావులు ఇసకతావులు తప్ప
ఇసక తుఫానులు తప్ప
చమురు నిల్వలు కప్పుకున్న ఇసక కుప్పలు తప్ప
ఏముంటుందిక్కడ క్షణక్షణం బ్రతుకు భయం తప్ప
నా ప్రాణం గాల్లో దీపం
ప్రవహించే నదీ గర్భంలో రాళ్ళు ఇసకైనట్టు
ఈ ఎడారిలో నా కలలన్నీ శిధిలం శిధిలం

నా కనుల ముందు శూన్యాకాశాలు తప్ప
సమస్యల, సందేహాల బ్రహ్మజముళ్లు తప్ప ఏవీ లేవు
ఈ ఇసక వేడిగాలి నాకు మృత్యుకౌగిలే బహుశా

ఓయాసిస్సులు, సరస్సులు, ఒంటెలు కానరావు
ఇసుక దిబ్బలే తప్ప ఇలాతలం చేరడానికీ ఏ మార్గం
కనిపించిచావటం లేదు నాకు
ఈ ఏడారి కష్టంఎవరికైనా ఎలా తెలుస్తుంది?
అనుభవమైతే తప్ప

ఏదీ భగీరథ ప్రయత్నం? ఏదీ గంగాసాగరం?
ఎంతటి ఎడారి గుండైనా తడిహృదయం
తడిమితే ఆకుపచ్చ భూతలమే
భూమినినమ్ముకుని నాకాళ్లపై
నేను బ్రతికితే ఎంత బావుండు?
యుగాలు గడుస్తున్నా
ఎడబాటు కాదెందుకో ఈ ఎడారిమయ జీవితం నాకు?
అంతమెప్పుడు నాకు ఈ ఎడారి వాసం?



కవిత

# ప్రతిరూపం

నాంపల్లి సుజాత, 98480 59893

నీడే కదాని,
చూడనట్టే పోయానిన్నాళ్ళు
ఓ శీతోదయాన
నాతో నేను చరిస్తూ
నాలోకి నేను ప్రవహిస్తున్న వేళ
నీడ.. నిశ్శబ్దంగా
అడుగులో అడుగు వేసుకుంటూ
నన్నల్లుకుంది..!

ఏమో అనుకున్నాను గానీ,
నీడంటే..
బడాయిలు పోయే
వెలుగు రేఖలకి ఎదురు నిలిచిన
ధిక్కార జాడే కదా..!

నీడంటే..
మండే ఎండల గుండెల్ని చీల్చి
నిండా శీతలఛాయను పొదుముకున్న
నీలమేఘశ్యామ కదా..!

నేడు నా ఏకాంత అడుగులకు
తోడై జోడై పాటై మాటై
నన్నే అంటిపెట్టుకొని
నడయాడే ప్రియసఖి కదా..!

ఓ మారు
నాన్నలా నా ముందు నడిచి,
మరోమారు నన్నలరిస్తూ అనుసరిస్తూ..
దారి చూపే భరోసానే నీడ..!

నీడని మించిన
నిస్వార్థ మిత్రుడు
ఈ లోకంలో ఇంకెవరైనా ఉన్నారంటారా!?
నో, నెవెర్..
పుట్టలేదు పుట్టబోరు
కడదాకా తోడుండే
వీడని కన్నుల్లో పెట్టుకొని చూసుకోనూ!

# కవి సైనికుడని చాటిన డా॥ దాశరథి



దాశరథి కృష్ణమాచార్య స్వయంగా "తిమిరం తో సమరం" కావ్యానికి వ్రాసుకొన్న ముందు మాటలో "దురంతమైన తిమిరంతో అనంత మైన సమరం ఇది. మూఢత్వానికీ, మూర్ఖత్వానికీ తిరోగమనానికి తిమిరం ప్రతీక. ఈ తిమిరంతో సమరం చేసే సైనికుడు కవి. విజ్ఞానానికీ, అజ్ఞానానికీ జరిగే హెూరాహెూరీ పోరాటంలో మేధావి వర్గానికి చెందిన ప్రతి వ్యక్తీ సైనికుడై పాల్గొనక మానడు" అని చెప్పుకున్నాడు.

"ఇరువదవ శతాబ్దంలో - ఇంచు మించు ముప్పాతిక గడచి పోతున్నా
పుచ్చి పోయిన కులాలతో - వచ్చి పోయిన మతాల పేరుతో
తన్నుక చచ్చే మమ్ములను చూచి - ఖిన్నవై,
ఎన్నడూ రానన బోకు." అంటూ "తిమిరంతో సమరం"లో శాంతి దేవతకు విన్నపం చేస్తాడు దాశరథి. కవి ద్రష్ట కదా! ఆయన చెప్పిన మాటలు ఈనాటి పరిస్థితులను అనుభవిస్తున్న మనందరినీ ఆయనతో కోరస్ పాడిస్తాయి. 1974లో "కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారా"న్ని అందుకున్న కావ్యం "తిమిరంతో సమరం". ఈ కావ్యాన్ని1973 లో రచించారు దాశరథి కృష్ణమాచార్య. దీనిని తన తల్లి వేంకటమ్మకు అంకితం చేశారు. "ప్రాచీన మహర్షుల్లాగా కవులు లోకం లోని అన్యాయాన్నీ, అజ్ఞానాన్నీ, తిమిరాన్నీ, జనం కష్టాలను తొలగించ గలరేమో?!" అంటూ ముందుమాట వ్రాసి, దాశరథి కవితాంతరంగాన్ని ఆవిష్కరించారు విద్వాన్ విశ్వం.




"కృష్ణ నాపి నిరుపేదల - తృష్ణ బాపి నట్టి వారు
విష్ణువు కంటే ఘనులని - వేయినోళ్ళ చాటింతును" అంటూ నాగార్జున సాగర నిర్మాణాన్ని ఆయన ఆహ్వానించిన తీరు ముచ్చట గొలుపుతుంది.

"పచ్చ నోట్లతో కొందరు - కత్తి పోట్లతో కొందరు
ప్రజల వోట్ల విలువను - పడ గొట్టాలని చూస్తున్నారు"
"గడియారం నడవని - పాత కోట గోడ కన్న
సూర్యుణ్ణి ఉరికించే - ఫ్యాక్టరీ కూత మిన్న"
"తిమిరంతో ఘన సమరం - జరిపిన బ్రతుకే అమరం
కవితా తేజోమయం - అవని శాంతి కది నిలయం" ఇటువంటి అద్భుతమైన పంక్తులెన్నో మనకు తిమిరంతో సమరంలో కనబడతాయి.

దాశరథి కృష్ణమాచార్యులు వేంకటాచార్యులు, వేంకటమ్మ దంపతులకు 1925 జులై 22న అప్పటి వరంగల్ జిల్లా (ఇప్పటి ఖమ్మం జిల్లా) లోని చిన గూడూరు గ్రామంలో జన్మించారు. తండ్రి వద్ద సంస్కృతం, బడిలో ఉర్దూను చదివిన ఆయన సాహిత్య రహస్యాలను ఆకళింపుచేసుకున్నారు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని గర్వంగా ప్రకటించి తెలంగాణ ఉద్యమానికీ ప్రేరణనందించిన కవి దాశరథి.

"ఓ నిజాము పిశాచమా, కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని
తీగలను తెంపి అగ్నిలో దింపినావు నా తెలంగాణ కోటి రతనాల వీణ"
"ఎముకల్ నుసిచేసి పొలాలు దున్ని భోషాణములన్ నవాబునకు
స్వర్ణము నింపిన రైతుదే తెలంగాణము రైతుదే"

అని ధిక్కార స్వరాన్ని వినిపించిన కవి దాశరథి. ప్రతి సంవత్సరం దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో సాహిత్యరంగంలో కృషిచేసినవారికి కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ప్రతియేటా "దాశరథి సాహితీ పురస్కారం" అందజేయాలని సంకల్పించి విజయవంతంగా అమలుచేసింది. అగ్నిధార, రుద్రవీణ, మహాంధ్రోదయం, పునర్నవం, అమృతాభిషేకము, కవితాపుష్పకం, నేత్రపర్వం, గాలిబ్ గీతాలు, సినీ పాటలు, యాత్రా స్మృతి మొదలైన 31 పుస్తకాలను ఆయన రచించారు. 1961లో ఇద్దరు మిత్రులు సినిమాకు పాటలు రాసి సినీరంగ ప్రవేశం చేసాడు దాశరథి. కొన్ని వందల అద్భుతమైన పాటలను రచించి తెలుగు భాష సోయగాలను వెండితెరపై గుభాళింపజేశాడు.

1967లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి, 1974 లో కేంద్ర సాహిత్య అకాడమి బహుమతి, ఆంధ్ర విశ్వవిద్యాలయం "కళాప్రపూర్ణ", వెంకటేశ్వర విశ్వవిద్యాలయం "డి. లిట్" మొదలైన ప్రతిష్ఠాత్మక పురస్కారాలు ఆయనను వరించాయి. నిజామాబాదు లోని ఖిల్లా జైలులో ఆయన్ని మరో 150 మందితో ఖైదు చేసి ఉంచింది నిజాము ప్రభుత్వం. ఆయనతోపాటు ఖైదులో వట్టికోట ఆళ్వారుస్వామి కూడా ఉన్నాడు. పళ్ళు తోముకోవడానికిచ్చే బొగ్గుతో జైలు గోడల మీద పద్యాలు రాసి దెబ్బలు తిన్నాడు. 1953లో తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించి అధ్యక్షుడుగా జిల్లాల్లో సాహితీ చైతన్యాన్ని నిర్మించాడు. 1987వ సంవత్సరం నవంబర్ 5న ఆయన మరణించారు.

వ్యాసం

# రామసింహ కవి జీవితం ఆత్మకథ ఒక పరిశీలన

కవితా ధీమంతుని స్ఫూర్తివంతమైన జీవన పథం...



సంకేపల్లి నాగేంద్రశర్మ
80748 26371

వందేళ్ళ కిందటి తెలంగాణా జనజీవితాన్ని ఇతిహాసంగా రికార్డు చేసిన రాఘవపట్నం రామసింహకవి జీవితం, ఆత్మకథ-ఒక పరిశీలన!

తెలంగాణా సాహిత్యం విలువైనది. సంపద్వంతమైనది. ప్రాచీన, ఆధునిక సాహిత్యంలో, ఇక్కడి సంస్కృతులు, చరిత్ర గొప్పవి. మిగతా ప్రాంతాలకు ఏ మాత్రం తీసిపోనిది. తెలంగాణా పునర్నిర్మాణ క్రమంలో తెలంగాణా సాహిత్య చరిత్ర పరిశోధనలు ప్రస్తుతం ఊపందుకున్నాయి. మలి తెలంగాణా ఉద్యమం నుండే తెలంగాణా సాహిత్య మూలాలపై పరిశోధనలు మొదల య్యాయి. అయినప్పటికినీ తెలంగాణా చరిత్ర, సాహిత్యాలపై అధ్యయనం, పరిశోధనలు విరివిగా వివిధ కోణాల్లో జరగాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా నూరు, నూటాయాభై ఏళ్ళ కాలం నాటి సామాజిక చరిత్ర, అప్పటి సారస్వత వివరాలు ఒక కవి ఆత్మకథ ద్వారా వెల్లడైతున్నదంటే ఆశ్చర్యపోతాం. అలాంటి ఒక ఆత్మకథ పుస్తకం ప్రముఖ పరిశోధక కవి, సీనియర్ రచయిత ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వేముల ప్రభాకర్ సంపాదకత్వంలో ఇటీవల వెలువడింది. జగిత్యాల సమీపంలోని రాఘవపట్నం రామసింహకవి ఆత్మకథ. వీరు ప్రధానంగా పద్యకవులు, నాటకాలు,



శతకాలు, హరికథలు, భజనలు, కీర్తనలు వంటి ప్రక్రియల్లో పుస్తకాలు రాశారు. సహేతుక వాదంతో భారత, రామాయణ, భాగవత కావ్యాలను సమీక్షించారు. ఈ కావ్యాలలోని అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ, సరిచేస్తూ రచనలు చేశారు. వీరికి తెలుగు, ఉర్దూ, హిందీ సంస్కృతం భాషలతో పాటుగా సంగీత పరిజ్ఞానం ఉంది. ఆ కాలంలో పుస్తకాలు రాయడం ఒక ఎత్తయితే, అచ్చొత్తించడం మహా పెద్ద కార్యం. తాను రాసిన పుస్తకాలను అచ్చువొత్తించడానికి కవి రామసింహం రాసుకొన్న సంచార వివరాలను, తన ఇల్లు, తల్లి తండ్రులు, తన ఊరు, తాను తిరిగి కలిసిన ప్రముఖులు, అప్పటి సమాజం తీరును ఈ ఆత్మకథ పుస్తకం 240 పేజీలలో 12 ఆశ్వాశాలతో అచ్చయింది. ఇందులో గద్యంతో పాటు, పద్యాలు, భజన కీర్తనలు చేర్చారు. ఆనాటి తన జీవితంలోని ముఖ్య సంఘటనలను చేర్చారు. అనుబంధ విభాగంగా రామసింహ కవి రామాయణ విమర్శ అనే ఆరుపేజీల వ్యాసం చేర్చబడింది. రామసింహకవి నివసించిన రాఘవపట్నం ఇల్లు, ఆంజనేయస్వామి గుడుల ఫోటోలను, కవి వారసుల ఫోటోలను కవి కుటుంబ ఫోటోలను ముఖ పత్రాలలో సంపాదకులు వేముల ప్రభాకర్ చేర్చారు. ఇలా మరుగున పడిన రామసింహ కవి సాహితీ వైభవాన్ని తన విశేష పాండిత్య గరిమ మరియు అనుభవంతో జోడించి, తెలుగు సాహితీ లోకానికి అందించి సంపాదకులు వేముల ప్రభాకర్ ధన్యజీవులయ్యారు.

రామసింహ కవి సిక్కు జాతీయులు. వీరు 1857-1963 మధ్యకాలంలో సుమారు 106 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా జీవించి, 30కి పైగా రచనలు చేశారు. ఇందులో కొన్ని అముద్రితాలు, పునర్ముద్రితాలు ఉన్నాయి. వీరు జగిత్యాల దగ్గర రాఘవపట్నంలో జీవించారు. వీరి ఆత్మకథ చదివితే సుమారు 150 సంవత్సరాల నాటి సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, పాలనా రంగాలు వివరాలు కొంతవరకైనా ప్రస్ఫుటంగా తెలిసి వస్తాయి. ఒక రకంగా

వ్యాసం

చెప్పాలంటే ఇది ఒక మహనీయ సాహిత్యకారుడి జీవిత గాథ. ఇందులో కవి జీవితంలోని ఎత్తు పల్లాలతో సహా, సామాజిక, సాహిత్య, చారిత్రక రంగాల వివరాలు చర్చకు వస్తుంటాయి. వీరి మునిమనువడైన సర్దార్ గురుదేవ్ సింగ్ ప్రభుత్వ ఉద్యోగం చేసి రిటైర్డ్ హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వీరికి ప్రస్తుతం 76 సంవత్సరములు. వేముల ప్రభాకర్ తన అన్నగారైన ప్రముఖ కవి వేముల పెరుమాళ్ళ ద్వారా కవి రామసింహం పద్య పాండిత్యం గూర్చి విషయాలు తెలుసుకొని, 2017లో రామసింహ కవి ఊరైన రాఘవ పట్టణాన్ని సందర్శించి, అక్కడి ప్రజలతో మాట్లాడి, కవి వివరాలు సేకరించి, హైదరాబాద్‌లో నివాసముంటున్న వారి ముని మనువడి సెల్ నంబర్‌ను తీసుకొని, వారిని ఎట్టకేలకు కలుసుకొన్నారు. తాను దాచి ఉంచిన తమ ముత్తాత గారి కొన్ని ముద్రిత రచనలను, అముద్రిత వ్రాత ప్రతులను మనువడు ఇవ్వడంతో, రామసింహ కవి గారి ఆత్మ కథ ఇలా వెలుగులోకి వచ్చింది. రామసింహకవి గారి అత్మకథ పుస్తకంలో ఒక వ్రాత ప్రతి ఫోటోను ఒకటి శాంపుల్ గా వేశారు. కవి గారు తన దస్తూరీతో తెలుగులో రాసిన వ్రాత ప్రతి భాష, అక్షరాలు మిక్కిలి క్లిష్టంగా ఉన్నాయి. అయినప్పటికీ అట్లాంటి వ్రాత ప్రతుల దస్తూరీని చాలెంజీగా తీసుకొని, పరిశోధించి. అవగాహన చేసుకొని, అర్థం తెలియని పార్సీ పదాలకు అర్థాలు తెలుసుకొని, శ్రమకోర్చి ముద్రిత ప్రతిని ప్రచురణకి సిద్దం చేశారు,

సంపాదకునికి ఈ ప్రతులను సరిచేయడానికి ఒక సంవత్సర కాలం పట్టింది. ఆత్మకథ రాసిన రామసింహ కవి ఒక ఎత్తయితే, ఆ వ్రాత ప్రతులను పరిష్కరించడం మరో ఎత్తయింది. వేముల ప్రభాకర్ పలు గ్రంథాలను రాశారు. గతంలో తన అన్న కీ.శే. వేముల పెరుమాళ్ళు రాసిన తెలంగాణా జాతీయాలు అనే పుస్తకాన్ని తెలంగాణా మలి ఉద్యమ సమయంలో పునర్ముద్రించారు. అంతేకాకుండా తన తాతగారైన వరకవి భూమాగౌడ్ అనే నవలను పరిశోధించి 2017లో వెలుగులోకి తెచ్చారు. అంతకు ముందు తన తాత రాసిన కృతులను “వరకవి కైరం భూమదాస్ కృతులు” అనే పేరుతో 2002లో సుమారు 166 పేజీలలో ముద్రించారు. అలా తన తాతైన వరకవి భూమాగౌడ్‌ను ఒక యోగిగా, ఉద్దండుడైన పద్యకవిగా తెలుగు సాహిత్యంలో సుప్రతిష్టించారు. తన తాత వరకవి భూమాగౌడ్, రామసింహ కవి జీవిత కాలాలు సమకాలీనమైనా, వారి ఒకరి కొకరు తారస పడలేదు. వీరిద్దరు ఒకే ప్రాంతానికి చెందిన వారైనప్పటికినీ వీరి ప్రస్తావనలు ఏ గ్రంథాల్లో కనబడక పోవడం ఒక విచిత్రమే.

రామసింహ కవి సిక్కు జాతీయులు. దక్కన్ తెలంగాణాలో శాంతి భద్రతలను కాపాడటానికి, రెవిన్యూ వసూళ్ళు చేయడానికి అయిదో నిజాం పాలనా కాలంలో సిక్కులు హైదరాబాద్‌కు రప్పించబడ్డారు. మహారాజా రంజిత్ సింగ్ క్రీ.శ. 1832లో దాదాపు 14వేల మంది సిక్కు సైన్యాన్ని పంపించారట. రాజులు, రాజ్యాలు పోయాక వీరు బతుకు తెరువు కోసం తెలంగాణాతో సహా పలు ఇతర ప్రాంతాలలో స్థిరపడ్డారు. అలా జగిత్యాల సమీపంలోని రాఘవ పట్నంలో స్థిర పడిన కుటుంబం నుండి వచ్చిన వారే రామసింహం కవి గారు. వీరు తెలుగు, హిందీ, ఉర్దూ భాషలలో సిద్దహస్తులు. ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం చేసి, పలు రచనలు చేశారు. ఆంధ్రప్రాంతంలోని అవధానులను, పండితులను కూడా తన పద్య పాండిత్యంతో మెప్పించి, ఎన్నో సన్మానాలు పొందారు. తాను రాసిన పుస్తకాలను అచ్చులోకి తేవడానికి ఉత్తర తెలంగాణా జిల్లాలలో పర్యటించి దాతలను కలుసుకొని ఆర్థిక సాయాల్ని పొందారు. కొంతమంది దాతలు విరాళాలుగా ఇచ్చారు, మరికొంత మంది ఇస్తామని చెప్పి, చేయి చూపించారు. మరి కొందరు విముఖతను చూపారు. తాను తిరిగిన ప్రదేశాలను గుళ్ళు, గోపురాలను, దొరల గడీలను తిరిగారు, స్థితిమంతులైన వదాన్యులను కలుసుకొని సాయమర్థించారు. రామసింహం కవి సహేతుక వాదంతో రచనలు ఉన్నప్పటికినీ, ఆయన పలు ఆధ్యాత్మిక రచనలు చేశారు. శతకాలు హరికథలు, నాటకాలు, భజన కీర్తనలను, కమనీయమైన పద్యాలను రాశారు. వీరి జీవిత కాలంలోని నాటి సమాజం, ఆర్థిక పరిస్థితులు, సాహిత్య, సంస్కృతుల పట్ల ప్రజలకున్న ఆదరణలు వంటివి, నైజాం ఉద్యోగులు, కార్యాలయాలు, పాలకుల తీరు, జైళ్ళ నిర్వహణ, ఖైదీల శిక్షల అమలు, నరక యాతనలు, ఆనాటి కాలపు దొరలు, దేశ్ ముఖ్‌లు, జమిందారీల పెత్తనాలు, వివరాలు, పేర్లతో తన ఆత్మకథలో సందర్భానుసారంగా చర్చించారు. రామసింహకవి తాను ఒక క్షణికావేశ నేరానికి లోనై ఒక హత్యా నేరంలో నేరస్తుడిగా ముద్ర పడి జీవిత కాల ఖైదుకు గురవుతారు. అలా 14 ఏళ్ళ పాటు వివిధ ప్రాంతాలలో జైల్ జీవితాన్ని అనుభవించాడు. నిజాం రాజ్యంలోని ఒక బ్రిటన్ పోలీస్ అధికారి దయవల్ల క్షమాభిక్ష పొంది, విడుదలై తదుపరి సామాన్య స్వేచ్ఛా జీవితాన్ని గడిపారు. వీరి పద్యపాండిత్యం, నిజాయితీ తనం వీరి శిక్షను తగ్గించడానికి ఉపయోగపడిన ఘట్టాలను చరమాంకంలో కవి గారు

**రామసింహ కవి సిక్కు జాతీయులు. దక్కన్ తెలంగాణాలో శాంతి భద్రతలను కాపాడటానికి, రెవిన్యూ వసూళ్ళు చేయడానికి అయిదో నిజాం పాలనా కాలంలో సిక్కులు హైదరాబాద్‌కు రప్పించబడ్డారు. మహారాజా రంజిత్ సింగ్ క్రీ.శ. 1832లో దాదాపు 14వేల మంది సిక్కు సైన్యాన్ని పంపించారట.**

రాసుకొన్నారు. వీరి కారాగృహ జీవితం గొప్పది, అందులో కూడా వీరు భక్త రామదాస్ వలె పలు రచనలు చేశారు. కవి సత్ప్రవర్తన, జైలు అకౌంట్లు రాయడం మొదలగు పనులు, నిజాయితీ తనం వల్ల కవి గారు అక్కడి తోటి ఖైదీల మన్ననలకు, జైల్ అధికారుల ఆదరానికి గురయ్యారు. అలా విడుదల సుగమమైంది.

కవి పాండితీ ప్రతిభ గూర్చి ఇహ చెప్పనక్కరనే లేదు. మచ్చలేని సాహిత్య జీవితం వారిది. వీరి పద్యాలు 1934లో సుమారు వీరు 77 ఏండ్ల వయస్సులో ఉన్నపుడు రాసిన విశ్వకర్మ శతకంలోని పద్యాలు నాలుగు గోల్కొండ కవుల సంచికలో కనిపిస్తాయి. అంతేకాక డా. మలయశ్రీ వెలువరించిన వెయ్యేళ్ళ కరీంనగర్ జిల్లా సాహిత్యం అనే పరిశోధక సిద్దాంత గ్రంథంలో రామసింహకవి గూర్చిన పరిచయం రాయబడింది. అట్టి పద్యాలను సైతం ఈ ఆత్మకథ పుస్తకంలో సంపాదకులు సందర్భోచితంగా ప్రచురించడం అభినందించాలి. కవి వంశవృక్షాన్ని కూడా రాశారు. కవి ముని మనువడైన గురుదేవ్ సింగ్ గారి అభిప్రాయాన్ని కృతజ్ఞతలు శీర్షికగా సంపాదకులు రాయించారు. ఆరు దశాబ్దాల నాటి తమ ముత్తాత వ్రాత ప్రతిని పరిష్కరించి, సంపాదకులు ముద్రణాయుక్తంగా వెలుగులోనికి తేవడానికి చేసిన కృషిని అభినందించారు. పుస్తక శిల్పి, ప్రముఖ రచయిత తాళ్ళపల్లి మురళీధర్ గౌడ్ ఈ పుస్తకంపై చక్కటి అభిప్రాయం రాశారు. మరుగున పడిన మాణిక్యాల్లాంటి ఒక విశిష్ట కవిని ఈ తరానికి పరిచయం చేయాలన్ని పట్టుదల గొప్పదని, వేముల ప్రభాకర్ కృషి అభినందనీయమని రాశారు. రామాయణ, మహాభారతం, మహాభాగవతం గ్రంథాలలోని అభూత కల్పనలను తొలగించి, యదార్థంగా వాటిని సవరించి రాసిన రామసింహకవి హేతు వాదపు కృషిని పాయింటవుట్ చేశారు. వీరు నాస్తికులు కాదని తేల్చారు.

రామదాసంతటి భక్తకవిగా పేరొందిన రామసింహకవి ఆనాటి సంఘంలోని మత మౌఢ్యాన్ని, మూఢాచారాలను ఖండించాడు. ఆనాటి పాలకులు, ఉద్యోగుల అవినీతిని, ఆశ్రిత పక్షపాతాన్ని, ఛాందసత్వాన్ని దునుమాడారు. ఈనాటి కాలానికి ఆత్మాభిమానం ఉన్న ఒక అభ్యుదయ సామాజిక కవిగా రామసింహం పోషించిన పాత్ర గొప్పదని శ్లాఘించాడు.

రామసింహం ఆత్మకథను అముద్రిత ప్రతుల నుండి సేకరించి, వాటిని పరిష్కరించి, ముద్రణకు సిద్దం చేస్తే, కవి గారి మునిమనువడైన సర్దార్ గురుదేవ్ సింగ్ ఈ సంవత్సరంలోనే (2023) ప్రచురించారు. ఈ పుస్తక ప్రచురణలో పుస్తక శిల్పి తాళ్ళపల్లి మురళీధర్ గౌడ్, వారి స్నేహితులు వాదూలస కలం నామధేయులైన ప్రముఖ కవివతంసులు తుమ్మూరి రాంమోహనరావు సహకరించారు. పుస్తక ముఖచిత్రం ధైర్య సాహసాలున్న సిక్కు వీరుడిగా బల్లెం, పాగాతో రామసింహకవి కనిపిస్తారు. అంతేకాక రెండవ కవర్ పేజీలో కుటుంబ సభ్యులతో దిగిన ఫోటోలను, వారి వారసుల ఫోటోలని చేర్చారు. ఇందులో




కవి గారి ముని మనువడైన సర్దార్ గురుదేవ్ సింగ్ రామసింహ కవిగారితో ఉన్నఫోటో ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఆ ఫోటోలో గురుదేవ్ సింగ్ యువకుడిగా కనిపిస్తారు. రామసింహం కవి గతించి అరవై సంవత్సరాలు గడిచినప్పటికినీ వారి వ్రాత ప్రతులను, ముద్రిత రచనలను మునిమనువడైన గురుదేవసింగ్ భద్రంగా కాపాడి ఉంచడం ఒక గొప్ప అంశంగా చెప్పవచ్చును. రామసింహకవి గూర్చి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాంతంలో, ఉత్తర తెలంగాణా జిల్లాలలో ఇప్పటికినీ సామాన్య ప్రజలు, సాహిత్య లోకం గొప్పగా కథలు కథలుగా చెప్పుకోవడం విశేషం. కవి గారి మీద ప్రజలకున్న ఆదరాభిమానం వెలలేనిదని నిరూపించడానికే వీరి స్వకీయ ఆత్మకథ రచన అచ్చు రూపంలో వెలికి వచ్చిందని భావించవచ్చును. తెలంగాణా పరిశోధక సాహితీ చైతన్యానికి ఈ ఆత్మకథ ఒక ఆదర్శ గ్రంథంగా నిలిచి పోతుందని చెప్పవచ్చును.

రామసింహం కవి గొప్పతనం, కష్ట సుఖాలు, తన దైన సాహిత్య జీవితం, వ్రాసిన రచనలు, దాతల విరాళాల కోసం చేసిన సంచార విశేషాలు, ఆనాటి అరకొర రోడ్లు, రవాణా సౌకర్యాలు, ఆయా సందర్భాలలో రాసిన పద్యాలు, కీర్తనలు, చేసిన ప్రసంగాలను ఇందులో చర్చించారు. తన పాండిత్యాన్ని పరీక్షించ డానికి వచ్చిన ఉద్దండ పండితులను తాను ఇచ్చిన సమస్యా పూరణాల ద్వారా పూరించకపోవడాన్ని కవి చర్చించటం చూస్తే, రామసింహం కవి కున్న పాండిత్య ప్రకర్ష ఎంతో గొప్పదని రుజువగుచున్నది. నేటికినీ జగిత్యాల ప్రాంతంలో వీరి జీవితం, రచనల గూర్చి ఆధ్యాత్మిక భజన కీర్తనలు, మంగళ హారతుల గూర్చి బహుళ ప్రచారంలో ఉన్నాయి. వీరి భజన కీర్తనలు ఆరు సార్లు ముద్రణకు నోచుకొన్నాయి. ఇక్కడి ప్రజలు వీరి రచనల గూర్చి ప్రస్తావిస్తూ ఉంటారు. పత్రికల్లో అడపాదడపా వీరి పాండితీ ప్రతిభ గూర్చి వార్తలు, వ్యాసాలు విశేషంగా ఫోటోలతో వస్తుంటాయి.

తెలంగాణా రచయితల వేదిక ఒక మారు వీరి గ్రామానికి రచయితల బృందంగా తరలి వెళ్ళి, అక్కడి ప్రజలతో మమైకమై రామసింహ కవి గారి సాహితీ ప్రతిభా పాటవాల గూర్చి ప్రసంగించి, స్మరించుకోవడం విశేషంలో విశేషమే. ప్రముఖ కవి గుర్రం జాషువా అన్నట్లు, రామసింహ కవి ప్రజల నాలుకల్లో, ప్రజల హృదయాల్లో ఒక కవిగా చిరంజీవిగా బతికే ఉన్నారని స్పష్టమవుతుంది.

ఇహ వీరి ఆత్మకథలోకి వెడితే 12 ఆశ్వాశాల్లో రాశారు. రామసింహ కవి జీవితం, సంఘటనలు, సందర్భాను సారంగా చక్కటి శైలిలో రాసిన పద్యాలు, భజన కీర్తనలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. వీరు తాను వెళ్ళిన గ్రామాలను, సంప్రతించిన దాతల పేర్లను, తనను పరీక్షించడానికి వచ్చిన కవుల పేర్లను చాలా వరకు రాయడం సాహిత్య చరిత్ర పరిశోధక కోణంలో పరిశోధించే వారికి ఒక మూల సరుకే కాగలదు. వీరు ఉమ్మడి కరింనగర్ జిల్లాతో పాటు, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాలు, రాజధాని కేంద్రమైన హైదరాబాద్-సికింద్రాబాద్ జంట నగరాలలో పర్యటించిన అంశాలు దాఖలాకు కనిపిస్తాయి. వీరి జైల్ జీవితం ఈ ప్రాంతంలోనే కాకుండా, వరంగల్, గుల్బర్గాలలో సాగినట్లు విదితమవుతుంది. గుల్బర్గా జైల్ లో ఖైదీ గా ఉన్నప్పుడు వచ్చిన గత్తర మహమ్మారి అంటు వ్యాధి గూర్చి భీతితో రాసిన అంశాలు, పద్యాలు హైలెట్ గా ఉన్నాయి.

మొదటి ఆశ్వాసంలో కవి జననం, తల్లి తండ్రుల పేర్లు, బాల్యం, క్రీడలు, విద్యాభ్యాసం, సాహిత్య అధ్యయనం, తుపాకీ తూటాలతో గురి తప్పని పక్షుల వేట, మరియు సాహసంతో తమ గ్రామ సమీపంలో ఒక బెబ్బులిని చంపుట మొదలగు అంశాలపై చర్చించాడు. వీరు ధర్మాంబ, కర్మ సింహం అనే దంపతులకు జన్మించారు. తన జన్మ పత్రిక వివరాలు లభ్యమగుట వలన, తనది కోదండపాణియన్న జన్మనామమని, తాను శ్రీరామనవమి నాడు పుట్టుట వలన రామసింహం అనే పేరు స్థిరపడిందని చెబుకున్నారు. తన అసలు పేరు మోహన సింహం కాగా, రామసింహమే ఖరారు అయిందని చెబుకొచ్చారు. తన తండ్రి ఆయుర్వేద వైద్యులని, తన చిన్ననాట జరిగిన రెండు ప్రాణ గండాలనుండి బయట పడినట్లు చెప్పుకొన్నారు. చిన్ననాటి నుండే తెలుగు, హిందీ, ఉర్దూ భాషలను నేర్చుకొన్నానని, పంతులు సరిగా బడికి రాక పోవడం వలన, నాయన తెచ్చిన గ్రంథాలను చదివి జ్ఞాన సంపదను పెంచుకొన్నానని, 14వ ఏటనే సుమతి పద్యాలను వ్రాయ, చదువ గలిగానని చెప్పుకొచ్చారు. 9వ ఏట గురుముఖి స్వజాతీయ గ్రంథాన్ని నాయన గారి సాయంతో హిందీలో చదివినట్లు, ఉర్దూ రాజ భాష కావడం వల్ల వచ్చిందని చెప్పున్నారు. **(మిగతా వచ్చే సంచికలో)**

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

కథ

# వాయిదా పడ్డ అధ్యక్షుని బిడ్డ పెండ్లి

అస్తవ్యస్తత చెప్తున్న కథ...



కె.పి. లక్ష్మీనరసింహ
90106 45470

దాదాపు వారం రోజుల నుంచి మండలం మొత్తం అధికార పార్టీ నాయకులతో హెూరెత్తుతోంది. పార్టీ ఎలక్షన్ దగ్గర పడుతోంది. పార్టీ పదవుల కోసం ఒక్కొక్కరు ఒక్కో విధంగా ప్రణాళికలు వేసుకుంటున్నరు. ఈసారి అధ్యక్ష పదవికి గట్టి పోటీ ఉంది. మండలంలోని ఐదు పెద్ద గ్రామాల నుంచి ఏడు మంది నాయకులు పోటీకి సిద్ధమయ్యిండ్రు. అందులో నేనంటే నేను అధ్యక్షుడిని అని ఎన్నిక అవ్వకముందే చెప్పుకునేలా ఉన్నరు. ఏడుగురిలో ఒకరు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కొనింటి మాసయ్య. మరొకరు గిరిజన సామాజిక వర్గానికి చెందిన బాల్యా నాయక్. మిగతా వారిలో నలుగురు బిసీ సామాజిక వర్గానికి చెందిన మల్లికార్జున యాదవ్, గోపాల్ గౌడ్, వెంకటయ్య, కరుణాకర్ లు. అయితే మిగిలిన ఒకరు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ప్రభాకర్ రెడ్డి. వీరి మధ్య ఎమ్మెల్యే పదవికి పోటీ పడుతున్నంతగా పోటీ ఉంది. వాళ్ళ పరిచయాలను బట్టి ఒక్కొక్కరు తమకే సపోర్ట్ చేయాలని ప్రచారం చేసుకుంటున్నరు. కనీసం అది జిల్లా స్థాయి పదవి కూడా కాదు.

> **పదవి** ఆశిస్తున్న వాళ్ళు వాళ్ళకు సపోర్ట్‌గా వచ్చిన వాళ్ళు నా పేరే ప్రకటిస్తే బాగుండు, మా నాయకుని పేరే ప్రకటిస్తే బాగుండు అన్నట్టు చూస్తున్నరు. జడ్ పిటిసి, ఎంపిపి, ఇంచార్జ్‌గా వచ్చిన నాయకులు ఆలోచనలో పడ్డరు. వారికి అందరి సామాజిక వర్గాలు తెలుసు.

దాదాపు పోటీకి వచ్చిన వ్యక్తులు అందరూ ప్రజాసేవలో వారే. ఎవరిని వద్దన్నా నొచ్చుకునేలా ఉన్నరు. పార్టీ స్థాపన నుంచి జెండా మోసిన అని చెప్పే వాళ్ళు లేకపోలేరు. అంత మందిలో ఎవరిని ఎన్నిక చెయ్యాలని తర్జనభర్జనలో ఉన్నరు అంత. ఇంకా రెండు రోజులే ఉంది. దగ్గర పడేకొద్ది జనరల్ ఎలక్షన్ వాతావరణం వచ్చేసింది. చూసేవారికి అది పార్టీ పదవి ఎలక్షన్ లా లేదు. అంతకు మించి. ఈ పనినంత జడ్ పిటిసి, ఎంపిపిలకు అప్పజెప్పిండు ఎమ్మెల్యే. ఒక్కొక్కరి తీరు చూస్తుంటే జడ్ పిటిసి, ఎంపిపిలకు తల పీక్కపోతోంది. ఎలక్షన్‌కు ముందురోజు పదవి ఆశిస్తున్న వాళ్ళతో పాటు మండల ముఖ్య నాయకులు, ఇంచార్జ్‌గా పక్క మండల నాయకులూ సమావేశం పెట్టుకున్నరు. అందరూ వచ్చిన వాళ్ళు వచ్చినట్టు వరుసగా కూర్చున్నరు. అందరూ ఒకరి మొఖాలు ఒకరు చూసుకొని నవ్వుకోలేక ఆపుకున్నరు. దానికి కారణం లేకపోలేదు. మెల్లగా జడ్ పిటిసి మైక్ అందుకున్నడు.

పదవి ఆశిస్తున్న వాళ్ళు వాళ్ళకు సపోర్ట్‌గా వచ్చిన వాళ్ళు నా పేరే ప్రకటిస్తే బాగుండు, మా నాయకుని పేరే ప్రకటిస్తే బాగుండు అన్నట్టు చూస్తున్నరు. జడ్ పిటిసి, ఎంపిపి, ఇంచార్జ్‌గా వచ్చిన నాయకులు ఆలోచనలో పడ్డరు. వారికి అందరి సామాజిక వర్గాలు తెలుసు. అందులో ఇద్దరు గాలానికి దొరికిన కొరమట్ట చేపలలెక్క కనిపించిండ్రు. వాళ్ళే ఎస్సీ, గిరిజన సామాజిక వర్గాల నాయకులు. వాళ్ళ గురించి ఇంచార్జ్ గా వచ్చిన వాళ్ళకు చెవిలో చెప్పిండు జడ్ పిటిసి. వాళ్ళు సరే అన్నట్టు తలూపిండ్రు. చాలాసేపటి క్రితం మైక్ పట్టుకున్న జడ్ పిటిసి "అందరికి నమస్కారం" అన్నడు. ఇక మొదలైంది అనుకోని 'నమస్కారం' అని ప్రతి నమస్కారం చేసిండ్రు. "ఎన్నడు లేనంతగా ఈ యేడు పార్టీ పదవికి గట్టిగా పోటీ పడుతున్నరు. అందరూ మనవాళ్ళే. ఎవరిని కాదనలేం.

ఎందుకంటే పార్టీ పుట్టినప్పటి నుండి జెండా మోసినవాళ్ళే. అందుకే కొంచెం పెద్ద మనసు చేసుకొని మీలో మీరే పోటీ తగ్గిస్తే బాగుంటుంది. ఒక పది నిమిషాలు టైం తీస్కోండి" అని మైక్ కింద పెట్టిండు. అందరు గుసగుసలు మొదలుపెట్టిండ్రు. కొందరైతే నాకు పదవి రాకపోతే వేరే పార్టీలోకి జంప్ అవుతా అనే విధంగా ఉన్నరు. మరి కొందరైతే రెడ్డి సామాజిక

వర్గానికి చెందిన వ్యక్తికే పదవి దక్కుతుందని ఫిక్స్ అయిపోయిండ్రు. ఎందుకంటే మండలంలోని రిజర్వు స్థానాలు తప్ప మిగతా అన్నీ పదవుల్లో వాళ్ళే ఉన్నరు. కాని ఇప్పుడు అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న ప్రభాకర్ రెడ్డికి కనీసం బైక్ కూడా లేదు. ఏదైన ఆపదైతే అతడెలా మండలం మొత్తం చూడగలడు అని కూడా ఆలోచిస్తున్నరు. కాని పదవి మాత్రం అతనిదే అన్నట్టు ధీమాగా ఉన్నరు.

చర్చించుకొని ప్రశాంతంగా కూర్చున్నరు. ఇంచార్జ్ గా వచ్చిన వ్యక్తి లేచి "అందరికి నమస్కారం" పెట్టిండు. "మనం సమావేశం పెట్టుకొని చాలసేపయ్యింది. కాని ఇంకా ఎవ్వరు కూడా వెనక్కు తగ్గేటట్టు లేరు. ఇందాక అన్న జడ్ పిటిసి గారు చెప్పినట్టు అందరూ మనోళ్ళే కాని మనకంటూ నాయకుడు ఒకడే ఉండాలి కాబట్టి ఆ ఒక్క నాయకుడిని ఎన్నుకోమని మన ప్రియతమ శాసన సభ్యులు మనకు ఈ బాధ్యత అప్పజెప్పిండ్రు. ఆయన మాటను గౌరవించి మేమంతా ఇక్కడికి వచ్చినం. కాని మీరేమో తగ్గేలా లేరు. ఏం జేద్దాం మీరే జెప్పుండ్రి" అని అందరిని ఉద్దేశించి అన్నడు. అందరూ ఆలోచనలో పడ్డరు. అందులో ఒకతను లేచి "అన్నీ తెలిసిన మీరే గిట్లంటే ఎట్లన్నా. ఏదో ఒక పరిష్కారం మీరే జెప్పాలె" అని చెప్పి కూర్చున్నడు. "సరే మీరన్నట్లే నేనే చెప్తా అది కూడ నా మాట తీసెయ్యం అంటేనే. ఏమంటరు" అన్నడు మల్లోపారి. అందరూ సరే అన్నట్టు చూస్తున్నరు. "మన మిత్రుడు సీనియర్ నాయకుడు కొనింటి మాసయ్యను మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా అనుకున్నం. దానికి మీరంతా సపోర్ట్ చెయ్యాలే" అనేసరికి అందరూ చప్పట్లు కొట్టిండ్రు. మాసయ్యకు షాక్ కొట్టినట్లైంది. కనీసం ఒక్కమాట కూడ చెప్పకుండా ఇట్ల చేసిండ్రు ఏందని. కాని మాసయ్య నోరు తెరువలేడు. వెంబటే బాల్యా నాయక్ పేరు గిరిజన సెల్ అధ్యక్షుడిగా ప్రకటించిండ్రు. మల్లా చప్పట్లు. మాసయ్య పరిస్థితే బాల్యా నాయక్ కు ఎదురైంది. ఆయన కూడా నోరు తెరువలేడు.

అక్కడిక్కడ ఇద్దరు తగ్గిండ్రు. ఇంకా ఐదు మందున్నరు. ఇప్పుడే మొదలైంది అసలు నెత్తినొప్పి. ఆ ఇద్దరినంటే వాళ్ళ వాళ్ళ కులాల సెల్స్ ను అప్పజెప్పిండ్రు. కాని ఈ ఐదు మందిలో నలుగురు బీసీ వర్గానికే చెందిన వారు. రెడ్డి వర్గానికి చెందిన వ్యక్తికి పదవి ఇవ్వకపోతే ఎమ్మెల్యే ఏమంటాడోనని టెన్షన్ మొదలైంది. ఇంతలో జడ్పిటిసికి ఎమ్మెల్యే నుంచి ఫోన్ వచ్చింది. తను మాట్లాడి రెడ్డి వర్గానికి చెందిన పోటీదారుడు ప్రభాకర్ రెడ్డికి ఫోన్ అందించిండు. అతను పక్కకు పోయి మాట్లాడి వచ్చి "పోటీ నుంచి నేను తప్పుకుంటున్న" అని ప్రకటించిండు. సెలెక్షన్ కమిటీ 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నది. మిగతా నలుగురిని ఎట్లైనా ఒప్పించొచ్చు అని వాళ్ళ ఉద్దేశ్యం. ఆ నలుగురిలో ఇద్దరు ఏదైన మీటింగ్ పెడితే కనీసం చాయి తాపే స్థోమతు కూడా లేనోళ్ళు. వాళ్ళను కూడా వాళ్ళ వాళ్ళ కుల సంఘాలకు పెట్టొచ్చు అని చర్చించుకున్నరు.

సూటిగా అట్ల చెప్తే నొచ్చుకుంటారని జడ్ పిటిసి లేచి "ఈ పార్టీ పదవి వల్ల ఎటువంటి ఆదాయం ఉండదు. పని



కథ

పడితే జేబు నుంచి పెట్టుకోవలసిన పరిస్థితి వస్తది. జర్రా సోంచాయించుండ్రి” అని చెప్పి ఆగిండు. మల్లెవరో అవుట్ అనుకున్నరు అక్కడున్నోళ్ళందరు. “అందుకే మేము ఒక నిర్ణయానికి వచ్చినం. మీరు సరే అంటే చెప్తా. ఈడికే పొద్దు బాగైంది. అందరికి ఆకలి షురూ అయినట్లుంది. షుగర్ పేషెంట్లు కూడా ఉన్నరు” అన్నడు జడ్ పిటిసి. ఆకలి అనే మాట చెవ్వులో పడిందో లేదో కొందరు కడుపు జవురుకున్నరు. మల్లా సరే కానియ్యుండ్రి అన్నట్టు చూసిండ్రు. “మన సీనియర్ నాయకులు మొదట్నుంచి పార్టీ జెండా మోసినటువంటి వ్యక్తులు మన వెంకటన్న అదే వెంకటయ్యను సోదరుడు కరుణాకర్ ల ఆర్థిక పరిస్థితి కారణంగా వారిద్దరు నొచ్చుకోకుండా వారి సామాజిక వర్గాలకు మండలాధ్యక్షులుగా ఉంటె బాగుంటుందని మా కమిటీ అభిప్రాయం” అని అనేలోపే అందరూ సరే అన్నట్టు చప్పట్లు కొట్టిండ్రు. వారు ఏమనలేకపోయిండ్రు.

జడ్పిటిసి మొఖంలో కొంచెం కలచ్చింది. మిగిలిన ఇద్దరిలో ఒకరికి అధ్యక్ష పదవి, మరొకరికి ప్రధాన కార్యదర్శి ఇవ్వొచ్చనుకున్నరు. ఇద్దరిలో అధ్యక్షుడు ఎవరని ఉత్సాహం ఎక్కువైంది అక్కడున్న వాళ్ళకు. గోపాల్ గౌడ్ ఇప్పటికే జిల్లా స్థాయిలో గుర్తింపు ఉన్న నాయకుడు. ఆయనకు ఇవ్వకపోతే అంత బాగుండదు అనుకున్నరు కమిటీ సభ్యులు. అదేవిధంగా చేయాలను కున్నరు. ఇంచార్జ్‌గా వచ్చిన వ్యక్తి లేచి “అంతా సవ్యంగా అయిపోయింది. ఇప్పుడు చివరి ఘట్టానికి వచ్చినం. మిత్రులు సీనియర్ నాయకులు గోపాల్ గౌడ్ జిల్లా స్థాయిలో గుర్తింపు ఉన్న నాయకుడు కాబట్టి ఆయననే అధ్యక్షుడిగా ఎన్నుకుంటే బాగుంటుందని నా అభిప్రాయం. అట్లే తమ్ముడు మస్తు భవిష్యత్ ఉన్న యువ నాయకుడు మల్లికార్జున యాదవ్ ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంటే బాగుంటుందని నా మనసుకు అనిపిస్తుంది. మీకూ సమ్మతం అయితే చప్పట్లు కొట్టండి” అని మైక్ కింద పెడుతుంటే చప్పట్లు కొట్టిండ్రు. కూర్చోవడానికి వంగిన మనిషి మళ్ళీ నిలబడి “హమ్మయ్య అంతా సంతోషం. ఈ ఐక్యత ఎప్పుడూ ఇట్లే ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్న. అందరూ కలిసికట్టుగా పార్టీకి సపోర్ట్ చేస్తూ వచ్చే రెండేళ్ళ వరకు ఈ పదవులు ఉంటాయి కాబట్టి ప్రతి ఒక్కరూ పార్టీని బలోపేతం చేసేవిధంగా కృషి చేయాలని ఆశిస్తున్నాను. అలాగే ఇప్పుడు ఎన్నికైన నాయకులు మండలం మొత్తం తమ ఆధీనంలో పెట్టుకొని మన ప్రియతమ శాసన సభ్యులు చెప్పినట్టుగా నడుచుకోవాలి. వారి మనసులో మన ముద్ర ఉండేలా చూసుకోవాలని కోరుకుంటూ నేను సెలవు తీసుకుంటున్న” అని ఇంచార్జ్ పని ముగిసిందని కూర్చున్నడు. అదే రాత్రి మండలాధ్యక్షుడిగా ఎన్నికైన గోపాల్ గౌడ్ బిడ్డ పెండ్లి కోసం దాచుకున్న పైసలతో అందరికీ దావత్ ఇచ్చిండు.

చూస్తున్నంగానే ఆ మీటింగ్ ఈ మీటింగ్ అనుకుంట సంవత్సరంనర దాటింది. గోపాల్ గౌడ్, మల్లికార్జున యాదవ్‌లు మీటింగ్‌లున్న ప్రతిసారి సొంత పైసలు పెట్టి మనుషులను తీస్కపోతుంటే పోటీ నుంచి తప్పుకున్న కాదు పోటీ నుంచి తప్పించిన ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యే వర్గపు వ్యక్తి కావడం వల్ల మండలంలోని పెద్ద పెద్ద కాంట్రాక్టులు పట్టుకొని సంపాదించుకొని కనీసం బైక్ కూడ లేని వ్యక్తి కారు కొన్నడు. ఘనంగా చేయాలనుకున్న గోపాల్ గౌడ్ బిడ్డ పెండ్లి వాయిదాలు పడుతూనే ఉంది.

ఒక రోజు మండలంలోని ముఖ్య నాయకులతో వచ్చే నెల జరగబోయే ముఖ్యమంత్రి బహిరంగ సభ కోసం మీటింగ్ ఏర్పాటు చేసిండు ఎమ్మెల్యే. రెండేండ్ల కిందటి వరకు మీటింగ్ లకు పోయేవాళ్ళను చూసి లిఫ్ట్ అడిగి ఎక్కిపోయే ప్రభాకర్ రెడ్డి సొంత కారులో వచ్చిండు. గతంలో జిల్లా స్థాయిలో పేరు ప్రఖ్యాతులు, కారు ఉన్న గోపాల్ గౌడ్

**జడ్పిటిసి మొఖంలో కొంచెం కలచ్చింది. మిగిలిన ఇద్దరిలో ఒకరికి అధ్యక్ష పదవి, మరొకరికి ప్రధాన కార్యదర్శి ఇవ్వొచ్చనుకున్నరు. ఇద్దరిలో అధ్యక్షుడు ఎవరని ఉత్సాహం ఎక్కువైంది అక్కడున్న వాళ్ళకు. గోపాల్ గౌడ్ ఇప్పటికే జిల్లా స్థాయిలో గుర్తింపు ఉన్న నాయకుడు.**

ఇప్పుడు చిన్న బైక్ తీస్కోని వచ్చిండు. రెండేండ్ల కిందటి వరకు ప్రభాకర్ రెడ్డిని కనీసం పలకరియ్యని వాళ్ళు కూడా ఇప్పుడు చూడగానే లేచి నమస్తే పెడుతుండ్రు. సాయంత్రం వరకు మీటింగ్ నడిసింది. ఎమ్మెల్యే గోపాల్ గౌడ్, మల్లికార్జున యాదవ్‌లకు మరిన్ని బాధ్యతలు అప్పజెప్పిండు. వాళ్ళిద్దరిపైన ప్రభాకర్ రెడ్డిని అబ్జర్వర్‌గా పెట్టిండు. అది వాళ్ళ మనసులను నొప్పించింది.

వాళ్ళ చుట్టూ ఏం జరుగుతుందో గోపాల్ గౌడ్, మల్లికార్జున యాదవ్ లకు అర్థం అవుతోంది. ఇద్దరు రాత్రికి కలుసుకున్నరు. వాళ్ళ గతాన్ని నెమరు వేసుకున్నరు. పార్టీలో ఉంటే బలం ఉంటుందనుకున్నరు కాని ఆదాయం లేని పదవులకు ఉన్నా ఒకటే లేకున్నా ఒకటేనని ఇప్పుడు సమజ్ అయ్యింది. ఆదాయం వచ్చే పదవుల్లో ఆధిపత్య వర్గాల వాళ్ళు ఉండి, ఎటువంటి లాభం లేని పార్టీ పదవులను మాత్రమే మిగతా వర్గాలకు ఇస్తారని ఆలస్యంగా తెలుసుకున్నరు. భవిష్యత్ గురించి ఆలోచనలో పడ్డరు. అధికారంలో ఉన్న వాళ్ళ జనాభా శాతాన్ని, లేనివాళ్ళ జనాభా శాతాన్ని, పదవులను, కాంట్రాక్టులను, ఓటు బ్యాంకును, అన్నింటినీ ఏ సామాజిక వర్గానికి ఎంత శాతం రావాలో వివరంగా రాసి అన్ని గ్రామాల కమిటీలకు పంపి ముఖ్యమంత్రి బహిరంగ సభకు ఒకరోజు ముందే పార్టీకి, వాళ్ళ పదవులకు రాజీనామా చేసిండ్రు.

కవిత

# నిష్ఫలయత్నం



నెల్లుట్ల సునీత, 79894 60657

కాంతుల నవ్వులు పూయించడానికి
నవజాత శిశువునై
నీ గర్భాలయంలో మొగ్గతొడిగి వికసిస్తున్నప్పుడు
నా రాక కోసం నీ ప్రాణ ద్వారాలు  తెరిచి
సువిశాలమైన విశ్వాన్ని
పరిచయం చేయాలని
సామాజిక రక్షణ యజ్ఞానికి
దీక్షా కంకణం కట్టుకున్నావు

నీ విశాల హృదయాన్ని పరిచి
అనురాగపు ప్రమిదలో
నీ ఊపిరినే చమురు చేసి
ఓ చిరు దీపాన్ని వెలిగించాలనుకున్నావు

ఆ ఆనందపు క్షణాలను
కడుపారా కౌగిలించుకోకముందే
అస్తిత్వపు పెనుగులాటలో
నీ ప్రయత్నమంతా
నిష్ఫలయత్నమే అయింది

జలగలై నా కలల్ని పీల్చేశారెవరో
నా తొలి కేకల ప్రణవనాదం
వినని శ్రవణేంద్రియాలు
ఉన్మాదపు రాగాన్ని వింటున్నాయి

మొగ్గనై  విచ్చుకోకముందే
ఓ కసాయి చేయి నన్ను
నిర్దాక్షిణంగా చిదిమేసింది
పువ్వునై  పరిమళించకనే
ఒక అహానికి అవిచ్ఛిన్నంగా
ధ్వంసం అయ్యాను
కాలం కాలసర్పమై కాటు వేసింది
మృత్యువు నా చేయి పట్టుకుని తీసుకెళ్లింది

నా ఊపిరి లేదు, నా ఉనికి లేదు
ఈ ఘోర కలిని చూసి
నీ మనసు మౌనంగా రోదించింది
ఆకాశంలో సగమైన
నీ ఆర్తి ఆవేశపు తరంగాలు
ఏ తీరాన్ని తాకలేదు

నన్ను కోల్పోయిన నీ గర్భాలయం
ఎడారి హృదయమై
నీ కన్నీటిని కసిగా తాగుతూ
దాహార్తి తీర్చుకుంటుంది.



ముఖాముఖి

# బాగా ఫీల్ అయితేనే కవిత్వం రాయాలి - ఎలనాగ

ఈనాటి ప్రభావ కవి ఎలనాగతో ఒద్దిరాజు ప్రవీణ్ ముచ్చట...

**మీరు ఒక సాహితీవేత్తగా పరిణమించడానికి మీ కుటుంబం, బాల్యం ఏ విధంగా సహకరించాయి?**

కుటుంబంలో సాహిత్య వాతావరణం పెద్దగా లేకపోయినా, మా నాన్నగారిలో క్రూడ్ ఫామ్ లో ఉండిన సహజమైన కవిత్వ రచనా నైపుణ్యపు ఛవి నాకు సంక్రమించి ఉండవచ్చు. ఆయన ఆటవెలదులు, తేటగీతులు వంటి కొన్ని పద్యాలు రాసేవారు. వాటిలో పద్యాల తాలూకు లయ ఉండేది కానీ, ఛందస్సు పూర్తిగా కరెక్టుగా ఉండేది కాదు. మంగళహారతులు మాత్రం చక్కగా రాయడమే కాకుండా పండగ రోజుల్లో వాటిని రాగయుక్తంగా, శ్రావ్యంగా పాడేవారు. ఐతే, తెలుగు సాహిత్యాన్ని కొంచెం కూడా చదవలేదు ఆయన. నా అన్నయ్య నాగరాజు రామస్వామి నాకన్న 14 సంవత్సరాలు పెద్ద. ఆయన కొన్ని పత్రికలను, కవితా సంపుటులను ఇంటికి తెచ్చేవాడు. వాటిని నేను చదివేవాడిని. అది సాహిత్యం మీద నాకు ఇష్టాన్ని కలిగించడంలో తోడ్పడింది.

**మీ సృజన పరిణామాన్ని తెలియజేయండి.**

నేను 1953 లో పుట్టాను. హైస్కూల్లో ఉన్నప్పుడే కవితలు రాయటం మొదలు పెట్టాను. నా తొలి కవిత నా 15వ ఏటనో, 16వ యేటనో కౌముది అనే పత్రికలో



అచ్చైంది. అది కరీంనగర్ నుండి వెలువడుతుండేది. నా వయసు 17, 18 సంవత్సరాలకు చేరుకునేసరికి నా రచనలలో కొంత పరిణతి చోటు చేసుకుంది. మరో రెండేళ్ల తర్వాత నా కవితలు పత్రికల్లో అచ్చు కావడం మొదలై, రానురాను మరింతగా పుంజుకోసాగాయి. కృష్ణా పత్రిక, స్రవంతి, తరుణ, పొలికేక, ప్రగతి మొదలైన పత్రికల్లో అవి ప్రచురితమయ్యాయి. 1972 లో మెడిసిన్ కోర్సులో చేరాను. ఆ ఐదారు సంవత్సరాల కాలంలో పత్రికల్లో అచ్చయ్యే కవితల సంఖ్య మరింతగా పెరగడమే కాకుండా వ్యాసాలు రాయడం, కవిసమ్మేళనాల్లో పాల్గొనడం మొదలు పెట్టాను. ఆ విధంగా 1975 లో ఆలిండియా రేడియో వారి కవిసమ్మేళనంలో పాల్గొన్నాను. ఒక్క శ్రీశ్రీ తప్ప దాశరథి, శేషేంద్ర, సినారె, వంటి ఆనాటి ప్రముఖ కవులందరూ దానిలో పాల్గొన్నారు. 1976 లో నా మొట్టమొదటి వ్యాసం భారతి పత్రికలో ప్రచురితమైంది. దాని శీర్షిక "భాషా, ప్రాసా, సామాజిక ప్రయోజనమూ - కవిత్వంలో." ఇక ఆ తర్వాత నా రచనలు మరింత విరివిగా అచ్చయ్యాయి. మెడిసిన్ పూర్తై 1980 లో నైజీరియాకు పోయి, ఆరేళ్లపాటు అక్కడ ఉద్యోగం చేశాను. అప్పుడు ఆంగ్లసాహిత్యాన్ని బాగా చదవడం వల్ల ఆ భాషమీద పట్టు దొరకడమే కాకుండా, అనువాదాలు చేయగలిగే సామర్థ్యం చేకూరింది. ఆపైన తెలుగునుండి ఆంగ్లంలోకి తర్జుమాలు చేయగలడంలో పట్టు మరింతగా పెరిగి, తర్వాత ఇంగ్లిష్ లో స్వతంత్ర రచనలు చేయగలిగే స్థాయికి చేరుకున్నాను.

**మీ విద్యార్థి జీవితంలో మిమ్మలను ప్రభావితం చేసిన సాహిత్య అనుభవాలు ఏమైనా ఉన్నాయా?**

ఉన్నాయి. హైస్కూల్లో ఉన్నప్పుడు నాకు తెలుగుభాషను బోధించిన ఉపాధ్యాయుల ప్రభావం నామీద బాగా పడింది. అది ఎంతగా అంటే, ఛందోబద్ధ పద్యాలు రాసేంతగా. ఆ రోజుల్లో విజయవాడ రేడియోకేంద్రంలో సమస్యా

పూరణం అనే కార్యక్రమం వచ్చేది. ఇప్పుడు కూడా వస్తున్నదనుకుంటాను. నేను పదవ తరగతిలోనో, పదకొండవ తరగతిలోనో ఉన్నప్పుడు ఒక సమస్యను పూరిస్తూ రాసిన ఒక శార్దూల పద్యం రేడియోలో చదవబడింది.

నేను పదవ తరగతిలో ఉన్నప్పుడు మా తెలుగు అధ్యాపకులైన రాజశర్మ గారు షాణ్మాసిక పరీక్షలో శ్రీనాథుని మీద వ్యాసం రాయమని ప్రశ్న ఇచ్చారు. నేను మా పాఠంలోని టెక్స్ట్ లోంచే కొన్ని పేరాలను తీసుకుని ప్రతి వాక్యాన్ని సాంద్రమైన భాషతో, ప్రౌఢమైన సమాసాలతో నింపి, వ్యాసం రాశాను. అప్పుడు వారు నన్ను విపరీతంగా మెచ్చుకున్నారు. 8, 9, 10, 11 తరగతుల ఎ, బి సెక్షన్లలో దాన్ని చదివి విద్యార్థు లందరికీ వినిపించారు. వ్యాస రచన పోటీలలో తరచుగా పాల్గొనేవాణ్ని. చాలా బహుమతులు గెల్చుకున్నాను కూడా.

1970 ప్రాంతంలో వేములవాడలో ఒక కవిసమ్మేళనం జరిగింది. దానికి సినారె గారు అధ్యక్షులు. అందులో నేను పాల్గొన్నాను. కవిత చదివే అవకాశం నాకు చివరలో రావడం, కవితను చదివేందుకు తక్కువ సమయం తీసుకోవాలని అధ్యక్షులు చెప్పడం వలన నేను గబగబా చదివాను నా కవితను. దాని శీర్షిక తారా విలాసం. ఆ కవిత ప్రౌఢమైన భాషతో, సమాసాలతో నిండివుండింది. ఆఖరున సినారె గారు ఇలా అన్నారు: "ఈ అబ్బాయి ఈ కవితను అద్భుతంగా రాశాడు. ఒకవేళ దీన్ని నేనే గనుక చదివి ఉంటే ఈ హాలు చప్పట్లతో దద్దరిల్లిపోయేది." తర్వాత 1975 లో జరిగిన ఆకాశవాణి వారి కవిసమ్మేళనంలో కవితను చదివినప్పుడు దాశరథి సీనియర్ గారు నా దగ్గరికి వచ్చి భుజం మీద చేయి వేసి, "బాబూ, చాలా బాగా రాశావు. ఇట్లానే రాస్తూ పో." అని అభినందించడం నాకొక మధురమైన జ్ఞాపకం.

**మీ పేరు నాగరాజు కదా. ఎలనాగ కలం పేరు మీరు వాడడానికి ప్రత్యేకమైన కారణం ఏదైనా ఉందా?**

నా అసలు పేరు సురేంద్ర. మా ఊరిపేరు 'ఎల'గందుల. 'నాగ'రాజు అన్నది మా ఇంటిపేరు. అది కరీంనగర్ పట్టణానికి 9 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

**కవిగా, కథా రచయితగా, విమర్శకులుగా మీరు ప్రసిద్ధులు. మిగతా వాళ్లలో లేని మరో ప్రత్యేకత అనువాదాలు. ఈ ప్రక్రియ మీరు చేపట్టడానికి కారణం ఏమిటి?**




చిన్నప్పుడే మొత్తంగా సాహిత్యం మీద ఇష్టం, ఆసక్తి ఏర్పడ్డాయి. హైస్కూల్లో ఉన్నప్పుడే సోమర్సెట్ మామ్ కథనొకదాన్ని అనువదించాను. ఐతే, అది పరిపూర్ణంగా లేకుండిందనేది వాస్తవం. లెక్కల్లో తప్ప అన్ని సబ్జెక్టుల్లో దాదాపు ప్రతిసారి ఫస్ట్ ర్యాంక్ నాకే వచ్చేది

**దక్షిణ భారత భాషలన్నిటిలో అత్యంత మధురమైనది అనే ఖ్యాతినార్జించింది మన తెలుగు భాష. ఇటీవలికాలంలో అమెరికాలో అత్యంత వేగంగా పెరుగుతున్న భాషగా కూడా తెలుగుకు ప్రతిష్ఠ దక్కింది. ఐనా ఇతర దక్షిణభారత భాషలతో పోల్చి చూస్తే తెలుగు రచనలు చాలా తక్కువగా వేరే భాషలలోకి పోతుండటం ఎంతో శోచనీయం.**

ఇంగ్లిష్ సహా. ఈ అంశం నాకు కొంత ఆత్మవిశ్వాసాన్నిచ్చింది. తర్వాత అనువాదాలు అరుదుగా చేశాను. అవి విపుల లాంటి పత్రికల్లో వచ్చాయి. కానీ, నైజీరియాలో ఉన్నప్పుడు ఆంగ్లసాహిత్యాన్ని బాగా అధ్యయనం చేయడం వలన అనువాదాలు చేయడం మళ్లీ మొదలు పెట్టి, అందులో వేగాన్ని పెంచాను.

**వర్తమాన సాహిత్యంలో అనువాదాల పరిస్థితి ఎలా ఉంది?**

దక్షిణభారత భాషలన్నిటిలో అత్యంత మధురమైనది అనే ఖ్యాతినార్జించింది మన తెలుగు భాష. ఇటీవలికాలంలో అమెరికాలో అత్యంత వేగంగా పెరుగుతున్న భాషగా కూడా తెలుగుకు ప్రతిష్ఠ దక్కింది. ఐనా ఇతర దక్షిణభారత భాషలతో పోల్చి చూస్తే తెలుగు రచనలు చాలా తక్కువగా వేరే భాషలలోకి పోతుండటం ఎంతో శోచనీయం. దీనికి కారణం మనలో తెలుగునుండి ఇతర భాషలలోకి (ముఖ్యంగా ఆంగ్లభాషలోకి) తర్జుమా చేసే అనువాదకుల సంఖ్య చాలా తక్కువగా ఉండటమే. ఈ సంఖ్యను అమాంతంగా పెంచడం సులభంగా సాధ్యమయ్యే పని కాదు. కారణం, అనువాదాలు చేయడం చాలా కష్టంతో కూడుకున్న పని. అనువాదకునికి మూలభాష, లక్ష్యభాష ... రెండింటి మీద సమానమైన అధికారం, పట్టు ఉండాలి.








స్వతంత్ర రచనలు చేసేటప్పుడు స్వేచ్ఛ ఉంటుంది కాని, అనువాదం చేసేటప్పుడు ఉండదు. రాష్ట్రస్థాయిలో అనువాదాలకు అవార్డులిచ్చే సాహిత్య సంస్థలు మనకు ఎన్ని ఉన్నాయి చెప్పండి? స్థానికంగా కానీ జాతీయ స్థాయిలో గానీ, అనువాద ప్రక్రియ చిన్నచూపునకు గురౌతోంది. అనువాదాలకిచ్చే బహుమతి మొత్తాన్ని చూస్తే ఈ విషయం స్పష్టమౌతుంది.

**అనువాదాల ఆవశ్యకత వివరించండి.**

అనువాదాల వలన మన ప్రాంతపు సాహిత్యం, సంస్కృతి ఇతర ప్రాంతాలకు, ఇతర ప్రాంతాల సాహిత్యం, సంస్కృతి మనకు చేరుతాయి. ఇరుప్రాంతాలలోని రచనా పద్ధతులలో విస్తృతి, నైపుణ్యంలో గుణాత్మక మెరుగుదల (qualitative improvement) చోటు చేసుకుంటాయి. మనం ప్రపంచానికి పరిచయం కావటంవల్ల మన ప్రాంతపు ఖ్యాతి కూడా పెరుగుతుంది కాబట్టి, అనువాదాలు చాలా అవసరం. ఇతర దక్షిణభారత భాషలతో పోల్చి చూస్తే తెలుగు రచనలు చాలా తక్కువగా వేరే భాషలలోకి వెళ్తుండటం ఎంతో నిరాశను కలిగించే విషయం.

**ఇటీవల మీ ఆంగ్ల కవితా సంపుటి, Dazzlers ఒకే సమయంలో పలు అంతర్జాతీయ భాషలలోకి అనువాదం అయ్యింది కదా? అప్పుడు మీరు ఎలాంటి అనుభూతికి లోనయ్యారు? ఒక్క సారి ఆ విషయాలు చెప్పండి సార్.**

చాలా సంతోషం కలిగిన మాట వాస్తవం. ప్రత్యేక కారణమేమంటే, Dazzlersను రచించినందుకు నాకు ఉకియోటో వారి Poet of the Year - 2023 అవార్డు కూడా వచ్చింది. ఇక ఆ పుస్తకం 7 విదేశీ భాషలలోకి (టర్కిష్, ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, చైనీస్, రష్యన్, జపనీస్) అనువదింపబడటం కూడా చాలా ఆనందాన్నిచ్చే విషయం కదా?

**Memorable Melody Makers and other Poems on Music పుస్తకం ప్రత్యేకత ఏమిటి?**

అందులో శాస్త్రీయ సంగీతం మీద నేను రాసిన 28 ఆంగ్లకవితలున్నాయి. వీటికి అదనంగా ముప్పై ముగ్గురు సంగీత కళాకారుల మీద ఆంగ్లంలో రాసిన వ్యాసాలు, కవితలు చోటు చేసుకున్నాయి. ఉస్తాద్ బడే గులామలీ ఖాన్ మొదలుకొని మాండొలిన్ శ్రీనివాస్ వరకు చాలా మందిని స్పృశించాను.

**సంగీతాన్ని ఎంతో ప్రేమించే మీకు ఏ సంగీత ప్రక్రియలోనైనా ప్రవేశం ఉన్నదా?**

> **అనువాదాల వలన మన ప్రాంతపు సాహిత్యం, సంస్కృతి ఇతర ప్రాంతాలకు, ఇతర ప్రాంతాల సాహిత్యం, సంస్కృతి మనకు చేరుతుంది. ఇరుప్రాంతాలలోని రచనా పద్ధతులలో విస్తృతి, నైపుణ్యంలో గుణాత్మక మెరుగుదల చోటు చేసుకుంటుంది. మనం ప్రపంచానికి పరిచయం కావటంవల్ల మన ప్రాంతపు ఖ్యాతి కూడా పెరుగుతుంది కాబట్టి, అనువాదాలు చాలా అవసరం.**

శాస్త్రీయ సంగీతంలో లేదు. ఐతే, స్కూల్లో ఉన్నప్పుడు సినిమా పాటలు పాడినందుకు నాకు ఎన్నో బహుమతులు వచ్చాయి. నేను శాస్త్రీయ సంగీత అభిజ్ఞుడిని (connoisseur of classical musicను) మాత్రమే.

**కాళోజీ అంటే కవిత్వం. అలాంటి కాళోజీ రాసిన కవిత్వాన్ని కాకుండా కథలను ఇంగ్లిష్ లోకి అనువాదం చేయాలనే ఆలోచన మీకు ఎలా వచ్చింది?**

కాళోజీ కథలకు నేను చేసిన అనువాదం, Short Stories of Kaloji Narayana Rao వెలువడింది 2020లో. తర్వాత 2022లో, కాళోజీ 'నా గొడవ'కు నా అనువాదమైన My Lament వచ్చింది.

**తెలంగాణ ఉద్యమం గాని ఇతర సాహిత్య ఉద్యమాలు గాని మీకు ఏ రకమైన ప్రేరణ కలిగించాయి?**

ఏ ఉద్యమమైనా (అది రాజకీయ మైనది కావచ్చు, లేదా సాహిత్యపరమైనది కావచ్చు) అందరిలోలాగే కవులలో కూడా చైతన్యాన్ని రేకెత్తిస్తుంది. ఉద్యమాల సమయంలో పుట్టే కవిత్వం సాంద్రంగా, బలంగా ఉంటుంది. ఉదాహరణకు దాదాపు నలభై సంవత్సరాల కింద పుట్టిన స్త్రీవాద ఉద్యమం చాలా మంచి కవిత్వానికి జన్మనిచ్చింది. అప్పుడు నేను దాన్ని బాగా ఇష్టపడ్డాను, ప్రేరణను పొందాను. అదేవిధంగా దళితవాద ఉద్యమం, తెలంగాణ ఉద్యమం కూడా మంచి కవిత్వాన్ని ప్రసాదించాయి.

**మీ రచనల్లో మీకు బాగా నచ్చిన రచన**

ఏది? ఎందుకు?

దీనికి జవాబు చెప్పడం చాలా కష్టం. నచ్చింది ఒకటే ఉండదు. ఇతర కళాకారుల విషయంలో కూడా ఇది వాస్తవం అనుకుంటాను. పైగా నేను వివిధ ప్రక్రియలలో వివిధ రకాలుగా రాశాను కాబట్టి, ఒక్కొక్కదాంట్లో కనీసం ఒకటి ఇష్టమైనది ఉంటుంది. కవిత్వంలో వాగంకురాలు, సజల నయనాల కోసం, ఉగ్రాత ప్రయోగ పద్యాలలో మోర్నింగ్ మీద మాల్కౌస్ రాగం విమర్శలో పళ్లెరం అనువాదాల్లో గాలిబ్ - నాటి కాలం, ఉత్తమ లాటిన్ అమెరికన్ కథలు, దాశరథి కథల ఆంగ్లానువాదం ఇవన్నీ ఇష్టమైనవే. గాలిబ్ మీది అనువాద గ్రంథం మీద నాకు ప్రత్యేకమైన మమకారం ఎందుకంటే, దాన్ని అందరూ సులభంగా అనువదించలేరు. ఒకవేళ అనువదించినా ఆ అనువాదం శ్రేష్ఠమైనదిగా ఉండే అవకాశం తక్కువ. దాన్లోని మొదటి అధ్యాయమైతే ఎంతో జటిలమైన ఆంగ్లవచనాన్ని కలిగివుంది. ఐనా బాగా శ్రమించి అనువదించాను. అది నాకు సంతృప్తిని కలిగించింది.

**సాహిత్యంలో మీరు పొందిన పురస్కారాలు మరియు ఇతర విజయాలను వివరించగలరా? అది మా పాఠకులకు స్ఫూర్తిదాయకమని అడుగుతున్నాం.**

**కవిత్వంలో**

**వాగంకురాలు, సజల నయనాల కోసం, ప్రయోగ పద్యాలలో మోర్నింగ్ మీద మాల్కౌస్ రాగం, విమర్శలో పళ్లెరం, అనువాదాల్లో గాలిబ్ - నాటి కాలం, ఉత్తమ లాటిన్ అమెరికన్ కథలు, దాశరథి కథల ఆంగ్లానువాదం... ఇవన్నీ ఇష్టమైనవే. గాలిబ్ మీది అనువాద గ్రంథం మీద నాకు ప్రత్యేకమైన మమకారం ఎందుకంటే, దాన్ని అందరూ సులభంగా అనువదించలేరు.**




దీనికి జవాబు నిరాశాజనకంగా ఉంటుందని మీకూ తెలుసు. నాకు సినారె అవార్డు, కాళోజీ అవార్డు, దాశరథి అవార్డు, సాహిత్య అకాడమీ అవార్డు, ప్రైవేటు సాహిత్య సంస్థలిచ్చే అవార్డులు వీటిలో ఏదీ రాలేదు. తెలంగాణ వారిచ్చిందల్లా తెలుగు విశ్వవిద్యాలయం వారి కీర్తి పురస్కారమొక్కటే. నిజానికి ఆంధ్ర ప్రాంతంవాళ్లే ఎక్కువ పురస్కారాలిచ్చారు నాకు! సోమసుందర్ పురస్కారం, (ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణగారిచ్చిన) జింకా నాగరాజు అనువాద పురస్కారం, అద్దేపల్లి అవార్డు, గిడుగు పురస్కారం మొదలైనవి వచ్చాయి.

**ప్రస్తుతం మీరు ఏం రాస్తున్నారు?**

ఇంగ్లిష్‌లో చిన్నచిన్న పారాగ్రాఫు కవితలతో ఒక పుస్తకం రాసే పనిలో నిమగ్నమై ఉన్నాను. ఇకమీదట తెలుగులో రాయటం చాలా వరకు తగ్గించి, ఇంగ్లిష్ లోనే రాయాలని నిశ్చయించుకున్నాను. తెలుగులో రాస్తే నాలాంటి వారికి మంచి 'ఫలితాలు' రావనే వాస్తవం మీ అందరికీ తెలుసు! ఇంగ్లిష్ లో నా రెండవ స్వతంత్ర రచనకే రాష్ట్రస్థాయిని మించిన అవార్డు వచ్చింది. తెలుగులో 16 స్వతంత్ర రచనలు చేశాను. ఆంగ్లంనుండి తెలుగులోకి 10 అనువాదాలు చేశాను. ఐనా ఫలితం సున్న. రాష్ట్రేతర సాహిత్యసంస్థల అవార్డుల ఎంపికలో చాలా వరకు మానవ సంబంధాల పాత్ర జీరో అనే విషయం ఈ ఉకియోటో పురస్కారం ద్వారా అవగతమైంది నాకు.

ఐతే, లోపల్నుంచి బలంగా తన్నుకు వచ్చినప్పుడు మాత్రం తెలుగులో రాస్తాను. డైరెక్టుగా ఆంగ్లంలో రాసిన రచనలలోంచి కొన్నింటిని తెలుగులోకి అనువదించుకునే ప్రయత్నం చేస్తాను. కాని, ఆంగ్లంలోని మూల రచనలకన్న తెలుగు అనువాదాలే ముందు అచ్చు కావచ్చు. ఇంగ్లిష్ రచనలకు మంచి ప్రచురణకర్తలు తొందరగా దొరకకపోవడమే అందుకు కారణం.

**ఇప్పుడు సోషల్ మీడియాలో వస్తున్న కవిత్వంపై మీ అభిప్రాయం ఏమిటి?**

సోషల్ మీడియాలో కొందరు యువకవులు చాలా మంచి కవిత్వం రాస్తున్నారు. ఐతే వారి సంఖ్య వేళ్లమీద లెక్క పెట్టగలిగినంత మాత్రమే. ఫేస్ బుక్ ను శాశ్వతంగా వదిలిపెట్టబుద్ధి కాకపోవడానికి కారణం ఆ కొద్దిమంది పోస్ట్ చేసే కవిత్వాన్ని తప్పక చదవాలనిపించడమే.

**ఈనాడు కొత్తగా రాస్తున్న యువతరానికి మీరిచ్చే సందేశంగానీ, సలహా గాని ఏమిటి?**

మనసు పెట్టి, శ్రద్ధతో బాగా కృషి చేయడం ముఖ్యం. అధ్యయనం కూడా చాలా అవసరం. వస్తువులో, శిల్పంలో, భాషలో విశిష్టత (distinction), తాజాదనం (freshness), వైవిధ్యం (diversity) కోసం ప్రయత్నించాలి. బాగా ఫీలైతేనే కవిత్వం రాయాలి.

ఇంటర్వ్యూ :
**ఒద్దిరాజు ప్రవీణ్**
సెల్ : 9849082693



వ్యాసం

# ప్రబంధాలలో నాటి కూరగాయలు....

**కవిత్వంలో నాటి సంస్కృతి**



జి.బి. విశ్వనాథ
94412 45857

శ్రీ కృష్ణదేవరాయల కొండవీటి శాసనంలో పేర్కొన్న కూరగాయల ఆశ్చర్యం కలుగుతుంది.

జామ మిరప ముల్లంగి వేరుశెనగ, పొగాకు, టీ, కాఫీ, నల్లమందు (ఒపియం), గెనుసుగడ్డ (చిలకడదుంప), ఉల్లి (ఎర్రగడ్డ), వెల్లుల్లి (తెల్లగడ్డ), బెండ, యాపిల్,జీడిపప్పు, అనాస (పైనాపిల్), అవకాడో, రాజ్మా, బీన్స్, క్యారట్, కాలిఫ్లవర్, గోబి, పామాయిల్, కాప్సికమ్, సొరకాయ, పుచ్చకాయ, మొదలైన కాయలు పండ్లు కూరగాయలు మనవి కాదంటే అసలు నమ్మబుద్ధి కావడం లేదు కదా!

నమ్మాలి. ఇందులో చాలావరకు కాయలుపండ్లు పోర్చుగీసు వారి రాకతో భారతదేశంలో పంటలుగా మారాయి. ఉదా॥ మిరప, పొగాకు, బొప్పాయి, వేరుశెనగ, అనాస, బంగాళాదుంప మొదలైనవి. మరికొన్నింటిని బ్రిటన్, ఫ్రెంచి, డచ్ మొదలైన దేశాల వర్తకులు మనదేశంలో ప్రవేశపెట్టారు. కొన్ని విదేశీయుల రాకతో మనవిగా మారగా మరికొన్ని జీవనానికి మనిషి వలసవెళ్ళినపుడు తనతో పట్టుకుపోవడం జరిగింది. ఉదా॥ అన్ని రకాల సొరకాయలకు జన్మస్థానం ఆఫ్రికా కాగా, అవి కొన్ని వేలసంవత్సరాల కిందటనే భారతదేశంలో ప్రవేశించాయి.

అంతకుముందు మనదేశంలో దొరికేపండ్లు కూరగాయలతోనే మనవారు వంటలలో వాడి తినేవారు. ఒకసందేహం కలగవచ్చు, పోర్చుగీసువారు మిరప కాయలను ప్రవేశపెట్టారు కదా! అంతకుముందు మనవారు కారం లేకుండానే అన్నాన్ని తినేవారా అంటే అలా తినేవారు కాదు. కారానికి ఆరోగ్యానికి రారాజు మిరియాలు. ఆ మిరియాలను కారంకొరకు ఉపయోగించేవారు.

మనదేశంలోనున్న కాయలు పండ్లు కూరగాయలు ఆకుకూరలేమిటో చూద్దాం.

మిరియాలు, ఏలకులు, లవంగాలు, పసుపు, ఆవాలు(సాసువులు) జీలకర్ర, దోస, వంకాయ, గుమ్మడి, ద్రాక్ష, చెరకు, దానిమ్మ, దోస, కొబ్బరి, అల్లం, శొంఠి, కంద, గురుగు, చెంచలి, పాలవాకు, గాదిరాకు, దిరిశాకు, అవిస, చింతాకు, పెసలు, అలసందలు (బొబ్బర్లు), ఉలవలు, బియ్యం, గోధుమలు, బార్లీ, సజ్జ, కొర్ర, సాములు, అనప( సొరకాయ కాదు, ఇదో పప్పుధాన్యం), కాకర, చింతపండు మామిడి మొదలైనవి.

మనపూర్వీకులు వుపయోగించిన కొన్నింటి కాయలను మనము పూర్తిగా వదిలేశాము. ఏవి మనవో మనవికాదో తెలుసుకోలేనంతగా కొన్ని మన ఆహార సంస్కృతిలో కలిసిపోయాయి.

క్రీడాభిరామమనే గ్రంథాన్ని వినుకొండ వల్లభరాయుడు వ్రాశాడని కాదు శ్రీనాథుడు వ్రాశాడని కొందరి వాదం. ఎవరు వ్రాస్తేనేమి అందులో మంచినశర్మ టిట్టిభసెట్టి అనేవారు ఇద్దరు మంచిమిత్రులు. ఓరుగల్లు నగరాన్ని చూడటానికి వెళ్ళి, నగర అందాలను అస్వాదించి పూటకూళ్ళ ఇంటిలో ఒకరూకకే తాము మృష్టాన్న భోజనాన్ని ఏయే పదార్థాలతో తిన్నది సవివరంగా వివరించారు.

ఇక పల్లెటూరి భోజనం ఎలావుంటుంది అందులో ఏయే ఆకుకూరలు వాడారోనన్న సంగతిని శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యద కావ్యంలో "గురుగున్ జెంచలి లేత దిరిశాకు....." అనే పద్యంలో చక్కగా వివరించాడు.

> **ఇందులో చాలావరకు కాయలుపండ్లు పోర్చుగీసు వారి రాకతో భారతదేశంలో పంటలుగా మారాయి. ఉదా॥ మిరప, పొగాకు, బొప్పాయి, వేరుశెనగ, అనాస, బంగాళాదుంప మొదలైనవి. మరికొన్నింటిని బ్రిటన్, ఫ్రెంచి, డచ్ మొదలైన దేశాల వర్తకులు మనదేశంలో ప్రవేశపెట్టారు. కొన్ని విదేశీయుల రాకతో మనవిగా మారగా మరికొన్ని జీవనానికి మనిషి వలసవెళ్ళినపుడు తనతో పట్టుకుపోవడం జరిగింది.**

వ్యాసం

శ్రీకృష్ణదేవరాయుడంటే గుర్తుకు వచ్చింది.

**2-5-1520** నాడు శ్రీకృష్ణదేవరాయల పాలనాకాలంలో సాళువతిమ్మరుసు (అప్పాజీ) మేనల్లుడు కొండవీడు పాలకుడిగా వున్నపుడు అక్కడి, యజ్ఞవాటికా రఘునాథదేవాలయానికి శిఖరం కట్టించి, దేవాలయానికి సున్నం కొట్టించి, చుట్టూ ప్రాకారాలు కట్టించి, రాజగోపురంపై బంగారు కలశాలు ఎత్తించి, నిత్యనైవేద్యాలకు దూపదీప అమృతపడులకు దానాలు చేసి, నిత్యం దేవాలయంలో పూజలు నిర్విఘ్నంగా జరగటానికిగాను మైదవోలు, వేంపల్లె (కడపజిల్లాలోనివి) దానంగా ఇచ్చి,

ఇంకా నాడు కొండవీటి సంతలకు (మార్కెట్లకు) వచ్చే మామిడికాయలు, ఉసిరికలు, వంకాయలు, మినుములు, శనగలు, గోధుమలు, ఉలవలు, కందులు, రాగులు, నువ్వులు, ఆముదాలు, అనుములు, పత్తి, చింతపండు, కరక్కాయలు, ఉసిరికెపప్పు, కంద, చామ, చిరుగడం, ఉల్లి, పసుపు, గుగ్గిలం, మెంతి, జీలకర్ర, అల్లం, నిమ్మ, టెంకాయలు, బెల్లం, నేయి, ఇప్పపూవు, శొంఠి, ఉక్కుతో చేసిన ఉలులు, ఇనుము, సీసం, తగరం, రాగి, పంచధార, నూలు, తమలపాకులు, గందం, పిప్పలి, కరాంభువు, జాజికాయ, జాపత్రి మొదలైన వాటిపై స్వల్పసుంకాలు విధించి గుడి నిర్వహణకు చెందాలని పేర్కొన్నాడు.

ఉల్లి వెల్లుల్లి చీనాదేశంనుండి దాదాపు రెండువేల సంవత్సరాల కిందట భారతానికి వచ్చాయి. ఉల్లివెల్లుల్లి కామక్రోధాలను ప్రేరేపించే విదేశీదినుసులు కనుక గుప్తులకాలంలో అగ్రవర్ణాలు తినేవారు కాదని చైనా యాత్రికుడైన ఫాహియాన్ పేర్కొన్నాడు.

కవిత

# ఒకే మానవుడు...

**అన్వేషి**



ఒకే మానవుడు
అవును ఒకే ఒక మానవుడు
అగడ్తలనడకలో అవరోధాలు
పర్వతాలు
భూ గృహాలు
నడక తప్పదు
పడిపోక తప్పదు
ఎవరెన్ని చెప్పినా
మనిషికి ఒకే జీవితం
ఒకే ప్రయాణం
మరెందుకు కత్తులు దూసుకోవడం
కప్పుకున్న

కారు నలుపుతో
వెలుగు రేఖల్ని చూడకపోవడం,
వికసించిన ప్రపంచ పద్మం మీద వాక్యమై జీవించు
ప్రవహించే జీవితం నది మీద వసంతమై మాట్లాడు
మతం పూయించిన రక్త పుష్పాలు
శిశిరం చిత్రం కింద వాడి పోనీ
ఖడ్గం అంచులో కరుణగా నిలబడు

తుపాకి గుండె నుంచి జీవామృతాన్ని చిందించు
సుఖం, దుఃఖం, అవమానం, గౌరవం,
విజయం, ఓటమి అందరికీ ఒకటే

ప్రపంచం తెరమీద అందరూ నటులే
అభినయించు, అనుభవించు
తెరచుకున్న కిటికీల నుండి
గుండె దీపం వెలుగు ప్రసరించు
మతం అనే చీకటి గుహ నుంచి వెలుగు
కిరణానివై శిరసెత్తు
ఇక ఒకే మానవుడు
సర్వత్ర ఒక మానవుడు

వ్యాసం

# 'మెర'గేసి నిలిచిన రాజ్‌కుమార్ విమర్శ

విమర్శలో లోతైన కోణాలు...



డా॥ సంగిశెట్టి శ్రీనివాస్
98492 20321

ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడైనా, ఏదైనా ప్రజా ఉద్యమం ఊపందుకుందంటే ముందుగా దాని ప్రభావం సాహిత్యంపై ఉంటుంది. ఫ్రెంచ్, రష్యన్, చైనా (కమ్యూనిస్టు) విప్లవాలు అందుకు రుజువు. ఇది తెలుగు వారికి తెలిసిన విషయం కూడా! సాహిత్యం, ఉద్యమం పరస్పర పూరక, ప్రేరకాలు. అక్షరాస్యతా శాతం తక్కువగా ఉన్నటువంటి ఇండియాలోనూ ఇదే స్థితి. ఈ పోరాట ప్రభావాలు నవలగా రూపాంతరం చెందడానికి కొంత సమయం పడుతుంది. కొంచె ఆలస్యంగా అయినా ఎక్కువగా కథా సాహిత్యంపై ఈ ప్రభావం ఉంటుంది. ఉద్యమాలకు కథలు ఊతమిస్తాయి. అయితే ఈ ప్రభావం ఇమ్మీడియట్‌గానూ, అత్యధికంగానూ కవిత్వంలో ప్రతిఫలిస్తుంది. ఉద్యమం నడుస్తున్న సమయంలో కవిత్వం కూడా బలంగా వెలువడుతుంది. ఉద్యమం బలంగా లేకుంటే కవిత్వం కూడా చిక్కగా ఉండదు. ఇట్లా చిక్కగా వెలువడ్డ కవిత్వం అన్యాయాలను, అవమానాలను లెక్కగట్టి చెబుతుంది. తొవ్వ సూపెడుతది. ఇది పార్టిసిపేటరీ పోరాటం. ప్రజల్ని ఉద్యమాలకు సన్నద్ధం చేస్తుంది. అక్షరాలని ఆయుధాలుగా మారుస్తుంది. ఆయు ధాలను ఆధిపత్యాలపై ఎక్కుపెడుతుంది. నినాదమై ప్రజల గొంతును వినిపిస్తుంది.



దోపిడీ, దౌర్జన్యాలను ఎదిరిస్తుంది. అన్నిటి కన్నా ముఖ్యంగా నిన్ను నిన్నుగా నిటారుగా నిలబెడుతది. 1948 తెలంగాణ సాయుధ పోరాటం, 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, ఇటీవలి 'తెలంగాణ' స్వరాష్ట్ర పోరాటంలోనూ వచ్చిన సాహిత్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నట్లయితే ఈ తీరు విశదమవుతుంది.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం సాగుతున్న సమయంలోనూ, అంతకు ముందూ సినిమా రంగాన్ని ఏలుతున్నది ఆంధ్రా వారు. సినీ సాహిత్యంలోనూ వాళ్లదే పైచేయి. తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత తెలంగాణ కళా, కవితా ప్రతిభ సెల్యూలాయిడ్‌పై ఇప్పుడు క్రమంగా రిఫ్లెక్ట్ అవుతూ ఉన్నది. మొత్తంగా కాకున్నా బహుజనులకూ భాగస్వామ్యం దక్కుతోంది. లేటెస్ట్‌గా సింగర్స్ రాహుల్ సిప్లిగంజ్, మౌనిక యాదవ్, దశరథం మొగులయ్య గానం ఇందుకు నిదర్శనం. చెప్పదలుచుకున్న దేమిటంటే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటం జరుగుతున్నంత సేపూ దాదాపు ప్రతి కవీ ఉద్యమంతో మమేకమయ్యిండు. తన గీతాన్ని, గొంతుని ప్రజలకు అంకిత మిచ్చిండు. కళాకారులు అంతే! తన బతుకు కోసం కాకుండా తెలంగాణ కోసం తల్లడిల్లిండ్రు.

నిజానికి కొట్లాడిన వారికే ప్రశ్నించే హక్కు ఎక్కువగా ఉంటది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అందరి కన్న ఎక్కువగా రాసింది కవులు. దాదాపు ఊరుకో కవితా సంపుటిని/సంకలనాన్ని తీసుకొచ్చిండ్రు. అక్షరాలను నినాదాలుగా మలచగలిగిన ప్రతి కవీ తెలంగాణకు మద్దతుగా గొంతు విప్పిండు. అక్షరమై అటు సోషల్ మీడియాలోనూ, పత్రికల్లోనూ పరుచుకుండు. ఈ కొట్లాడిన తరమే ఇవ్వాళ ప్రశ్నిస్తున్నది. ఉద్యమ సమయంలో కొన్ని వందల మంది కళాకారులు వేదికల మీద దోపిడీలను నిలదీసిండ్రు. తెలంగాణ ఆకాంక్షలను ఆలపించిండ్రు. అట్లా ఆలపించిన వారిలో మెజారిటీ కళాకారులు ఇవ్వాళ ప్రభుత్వ సాంస్కృతిక

శాఖ గాయకులుగా ఉన్నారు. అట్లా అని కళాకారులందరూ ప్రభుత్వ గానం చేస్తున్నారని చెప్పలేము. అటు షర్మిలమ్మ మొదలు బిఎస్పి, కాంగ్రెస్, బిజేపిలకు సైతం మద్దతుగా కళాకారులు గొంతు విప్పుతున్నారు. కొందరు కళాకారులు ఉద్యోగాలు చేసుకుంటూ నిరసనలకు దూరంగా ఉన్నారు. అయితే ఇదే సమయంలో ఆనాటి మెజారిటీ ఉద్యమ కవులు ఇవ్వాళ అదే స్ఫూర్తితో ప్రజల పక్షాన నిలబడ్డారు. ప్రజా వ్యతిరేకంగా ఉన్న ప్రభుత్వాల చర్యలను, ఆలోచనలను దునుమాడుతున్నారు. ఇట్లా ప్రజల పక్షాన నిలబడి రాసిన కవిత్వాన్ని, తెలంగాణ ఆత్మగల్ల కవులను బండారి రాజ్‌కుమార్ గుండెలకత్తుకున్నాడు. ఆంధ్రాధిపత్యాన్ని ప్రశ్నించిన కవులు ఇవ్వాళ సకల ఆధిపత్యాలను నిరసిస్తున్నారని ఎరుక జేస్తున్నాడు.

నిజానికి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో 'నీళ్ళు, నిధులు, నియామ కాలు' అనే ట్యాగ్‌లైన్‌ని బెంచ్ మార్క్‌గా పెట్టుకున్నం. 'ఆత్మగౌరవా'నికి ప్రత్యామ్నాయం లేదని నినదించినం. సావులు సాకవోసి, తెగించి కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నం. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఏడున్నరేండ్ల యిన తర్వాత మనం యాడున్నం. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు ఫుల్‌ఫిల్ అయినయా? 'బంగారు' బాటల పోతున్నమా? తొవ్వ ఎట్లున్నది. ముందుకు ఎటు, ఎట్ల పోవాలె అని బేరీజు వేసుకోవాలి. వాటి ఆధారంగా భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవాలి. ఈ బేరీజు వేసే పని ఏ పిడికెడు మందో తప్ప అందరు కవులు నిజాయితీగా చేస్తరు, చేస్తున్నరు కూడా! అది తమ బాధ్యతగా భావిస్తారు. ప్రకృతి, రమణీయత, రసికత, పొగడ్తల గురించి రాసే కవులది అదో లోకం. వారికి కాలం చెల్లింది. వాళ్లని లెక్కలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు. అన్యాయాల్ని, ఆధిపత్యాల్ని ధిక్కరించి బాధితుడికి బాసటగా రాసేదే ప్రజా కవిత్వం. ఇట్లా రాస్తున్న వారి కవిత్వం లోతుల్ని గాలించి, వస్త్రగాలం బట్టి బండారి రాజ్‌కుమార్ తన 'కవిముద్ర'లో ప్రామాణికతను సంతరించిండు. తెలంగాణ కవితా ఏరు ఏ మలుపులు తీసుకున్నది, ఎట్లా సాగుతున్నది, ఏరు మురికయ్యిందా? కొత్త నీరు వచ్చి తేటగా అయ్యిందా? ఆ ఏరులో యే యే పాయలు వచ్చి చేరుతున్నాయి వాటి విశిష్టత ఏంటి అని విస్తృతంగా రాజ్‌కుమార్ చర్చించిండు. ఇది తెలంగాణ సాహిత్య విమర్శకు మేలైన జోడింపు.

బహుజన దృక్కోణంతో చూసినపుడు ఇది లాంగ్‌లీప్. ఇన్నేండ్లు తెలుగు సాహిత్య విమర్శను ఎక్కువగా రాసిందీ, తద్వారా తమ ఆధిపత్యాన్ని, తమ వర్గీయుల ప్రాబల్యాన్ని చాటి చెప్పింది బ్రాహ్మణులే! విమర్శకులకు కులమెందుకు అంటకడుతున్నారండీ అని ఎవరైనా అడుగొచ్చు. ఏ విమర్శకుడికైనా ఒక విషయం మంచి చెడ్డలు నిర్ధారించేప్పుడు బ్యాక్‌గ్రౌండ్‌లో కులం పనిచేస్తూ ఉంటుంది. నియోగులు, వైదికులు, శైవ, స్మార్త, వైష్ణవ, కరణం, పూజారి వర్గం అన్నీ ఆకలింపులోకి వస్తాయి. ఆ అవగాహన తోనే తమకు తెలిసిన తూకపు రాళ్లతోనే సాహిత్యాన్ని విశ్లేషిస్తారు. అంచనా వేస్తారు. పత్రికలు, ప్రచురణ కర్తలు, పాఠకులు ఎక్కువగా ఆధిపత్య కులాలకు చెందిన వారున్నప్పుడు అది చెల్లింది. ఇవ్వాళ




తెలుగు పుస్తకాలను ముఖ్యంగా సాహిత్యాన్ని అన్ని సామాజిక వర్గాల వారు చదువుతున్నారు. బహుజనుల్లో అక్షరాస్యతతో పాటు వారి ఆర్థికస్థితి మెరుగు పడడం కూడా ఇందుకు దోహదపడింది. నిజానికి జనాభా దామాషాలో లెక్కేసినట్లయితే బహుజన పాఠకులే ఎక్కువ. అయితే ఈ బహుజనులకు ఏది కావాలి? కావాల్సినది ఎవరు రాస్తున్నారు? అందులో 'విషయం' ఎంతున్నది అని తేల్చి చెప్పాల్సింది కూడా బహుజన విమర్శకులే! అట్లా నేటి తరానికి అంది వచ్చిన బహుజన విమర్శకుడు బండారు రాజ్‌కుమార్. అవసరమైన పనిని ఆర్తితో చేస్తున్నాడు.

ఇదే సమయంలో విమర్శ అవసరం లేదు. విమర్శ పనికిమాలిన పని. చదువరే తీర్పరి. పాఠకుడు తనకు నచ్చిన పుస్తకం ఎంచుకుంటాడు. చదువుతాడు. మధ్యలో విమర్శకుడి జోక్యం అవసరం లేదు అని కొంతమంది వ్యాఖ్యానాలు చేస్తున్నారు. ఇదంతా బక్వాస్ ముచ్చట. అరాచక వాదం. బాధ్యతారాహిత్యం కూడా. 'చదువరే తీర్పరి' దాంట్లో భిన్నాభిప్రాయం లేదు. అయితే ఆ చదువరికి తాను చదవాలనుకున్న అంశం మీద ఎవరెవరు? యే యే దృక్పథాలతో రాస్తూ ఉన్నారు. ఆయా రచనల్లోని లోటు పాట్లు, మంచి, చెడ్డలేమిటనేది ముందే తెలిస్తే తప్పేమిటి. తెలిసినా ఛాయిస్ చదువరిదే కాబట్టి నియంత్రణ ఏమీ ఉండదు. విమర్శ వద్దనడం పేరిట చదువరి విచక్షణను తక్కువ చేయడమే! చదువరికి సాహిత్యంలోని అన్ని పార్శ్వాలు అవగతమైనట్లయితే తనకు నచ్చిన, మేలైన అంశాలను మదింపు వేసి, తుది నిర్ణయం తీసుకోవడానికి తోడ్పడుతుంది. ఇక్కడ ఎక్కడా నిర్బంధం లేదు. అక్కడ రాయి ఉన్నది చూసి నడువు తట్టు తాకుతది అని చెబితే తప్పేమిటి? ప్రతి ఒక్కరికి తట్టుతాకి రక్తం కారడం స్వీయానుభవంలోకి రావాలంటే అజ్ఞానం తప్ప మరేమీ కాదు. అదలా ఉంచుదాం! ఎంతమంది చదువరులు తాము చదివిన

వ్యాసం

దాని మీద స్వీయానుభవాన్ని రికార్డు చేస్తున్నారు. ఇట్లా చదివిన వారిలో ఒక్క శాతం పాఠకులు తమ అనుభవాలను రాసినా మిగతా పాఠకులకు కొంత తోడ్పడుతుంది. అవును కొంత తోడ్పడు తుంది. ఎందుకంటే ఆ పాఠకుడు తాను చదివిన ఒక్క రచనపైనే వ్యాఖ్యానం చేయగలడు. అదే విమర్శకుడు ఆ రంగంలో ఇదివరకు వచ్చిన రచనలేవి? రచనను అర్థం చేసుకునేందుకు ఎలాంటి పనిముట్లు ఉపయోగించాలనేది చర్చిస్తాడు. పాఠకుడికి నచ్చితే ఆచరిస్తాడు. లేదంటే ఇగ్నోర్ చేస్తడు. ఇంత సింపుల్ లాజిక్‌ని విస్మరించి విమర్శ వద్దనడం అవివేకమే అవుతుంది.

నిజానికి విషయాల మంచి, చెడ్డల విడమర్చి చెప్పడమే విమర్శ. ఇత్తడి, బంగారం చూడ్డానికి ఒకే మాదిరిగా ఉంటాయి. ఏది నగ చేయించుకోవడానికి పనికి వస్తది, ఏది చెంబు తయారు చేయడానికి ఉపయోగ పడుతదో స్వర్ణ కారుడు మాత్రమే సరిగ్గా నిర్ణయించ గలడు. కంచు బాగా మోగుతుందని దానితోని నగలు చేయించుకోలేము గదా! ఇట్లా ఒక మెటల్ యొక్క ఉపయోగాన్ని చెప్పి స్వర్ణకారుడు దానికి విలువగడతాడు. సాహిత్యంలో ఒక రచన యొక్క విలువను విమర్శకుడు తన విశ్లేషణ ద్వారా లెక్కగడతాడు! రీడర్స్ టైమ్ సేవ్ జేయడమే గాకుండా, ఎదిగే మేథకు కొత్త జవసత్వాలిస్తాడు. అతనికి కావాల్సిన అంశం/రచన ఎక్కడ దొరకుతదో, అందుకు తోవ ఏమిటో విమర్శ చెబుతది. అయితే స్వర్ణకారుడి నిపుణత, చెప్పే వారి అనుభవం, జ్ఞానం మీద ఫలితాలు ఆధారపడి ఉంటాయి.

ఇక్కడ రాజ్‌కుమార్ 'తెలంగాణ కవిత్వం'పై తన దైన 'ఐఎస్ఐ' మార్కు లాంటి ముద్దెర వేసిండు. ఇందులో కవిని గణనీయంగా ప్రభావితం చేసే పుట్టిన కుటుంబ పరిస్థితులు, ప్రాంతం, చదువు, పరిసరాలు, తల్లిదండ్రులు, దోస్తానీ, భావజాలం గురించి చెప్పిండు. జనరల్‌గా కవిని అతని కవిత్వం ఆధారంగానే అంచన కడుతూ ఉంటారు. అదే సరైన పద్ధతి కూడా. అయితే ఆ కవిత్వం అట్లా రూపుదిద్దుకోవడానికి కవి ఎట్లాంటి దారుల్లో నడిచి, ఎదుగుతూ వచ్చిండో కూడా తెలుసుకోవడం అవసరం. ఆ అవసరమైన పనిని రాజ్‌కుమార్ ఇందులో చేసిండు. ఈ పనిని విమర్శకులు చాలా అరుదుగా చేస్తూ ఉంటారు. ఈ వ్యాసాలు చదువుతూ ఉంటే ఒక కవి ఆ కవితను అట్లనే ఎందుకు రాసిండో అర్థం చేసుకోవడానికి అనేక విషయాలు వెనకాల వైపు లాగా పనిచేస్తాయి. పరికరాలుగా ఉపయోగ పడతాయి. దీంతో పాఠకులు సైతం ఇన్వాల్వ్ అయి ఒకదానికొకటి కనెక్ట్ చేసుకోవడానికి ఇది తోడ్పడుతుంది. ఇట్లా పాఠకులను కరెక్ట్ కవిత్వానికి కనెక్ట్ చేయడంలో రాజ్‌కుమార్ గెలిచిండు.

ఎనుకటి నుంచి పత్రికల్లో వెలువడే విమర్శకు నిడివి సమస్య ఉండేది. సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఆ సమస్య అధిగమించినట్లయింది. అందుకే రాజ్‌కుమార్ తన విశ్లేషణలో కవి ప్రాతినిధ్య కవితలను క్లుప్తంగా కోట్ చేస్తూనే అతని గురించి, ఆయన కవిత్వం గురించి, ఆయన మీద ఉన్న ప్రభావం, ఆ కవిత్వం ఇతరుల మీద చూపించిన ప్రభావం గురించి, వివరంగా విశ్లేషించిండు. ఒక కవి మీద సమగ్రమైన అంచనాకు వచ్చే విధంగా అతని మొత్తం రచనలు, ఇతర సాహిత్య ప్రక్రియల్లో అతని అభినివేశం అన్నింటిని తడిమిండు. ఇట్లా రాయాలంటే ఒక్కో కవిపై ఒక్కొక్క పిహెచ్‌డికి సరిపోయే సినాప్సిస్ తయారు చేయడమే. అందుకే ఇందులో 51 మంది తెలంగాణ కవుల సినాప్సిస్ ఉన్నాయి అని చెప్పవచ్చు. ఒక్కో సినాప్సిస్ తయారు చేయడానికి మెజారిటీ స్కాలర్లు ఒక సంవత్సరం పైగా టైమ్ తీసుకుంటారు. అట్లాంటిది రాజ్‌కుమార్ ఏడాది పాటు సీరియల్‌గా తాను రాసిన విశ్లేషణ వ్యాసాలను ఇప్పుడు ఒక్క దగ్గరికి తెస్తున్నాడు. అంటే విడివిడిగా 50 మంది విద్యార్థులు ఏడాది పాటు చేసే పనిని తాను ఒక్కడే చేసిండు. కవిత్వమే శ్వాసగా జీవిస్తే తప్ప ఇది సాధ్యం కాదు. సొంత సమయం, డబ్బు ఎలాంటి రిటర్న్స్ ఆశించకుండా తనది కాని వాళ్ల కోసం ఖర్చు చేయాలంటే పాషన్‌తో పాటు ప్రేమ, త్యాగగుణం కూడా ఉండాలి. అవి రాజ్‌కుమార్‌లో పుష్కలంగా ఉన్నాయి.

> **ఏది నగ చేయించుకోవడానికి పనికి వస్తది, ఏది చెంబు తయారు చేయడానికి ఉపయోగ పడుతదో స్వర్ణ కారుడు మాత్రమే సరిగ్గా నిర్ణయించ గలడు. కంచు బాగా మోగుతుందని దానితోని నగలు చేయించుకోలేము గదా! ఇట్లా ఒక మెటల్ యొక్క ఉపయోగాన్ని చెప్పి స్వర్ణకారుడు దానికి విలువగడతాడు. సాహిత్యంలో ఒక రచన యొక్క విలువను విమర్శకుడు తన విశ్లేషణ ద్వారా లెక్కగడతాడు!**

భిన్న భావజాలాలు, భిన్న అస్తిత్వాలకు చెందిన వారి కవిత్వం ఇందులో విశ్లేషించాడు. తెలంగాణ, ముస్లిం, బహుజన, దళిత, స్త్రీ, విప్లవ, అభ్యుదయ, ప్రగతిశీల, ఇతర దృక్కోణంతో రాసిన కవిత్వాన్ని రాజ్‌కుమార్ నిశితంగా పరిశీలించి వారి కవిత్వంలోని సారాంశాన్ని అక్షరాలుగా సాన బట్టిండు. ఒక్కొక్క సారి ఒకే కవికి మూడ్నాలుగు వాదాలతో/భావజాలాల తోనూ సంబంధముండే అవకాశమున్నది. ఉదాహరణకు ఒక స్త్రీ రాసిన కవిత్వంలో ముస్లిం, స్త్రీ, తెలంగాణ, బహుజన కోణాలు కనిపిస్తాయి. ఇందులో 'షాజహానా' కవిత్వం అట్లాంటి కోవకు చెందిందే! 'తెలంగాణ' అనేది వీటి ఏకసూత్రత. కవులందరూ భౌగోళికంగా తెలంగాణలో పుట్టినప్పటికీ భిన్న భావజాలాలకు, వాదాలకు చెందిన వారున్నారు. ఒక ఏడాదికి 52 వారాలుంటాయి. ఇట్లా సంవత్సరం పాటు రెగ్యులర్‌గా 'కవిసంగమం' ఫేస్‌బుక్ పేజీలో రాజ్‌కుమార్ ఈ వ్యాసాలను

రాసిండు. సీరియల్‌గా వస్తున్న సమయంలోనే వ్యాసాల్లో లోతైన అధ్యయనం ఉన్నదని అర్థమయింది. ఈ రచనకొక వెసులుబాటు ఉన్నది. పత్రికల్లో వచ్చే వ్యాసాలకు మహా అంటే ఒక వారం రోజుల లైఫ్ ఉంటది. మళ్ళీ కొత్త వ్యాసం రాగానే పాతదాని గురించి పట్టించుకునే అవకాశం తక్కువ. అంతేగాదు ఫీడ్‌బ్యాక్ అంతగా ఉండదు. అట్లాంటిది ఈ వ్యాసాలు ఫేస్‌బుక్ పేజీలో రావడం వల్ల కామెంట్ల రూపంలో వచ్చిన సూచనలు, సలహాలు, సవరింపులను పుస్తక రూపంలో తీసుకువచ్చే క్రమంలో జోడించుకొని మెరుగు పరుచుకునేందుకు వీలుంది. రచన అనేది క్లోజ్‌డ్ యాక్సెస్ నుంచి ఓపెన్ యాక్సెస్‌కు వచ్చింది. ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో రచయితలు తాము రాసిన రచనలను రెగ్యులర్‌గా పోస్టు చేస్తూ ఉండడంతో అవి పర్మనెంట్‌గా అందుబాటులో ఉంటాయి. (వాట్సప్ సమాచారం మాత్రం డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటది). 'ఫేస్‌బుక్' పేజీలో ఉన్న సమాచారాన్ని 'కీవర్డ్' టైప్ చేసి సెర్చ్ చేయడం ఈజీ గూడా. ఇది సోషల్ మీడియా కల్పించిన అవకాశం. వెనుకటి తరానికి లేని వెసులుబాటు.

తెలుగు విమర్శ రంగంలోకి ఏడాదికి ముగ్గుర్నలుగురు తప్ప కొత్తవాళ్ళు రావడం లేదు. అదే సమయంలో పదుల సంఖ్యలో కవులు కొత్తగా రాస్తున్నారు. ఈ లోపం ఎందుకంటే తనది కాని సాహిత్యాన్ని నిశితంగా చదివి, ఆకలింపు చేసుకొని అందులోని సారాన్ని అందరికి అర్థమయ్యేలా రాయడానికి ఎవ్వరూ ఇష్టపడడం లేదు. ఇష్టపడడం లేదు అంటే కృషికి తగ్గ గౌరవం, గుర్తింపు దక్కడం లేదు. స్వార్థ త్యాగులు, సమాజం పట్ల బాధ్యత గుర్తెరిగిన కొందరు ఈ విమర్శ రంగంలోకి వచ్చినా వారికి ఛీత్కారాలే దప్ప సత్కారాలు దక్కడం లేదు. ఛీత్కారాలుంటాయనేది తెలిసి మరీ రాజ్‌కుమార్ కొత్తగా విమర్శా రంగంలోకి అడుగు పెట్టిండు. కవిగా రాజ్‌కుమార్ ఈ విషయాలన్నింటిని చాలా దగ్గరి నుంచి చూసినవాడే. ఏ కవి అయినా తాను రాసింది సర్వోత్కృష్టమైనది, భిన్నమైనది, మెరుగైనది అని భావిస్తాడు. తన రచనలో మార్పుకు సమ్మతించడు. అయితే విమర్శకులు సోపపత్తికంగా అతని కవిత్వంలోని లోపాలను, ఎత్తి చూపించినట్లయితే మెజారిటీ కవులకు కచ్చితంగా కోపమొస్తది. విమర్శకుడికి కంటవుతాడు కూడా. ఈ విషయం స్వతహాగా కవి అయిన రాజ్‌కుమార్‌కు కూడా తెలుసు. తెలిసి మరీ ధైర్యం చేసిండంటే తాను ఏండ్లుగా చదువుకుంటూ వచ్చిన కవిత్వాన్ని, నచ్చిన ఇమేజెస్‌ని నలుగురితో పంచుకొని, తెలంగాణ కవిత్వానికి సొబగులద్దడమే. మంచి కవిత్వాన్ని మరింత మంది పాఠకులకు చేరవేసేందుకు దారులు వేసిండు.

దళిత, బీసీ, ముస్లిం, ఓసీ సామాజిక వర్గాలకు చెందిన వారి కవిత్వం ఇందులో ఉన్నది. అట్లాగే తన సొంత జిల్లా వరంగల్ వారిని గురించి ఎక్కువగా పట్టించుకున్నా, తెలంగాణలోని మిగతా వారిని ఎక్కడా విస్మరించలేదు. కేవలం జీవించి ఉన్న కవుల కవిత్వాన్నే విశ్లేషించాడు. అందులోనూ పెన్నా, దర్భశయనం, తెలిదేవర భానుమూర్తి, అనిశెట్టి రజిత, నలిమెల భాస్కర్, కందుకూరి అంజయ్య, శ్రీరామోజు హరగోపాల్, ననుమాస స్వామి లాంటి ఉద్యోగాల్లో రిటైరైన వారితో పాటు యువకవులు 'విప్లవశ్రీ' శ్రీనిధి, నందకిషోర్, తగుళ్ళ గోపాల్‌ల కవిత్వాన్ని కూడా ఆర్తితో విశ్లేషించిండు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన దర్భశయనం శ్రీనివాసాచార్య, ఎన్.వేణుగోపాల్, మౌనశ్రీ మల్లిక్, కేతిరెడ్డి యాకూబ్ రెడ్డి, జూపాక సుభద్ర, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, పసునూరి రవీందర్, బిల్ల మహేందర్, వీణావాణి దేవనపల్లి, శ్రీనిధి, అనిశెట్టి రజిత, బాసిత్, అన్వర్, కోడూరి విజయకుమార్, 'నిధి', నాగేశ్వర్, ననుమాస స్వామి, కొలిపాక శోభారాణి, మామిడి హరికృష్ణల కవిత్వంపై విశ్లేషణలు ఇందులో ఉన్నాయి. అంటే మూడొంతల రచనలు ఒక్క వరంగల్ జిల్లా వాళ్ళవే ఉన్నాయి. రాజ్ కుమార్ తన చుట్టూతా లేదా దగ్గరగా ఉన్నవారిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించిండు. అదే సమయంలో ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డిల నుంచి ఒక్కరు కూడా లేరు. హైదరాబాద్ నుంచి నామ్‌కే వాస్తే ఒక్క ఎస్వీకె విజయకుమార్ ఉన్నడు. చాలా మంది హైదరాబాద్‌లో నివాసముంటూ రాస్తున్నా మూలాలు మాత్రం జిల్లాల్లోనే ఉన్నాయి. అట్లా తెలంగాణ మూలాలున్న కవులపై, వాళ్ల తెలంగాణ ఉద్యమం పైన రాసిన కవిత్వాన్ని ఇందులో రాజ్‌కుమార్ విశ్లేషించిండు. ఈ జిల్లాల నుంచి మిస్సయినయి అని చెప్పడంలో నా ఉద్దేశం తర్వాతైన ఆ యా జిల్లాల్లో ఉన్న కవులను పట్టించుకొని వారిపై రాయాల్సిన అవసరముందని చెప్పడం. ఈ జిల్లాల నుంచి నాళేశ్వరం శంకరం, ఘనపురం దేవేందర్, ఉదారి నారాయణ, ఆశారాజు ఇట్లా అనేక మంది ఉన్నారు. మెయిన్ స్ట్రీమ్ కవులుగా చలామణవుతున్న దాదాపు ఐదొందల మంది ఇప్పటికే తమ రచనలను పుస్తకాలుగా తీసుకొచ్చారు. అట్లా పుస్తకాలు తెచ్చిన అందరి గురించి రాయడం కుదరదు గానీ ప్రజా పక్షంగా ఎవరు రాస్తున్నారో, ఎవరి రచనలు ఎక్కువ ప్రభావశీలంగా ఉన్నాయో, ఎవరి పుస్తకాలకు మార్కెట్‌లో ఎట్లాంటి ఆదరణ ఉందో.. అన్నీ విమర్శకుడిని కూడా ప్రభావితం చేస్తాయి. కొన్ని సార్లు కొందరి గురించి రాద్దామని నిర్ణయించుకున్నా వారి రచనలు అన్నీ అందుబాటులో ఉండక పోవడం, ప్రాథమిక సమాచారం ఇచ్చేవారు దొరకక పోవడం కూడా మంచి వారిని మిస్ చేస్తది. రాసింది దాచిపెట్టుకొని, ప్రచారం చేసుకోవడం 'తెలంగాణ తనానికి' విరుద్ధం. ఇట్లాంటి సమయంలో ఒక కవి గురించి రాయాలంటే చదవడం కన్నా పరిశోధనకే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తది. నిజానికి పరిశోధన అనేది విమర్శకుడిని సానబెడుతది. అట్లా రాటుదేలిన విమర్శకుడు రాజ్‌కుమార్.

దళిత బహుజన జీవితాలను

వ్యాసం

కవిత్వంలోకి బలంగా తెస్తూ రాసిన మునాసు వెంకట్, జూపాక సుభద్ర, వనపట్ల సుబ్బయ్య, పసునూరి రవీందర్, పొన్నాల బాలయ్య, బూర్ల వెంకటేశ్వర్లు, ననుమాస స్వామి లాంటి వారిని పట్టించుకొని వారికి గౌరవ స్థానం కల్పించడం ఆహ్వానించాల్సిన విషయం. అట్లాగే ముస్లింలుగా తాము ఎదుర్కొం టున్న, వివక్ష, అసమానతను, దైన్యాన్ని షాజహానా, నస్రీన్‌ఖాన్, స్కైబాబ, బాసిత్ (ఎక్కువగా విప్లవ భావజాలం), అన్వర్, ఇబ్రహీం నిర్గుణ్‌ల రచనలున్నాయి. వీరి కవిత్వంలోని 'అనెక్‌డోట్స్' లాంటి వాక్యాలను రాజ్‌కుమార్ రికార్డు చేస్తూ వారి కవిత్వమూర్తిమత్వాన్ని చిత్రికగట్టిండు.

విదేశాల్లో స్థిరపడ్డ రవి వీరెల్లి, నారాయణస్వామి వెంకటయోగి కవిత్వాలను కూడా రాజ్‌కుమార్ ఇందులో విశ్లేషించిండు. విశ్లేషించిండు అంటే విమర్శా దృక్కోణంతో విలువ కట్టిండు అని అర్థం చేసుకోవాలి. మహిళల్లో షాజహానా, మెర్సి మార్గరెట్, జూపాక సుభద్ర, కొలిపాక శోభారాణి, నస్రీన్ ఖాన్, వీణావాణి దేవనపల్లి, అరుణ నారదభట్ల, శ్రీనిధి, అనిశెట్టి రజితల కవిత్వమున్నది. ఇక్కడ బీసీలకు దక్కాల్సిన న్యాయమైన ప్రాతినిధ్యం దక్కలేదు. ఇది సామాజిక వర్గాల ప్రాతినిధ్య కవిత్వం కాదు. ఒప్పుకుంటా. కానీ మొత్తం తెలంగాణ కవిత్వంగా గుర్తింపుకు నోచుకోవాలంటే జనాభా దామాషాలో ప్రాతినిధ్యం ఉండాలి. 'ఢూండేతో ఖుదా బీ మిల్తా' అనేది సామెత.

ఎన్.వేణుగోపాల్, వడ్డెబోయిన శ్రీనివాస్, బాసిత్, నాగేశ్వర్ లాంటి విప్లవ కవులతో పాటు అభ్యుదయ కవి 'నిధి'ల కవిత్వాన్నీ, తెలంగాణతో మమేకమైన జీవన గానాన్ని వేళ్లతో సహా పట్టుకున్నాడు. వేణుగోపాల్ గురించి పెద్దగా తెలియని విషయాలను ఆసక్తికరంగా రికార్డు చేసిండు. 'రక్తగాయకుడు' పేరుతో వేణు రాసిన కవిత్వం, ఆయన తండ్రి పేరు కూడా వరవరరావు అనే విషయాన్ని రాజ్‌కుమార్ బహుశా తొలిసారిగా పాఠకులకు చెబుతున్నాడు.

విమర్శలో భాగంగా రాజ్‌కుమార్ భాషను పర్టిక్యులర్‌గా పరిశీలించాడు. కవుల భాషలోని మాధుర్యాన్ని ఆస్వాదించిండు. అందరికీ పంచిండు. అట్లనే అది సరిగ్గా కుదరనప్పుడు కచ్చితంగానే చెప్పిండు. దానికి ఉదాహరణ ఎస్వీకే గురించి రాసిన దాంట్లో ఉన్నది. అందులో ఇట్లా అంటాడు. "నాయిన కరీంనగర్‌లో పుడితే కొడుక్కు అక్కడి భాష అబ్బాలని నియమం ఏమీలేదు. కానీ హైదరాబాదులో పుట్టి పెరిగిన కవిలో ఇక్కడి భాష కూడా తొంగిచూడకపోవడం మాత్రం ఇసారించదగ్గ విషయమే. కొంచెం విచారించవలసినదే. హైదరాబాదు నగర భాషను కవిత్వం చేస్తే, చేయగలిగితే తన కవిత్వం మరింత తాజాగా, సహజంగా, పొల్యూట్ కాని నగరంలా కనిపిస్తుంది. ఉర్దూ కలగలసిన హైదరాబాదు భాషలో ఒక్క కవిత రాసి దోస్తులకు వినిపించి చూడు. జిందగీ మరింత విశాలమైతది. జీవితమూ, కవిత్వము ఎంతలా పెనవేసుకుని వున్నాయో అర్థమైతది." అంటూ కవిత్వం కావాల్సిన భాషను ఒక కొలమానంగా చూపించిండు. అట్లాగే అవనిశ్రీ కవిత్వం టెక్నిక్‌ని సాధన చేయడంలో విఫలమయ్యిందంటూ విమర్శించిండు. "అవనిశ్రీ కవిత్వంలోని ఒక డ్రాఫ్ట్‌లా వుంటుంది. ఇంకా ఎడిట్ చేయాల్సింది మిగిలే వున్నట్టు అనిపిస్తుంది. .... ధిక్కార గొంతుతో రాజ్యం గుండెలపై గురిపెట్టిన బాణంలా దూసుకుపోయే సత్తావున్న కవిని ఎవరైనా వేలెత్తి చూపెట్టడం ఏ మాత్రమూ సహించలేం. అలాగని కవిత్వంలోని లోటుపాట్లను వెన్నపూస రాసినంత మృదువుగానూ చెప్పలేం. సరిశే దెబ్బేదో గట్టిగనే ఆనెటట్టు పడాలే. అప్పుడే ఇలం. ఫలం." అంటూ తాను చెప్పదలుచుకున్నదేదో శషభిషలు లేకుండా ముక్కుసూటిగా చెప్పిండు. దీని వల్ల నేర్చుకుంటే కవికి, కవిత్వానికి బలం వస్తుంది. బలం మాత్రల్ని విమర్శకుడు డాక్టర్‌లా ప్రిస్క్రైబ్ చేయాల్సిందే. వాడాల్సింది కవులు. ప్రేమ కవిత్వాన్ని ఎక్కువగా రాసిన నందకిశోర్ కవిత్వాన్ని విశ్లేషిస్తూ "రాసే సత్తా వున్న రాయగలి గినంత వస్తువును ఎంపిక చేసుకోకపోవడం తన లోపం" అంటూ నిక్కచ్చిగా చెప్పిండు. ఇట్లాంటి తీర్పులు చాలా మంది కవులపై ఇచ్చిండు. తీర్పులివ్వడం ఆధిపత్యకులాల హక్కుగా ఉండింది. ఇవ్వాల్టికీ దేశ జ్యుడిష్యరీలో 'కొలిజీయమ్' సిస్టమ్‌లో బ్రాహ్మణాధిపత్యం కొనసాగుతున్నది. కనీసం ఆ ఆధిపత్యాన్ని సాహిత్యంలోనైనా రాజ్‌కుమార్ లాంటి వాళ్ళు తగ్గిస్తున్నందుకు సంతోషంగా ఉన్నది. ఇట్లాంటి తీర్పులు మరెన్నో రాజ్‌కుమార్ కలం నుంచి వెలువడాలని ఆకాంక్ష.

**విదేశాల్లో స్థిరపడ్డ రవి వీరెల్లి, నారాయణస్వామి వెంకటయోగి కవిత్వాలను కూడా రాజ్‌కుమార్ ఇందులో విశ్లేషించిండు. విశ్లేషించిండు అంటే విమర్శా దృక్కోణంతో విలువ కట్టిండు అని అర్థం చేసుకోవాలి. మహిళల్లో షాజహానా, మెర్సి మార్గరెట్, జూపాక సుభద్ర, కొలిపాక శోభారాణి, నస్రీన్ ఖాన్, వాణి దేవులపల్లి, అరుణ నారదభట్ల, శ్రీనిధి, అనిశెట్టి రజితల కవిత్వమున్నది. ఇక్కడ బీసీలకు దక్కాల్సిన న్యాయమైన ప్రాతినిధ్యం దక్కలేదు.**

నిజానికి కవిత్వ విమర్శ రాయడమే కష్టం. అట్లాంటి విమర్శ మీద మరో విశ్లేషణ లాంటి ముందుమాట రాయడం కష్టమైన పనే. ఈ కష్టమైన పనికి నన్ను ఎంచుకున్నందుకు రాజ్‌కుమార్‌కు థాంక్స్.

(ఇటీవల వెలువడ్డ (డిసెంబర్, 2023) బండారి రాజ్‌కుమార్ విమర్శ సంపుటి 'తెలంగాణ కవిముద్ర'కు రాసిన ముందుమాట)

# పిల్లగాండ్ల కొరకు తెలంగాణా పల్లెబాసలో "జోర్దార్ కతలు"

ఏమంట తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డదో అప్పటిసంది శాన మంది జర తెలంగాణ బాస దిక్కు తొంగి సూత్తున్రు.

ఇగో గీ పైడిమర్రి రామక్రిష్ణ సుత గట్లనే ఏనుగులు, లొటపిటలు, గుడ్డేలుగులు, పులులు, సింహాలు, కోతులు, జింకలు గిట్ల అడివిలుండే జీవాలన్నింటని తన కతకు దగ్గట్ట తీస్కోని కతలు రాస్తడు. గట్లనే కాకి, చిల్క, పావురం, కొంగ, కోడి, బాతసోంటి పచ్చులను గూడ గండ్ల గల్పుతడు. పసులు పచ్చులతోటి కతలు జెప్పితె పొల్లగాండ్లకు మస్తు సంబ్రమైతదని గీనెకు బాగ దెలుసు. యెనకటగా పంచతంత్రం సుత గట్లనే పసులు పచ్చులతోటి జెప్పిన్రు గదగా చిన్నయసూరనేటాయినె.




ఇదివరకు సుత ఈనె కతలన్ని పసులు పచ్చుల తోటే జెప్పిండు గని, గిప్పుడేమో తెలంగాణ పల్లెబాసల చెప్పనీకి కోశిష్ జేసిండు. అనుకుంటం గని గిట్ల రాసుడు అంత అలకటి పనిగాదు. లావు కట్టమైతది పల్లెబాసల, యాసల రాయాల్నంటే. కని గీ పిల్లగాడు మస్తుగనే కట్టపడి కతలు రాసిండు.

గమ్మతేందంటే ఈనె కతలల్ల ఈ జీవాలన్ని మనుషులు చేసిన పన్లు జేస్తయి. దుకనం బెడ్తయి, దావతులు జేస్కుంటయి, పుట్టిన్రోజు ఫంక్షన్లు జేసుకుంటయి, ఈతల పోటీలు వెట్టుకుంటయి. మనుషులు జేసే పన్లల్ల ఏం తిప్పలుంటయో మనుషులెటు వంటోల్లుంటరో గీళ్లకు బుద్దిజెప్పనీకి ఈ సారు జెంతువులను, పచ్చులను, మనుషులకు బదులు కతల వాడుకుంటడు. గీనె కతలన్ని గూడ అడివిల ఉండే జెంతువులు, పసులు, పచ్చుల తోటే ఉంటయి.

ఏదన్న బాగుందనటానికి తెలంగాణాల జోర్దారుగున్నది అంటరు. పిల్లగాండ్ల కోసం గీ పిల్లగాండ్ల కతలు రాసేటాయినని నేనడిగినా గిట్లెందుకు రాసిన్రని. అంటే ఆయన మన పిల్లలకు మన పల్లెబాస రుచి జూపించనీకి అన్నడు. నివద్దిగనే ఆల్లిప్పుడు గిట్ల మాట్లాడక పొయినా కమస్కం మన యెన్కటి బాసెట్లుండేడిదో తెలుస్తది గద.

గట్ల పన్నెండు కతలతోటి వయ్యి దెచ్చిండు పైడిమర్రి రామకృష్ణ. గీ కతలన్ని సదువంగనె గాయినె కతలు రాసినట్టె నాకు గీ వయ్యి గురించి రాయబుద్దయ్యింది. గీ పైడిమర్రి రామక్రిష్ణ అనేటాయినె శానేండ్ల సుంది పోరగాండ్ల కోసం మస్తు కతలు రాస్తుండు. కతలు రాసుట్ల మస్తు శెయ్యిదిరిగి నాయినె. ఇంతకు ముందు ఒక వయ్యిల తాంబేలు యిగురమని ఒక కత మచ్చుకు తెలంగాణ బాసల రాసిండు. గిప్పుడు గీ వయ్యిల కతలన్ని సుత యెన్కట పల్లెటూల్లల్ల ముచ్చట్లు వెట్టుకునే బాసల రాసి పుస్తకం దెచ్చిండు. ఆ పదాలు వాడనీకి ఎంత సోచాయించిండో గని కతలు మస్తున్నయి కాదు కాదు జోర్దారుగున్నయి.

ఒక కతల నక్క, గుడ్డేలుగు కలిసి కోడికూర తిందామని ఓ దావతుకు వోతరు. గాడేం జరుగుతదో కత చదివితె సమజయితది.

ఇగ ఇంకో కతల సింహం బువ్వసత్రంకు బొయ్యి ఏంజేస్తదో చెప్తడు. గట్లనే ఇంక కతలల్ల ఇగురం దక్వ పని, కాకి దుకునం, బంగారు కడియం, తాంబేలు నిర్ణయంఅని మన్సుల బదులు జెంతువులు బెట్టి మనుషుల కతలే చెప్తడు. కతలు జదువంగనె. మనుషుల బుద్దులు, మనుషుల అలవాట్లు యాదిలకస్తయి. కని ప్రతి కతల గుడ ఏదో ఒకటి పిల్లగాండ్లకు బుద్దిజెప్పనీకి నీతసుమంటిదివుంటది. అవ్ గిట్ల జెయ్యద్దు. గిట్ల మెసులుకోవాలె, గిట్ల జేస్తె తప్పు, గిట్లుంటే మంచిది అని గీ కతలు సదువంగనే సమజయితది.

పిల్లగాండ్ల కోసం రాసిన కతలు గన్క వాల్లకు గీ ముచట్లన్నీ దిమాక్ ల గూసుంటయి. జర గీ యాసల సదువుడు పిల్లలకు తక్లీఫ్ అయితది గావచ్చుగని మరి ఆళ్లకు మన బాస ఎట్ల దెల్వాలె. మన పిల్లలకు గీ కతల వయ్యి కొనిచ్చి సదివించాలె. యాడనన్న సమజ్ గాకపోతె మనం సమజాయించాలె. కతలు సదువినట్లుంటది. పల్లెబాస తెలిసినట్లుంటది. మొన్న గీ కతలు అదిలబాద రేడియోల యిన్న. మస్తు మంచిగనిపించినయి. ఎంతైన మన తల్లిబాసనాయె.

సరె మరి గీ పుస్తకం కావాల్ననుకునేటోల్లు అగో ఈడ గాయినె పతా ఇత్తున్న. ఫోన్ నంబరు సుత ఇత్తాన్న. తెప్పించి మీ పిల్లలకియ్యున్రి.

పుస్తకం ధర : 80 రూపాయలు

పుస్తకాలు దొరికేది గీడనే.

**Pydimarri Ramakrishna**
H.No.: 9-86/1, Beside Srikrishna Temple,
Nadergul, Balapur Mandal, Rangareddy, Hyderabad.
Cell : 92475 64699

- తుమ్మూరి, 9701522234

# కథా సౌరభంతో గుబాళించిన పద్యాలు....

సృజన రంగం కళానైపుణ్యంతో కొనసాగడం లేదనే ఆరోపణ తరచు వింటుంటాం. దీనికి కారణం విస్తరించిన ఐ.టి., ఇంగ్లీష్ మీడియం, మరియు సైంటిఫిక్ అడ్వాన్స్‌మెంట్ వల్ల బాల్యంనుండి ఒక అభిరుచి ఏర్పడకపోవడం కావచ్చు. ఈ అభిరుచిని ప్రోత్సహించే ప్రయత్నం బాల్యం నుండే జరిగితే మిగతా రంగాలకు స్ఫూర్తిదాయకంగా సాహిత్యం కూడా వికసిస్తుంది.

ఈ లోతు తీర్చే విషయంగా తనవంతు ప్రయత్నం చేస్తున్న దిశగా డాక్టర్. వైరాగ్యం ప్రభాకర్ సంపాదక నేతృత్వంలో వచ్చిన పుస్తకం, పద్య కథా సౌరభం. ఒక ప్రసిద్ధ పద్యం ఆ పద్యానికి అనుగుణంగా భావ పూరణం చేస్తూ రచయిత ఒక కథ రాయడం ఒక ప్రయోగమే. వేమన సుమతీ, భాస్కర మొదలైన ప్రసిద్ధ శతక పద్యాలు ఇందులో కనిపిస్తాయి. భీమవరపు జ్యోతి, అద్దంకి లక్ష్మి, దుబ్బాక శివకళ్యాణి, గుండవరం కొండల్ రావు, బిరుదుల ప్రవీణ్ కుమార్ మొదలైన కథా రచయితలంతా పద్యాలకను గుణంగా తమ సృజన శక్తిని చూపించారు. కథలన్నీ పిల్లలకు ఉపయుక్తంగా, సులభ గ్రాహ్యంగా ఉన్నాయి. పరివర్తన, సాయంవిలువ, అప్పుముప్పే, మధురభాషణమే మణి భూషణము లాంటి కథలన్నీ బాలలకు గొప్ప స్ఫూర్తిదాయకం. బాలసాహిత్యంలో ఉన్న ఖాళీని పూరించడానికి సంపాదకుల కృషి అభినందనీయం.




వెల: రూ. 200

ప్రతులకు : **వైరాగ్యం ప్రభాకర్**

ఇంటి నం. 2-102, సీతరాంపూర్, కరీంనగర్ - 505001

సెల్ : 90145 59059

# ఒక కవిత్వ బాటసారి... కె. ప్రభాకర్




ఈ రోజుల్లో నిష్కల్మషుడైన మనిషి తగలడం చాలా అరుదు. అతను కవికావడం మరొక అరుదు. అతని స్వచ్ఛత అక్షరాలలోకి కూడా ప్రవేశించి కవిత్వమై వెలయడం మరొక అరుదైన విషయం.

ఈ దారిలోనే కె. ప్రభాకర్ తన హృదయాన్ని అక్షరాలలోకి వంపి కూర్చిన కవితా సంపుటి ఆదిత్య హృదయం. అత్యాధునిక కవితా నిర్మాణంలో కనిపించే ఏ ఇమేజులు, ప్రతీకలు ఆయన ఆశ్రయించడు. చెప్పే విషయం సరళంగా సూటిగా చెప్పడం ఆయన పద్ధతి. కె. శివారెడ్డిగారన్నట్టు ఆయన కవిత్వంలో బూజు పట్టిన భావాలమీద నిరసన, కొత్త పుంతలు తొక్కాలనే తపన ద్యోతకమవుతుంది. ఆయన ఆదిత్య హృదయంలో భాషా వైఖరి అనే కవిత చూద్దాం.

"ఛందస్సుకి వ్యాకరణానికి
ఏనాడో విడాకులిచ్చాం
....ప్రతి యాసలో గోస ఉన్నది,
ప్రతి భాషలో భావమున్నది
యాసలెన్ని ఉన్నా
భాష ఒక్కటే
భాషలెన్ని ఉన్నా భావమొక్కటే"

ఇట్లా సూటిగా కొనసాగుతుంది. ఈ సంపుటిలోని ప్రతి కవితలోను ఒక ఉన్నతాదర్శం కనబడుతుంది.

ఆదిత్య హృదయంలో మొట్టమొదటి కవిత ఈ కవి రచనా లక్ష్యం ఈ విధంగా వ్యక్తం చేసింది.

"నాకు నచ్చిన ఇతి వృత్తం తీసికొని
నాకు వచ్చిన భాషలో రాసెద
జనులకు నచ్చకున్న నొచ్చుకోను
జనులు మెచ్చకున్న ఎగిరి పడను"

అతడి పేరు ధర్మయ్య అనే చిన్ని కవితలో ధర్మయ్య దైన్యం, శ్రీ శ్రీ కవిత్వం గుర్తుకు తెస్తుంది. అయితే ధర్మయ్య ప్రాణం మొక్కలో చేరిపోవడం ఈ కవితలో పాటమరించిన కొత్తదనం.

ఇప్పుడు వస్తున్న కవిత్వానికి భిన్నంగా సరళ సుందరంగా వచ్చిన సంపుటి ఆదిత్య హృదయం.

వెల : రూ. 160

ప్రతులకు : **ఇంటింటా స్వంత గ్రంథాలయం**

9000938291

# అన్నాడి గజేందర్ రెడ్డి "వెలుగుల వెల్లువ"

విమర్శకుడు అన్నాడి గజేందర్ రెడ్డి వివిధ సందర్భాలలో రాసిన వ్యాసాలు, సమీక్షలు ఇవి. అన్నీ దాదాపుగా లీడింగ్ పత్రికలలో వచ్చినవే. నూరు పూలు సంకలనం గురించి నందిని సిద్దారెడ్డి మాటలను ఉటంకిస్తాడు గజేందర్ రెడ్డి.

"డబ్బు సంపాదించినపుడు మన చుట్టూ మిత్రులుంటరు. వాళ్ళు డబ్బునే ప్రేమిస్తరు. పదవిలో ఉన్నపుడు మనవెంట మనుషులుంటరు. వాళ్ళు పదవినే ప్రేమిస్తరు. కానీ కవిత్వం రాసేటపుడు మనవెంట మిత్రులుంటరు. వాళ్ళు మనుషులను ప్రేమిస్తరు. విలువలను ప్రేమిస్తరు. కవిత్వాన్ని ప్రేమిస్తరు...




ఇట్లాంటి విలువైన ఉటంకింపులు ఈ పుస్తకం నిండా కనిపిస్తాయి. ఏనుగు నరసింహారెడ్డి రుబాయిల గురించి రాస్తూ నరసింహ రెడ్డికి కైతన్నది నిత్య పదార్థం అని వ్యాఖ్యానిస్తాడు. దేవనపల్లి వీణావాణి కవిత్వాన్ని ఒక చెరగని ముద్రగా పేర్కొంటాడు గజేందర్ రెడ్డి. శిలాఫలకం చిరస్థాయిగా ఉన్నట్టే, ఆపేరుతో ఉన్న ఈ గ్రంథం పాఠకులపై ఎప్పటికీ చెరగని ముద్ర వేస్తూనే ఉంటుంది. పెనుగొండ సరసిజ కవిత్వాన్ని గురించి," స్త్రీల సమస్యలలో ఏ కవి స్పృశించని అంశాలని రాస్తుందన్న ఓల్గా ముందుమాటను పేర్కొంటారు.

బైసదేవదాస్ తెలంగాణ అమరులకు అక్షర నివాళి పేరున అరవై మంది కవుల కవితలను ఏర్చి కూర్చి ప్రచురించారు. మాడిశెట్టి గోపాల్, ఎన్.వి. రఘువీర్ ప్రతాప్, గంగ్ర లక్ష్మణ్ రావు, సాదనాల వెంకట స్వామి నాయుడు లాంటి కవుల కవితల్ని ఉదహరిస్తారు. చిన్న పిల్లలకోసం వడ్డేపల్లి సంధ్య రాసిన చిటపట చినుకులు కూడా అన్నాడి వదలిపెట్టలేదు.

"అమ్మంటే మమకారపు మహాకావ్యము
నాన్నంటే దారిచూపు దీప స్తంభము"
"చిన్నారి పొన్నారి మన చిట్టి పాపలకు
నవ్వుల పువ్వులు ఎవరు అద్దారు"

గజేందర్ రెడ్డి వెలుగుల వెల్లువ కవిత్వ వ్యాస సంపుటిలో 33 వ్యాసాలున్నాయి. ఆకర్షణీయమైన శైలితో ఈ వ్యాసాలు చదువరిని తమతో నడిపిస్తాయి. నంది శ్రీనివాస్ ముఖ చిత్రం ఆకర్షణీయంగా ఉంది. ఆధునిక కవితా యానం మీద అవగాహన కావాలనుకునే వాళ్ళు ఈ సంపుటి చదవాలిసిందే.

వెల : రూ. 100/-
ప్రతులకు : అన్నాడి గజేందర్ రెడ్డి,
ఇంటి నెం. 8-3-129, భగత్ నగర్,
కరీంనగర్ - 505 001. సెల్ : 9848894086.

## ప్రముఖ సాహితీ వేత్త చారిత్రకుడు సంగిశెట్టి శ్రీనివాస్ కాలమ్ ప్రారంభం - వచ్చే సంచిక నుండి...



బహుజన సాహిత్య, సామాజిక, రాజకీయ ఔన్నత్యాన్ని, వివక్షతను, విస్మరణను అక్షరాల్లో లెక్కగట్టి అందించే సంగిశెట్టి శ్రీనివాస్ కాలమ్ మార్చ్-2024 నుంచి ప్రారంభం కానున్నది.

ఆధిపత్య కుల వ్యవస్థలో అణచివేతకు గురైన చరిత్ర, సంస్కృతి, సమాజం వాటి నిర్మాతల గురించి ఇందులో చర్చిస్తారు.

# ప్రతిభకు పట్టం కట్టిన పద్మ పురస్కారాలు...



తెలంగాణకు చెందిన ఐదుగురు ప్రతిభామూర్తులకు పద్మశ్రీ పురస్కారాలు అందడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవు తోంది. ఆధునిక గ్రంథాలయ ఉద్యమ కారుడు, ప్రముఖ సాహితీవేత్త కూరెళ్ల విఠలాచార్య, అరుదైన బుర్రవీణ కళాకారుడు దాసరి కొండప్ప, చిందు యక్షగాన కళకు జాతీయ స్థాయి గుర్తింపును తెచ్చిన గడ్డం సమ్మయ్య, భగవద్గీతను బంజారాలోకి తెచ్చిన కేతావత్ సోమ్ లాల్, యాదాద్రి ఆలయ శిల్పకారుడు ఏ వేలు ఆనందచారిలు ఈ సంవత్సరం తెలంగాణ ప్రాంతం నుంచి పద్మశ్రీ పురస్కారాలకు ఎంపికయ్యారు.

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన కూరెళ్ల విఠలాచార్య రెండు లక్షలకు పైగా అరుదైన గ్రంథాలతో తన ఇంటిని గ్రంథాలయంగా మార్చి బృహత్ గ్రంథాలయం నిర్వహిస్తున్నారు. తన పెన్షన్ డబ్బులు సైతం గ్రంథాలయ నిర్వహణకు వినియోగిస్తున్న విఠలాచార్య చిన్న నాడు తాను పేదరికం వల్ల పుస్తకాలు కొనుక్కోలేక ఇబ్బంది పడ్డానని అటువంటి పరిస్థితి నేటి తరానికి రాకూడదని తపనతో ఈ గ్రంథాలయం నిర్వహిస్తున్నారు. సాహితీవేత్తగా 20 కి పైగా గ్రంథాలు రచించారు. తెలుగు నవలల్లో స్వాతంత్రోద్యమం అనే అంశంపై పరిశోధన చేసి ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి పి.హెచ్.డి. పట్టా పొందారు.

నారాయణపేట జిల్లా దామరగిద్ద గ్రామానికి చెందిన బుర్ర వీణ కళాకారుడు దాసరి కొండప్ప. ఇది అరుదైన వాయిద్యం. ప్రస్తుతానికి బుర్ర వీణను వాయిస్తున్న ఏకైక కళాకారుడు కొండప్ప కావడం గమనించదగినది. ఈ వాయిద్యాన్ని మీటుతూ తెలుగు కన్నడ భాషలో అనేక తత్వ గీతాలు అలవోకగా పాడగలుగుతాడు. జయదీర్ తిరుమల రావు ప్రోత్సాహంతో దూరదర్శన్లో ప్రదర్శనలు ఇచ్చారు. తెలుగు విశ్వ విద్యాలయం సాలార్జంగ్ మ్యూజియం తదితర వేదికలపై తన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ కళ అంతరించి పోకుండా ముందు తరాలకు అందించ డానికి నా వంతు ప్రయత్నం చేస్తున్నానని కొండయ్య చెప్తున్నారు.

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గడ్డం సమ్మయ్య సుప్రసిద్ధ చిందు యక్షగాన కళాకారుడు. వారసత్వంగా తన తండ్రి రామస్వామి నుంచి ఈ కళను నేర్చుకుని దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. చిందుకళకు జాతీయ గుర్తింపు తెచ్చిన కళాకారుడు. కేవలం పౌరాణిక ఇతిహాస గాథలే కాక పలు సామాజిక సమస్యలపై తన ప్రదర్శన ద్వారా ప్రజా చైతన్యం కలిగించారు. అక్షరాస్యత ఉద్యమం, హరితహారం ఓటరు చైతన్యం వంటి కార్యక్రమాలలో తన కళా ప్రదర్శనతో ప్రజల్లో చైతన్యాన్ని రగిలించారు. యాదాద్రి జిల్లా భువనగిరి మండలం ఆకుతోట బావి తండాకు చెందిన కేతావత్ సోమ్ లాల్ హిందువుల పవిత్ర గ్రంథం భగవద్గీతను బంజారా భాషలోకి అనువదించారు. ఈయన బంజారాలకు అర్థమయ్యేలా భగవద్గీతను మలిచారు. వీరు బంజారా జాతి జాగృతి కోసం అనేక పాటలు రాశారు. జనగామలో హాస్టల్లో ఉంటూ చదివేటప్పుడు కేతావత్ సోమ్ లాల్ పక్కనే ఉన్న గుడిలో నుంచి రోజూ ఉదయాన్నే లౌడ్ స్పీకర్లో వచ్చే భగవద్గీ తను వినేవాడు. అప్పటినుంచే తమ జాతికి భగవద్గీతను ప్రజలకు దీనిని అర్థమయ్యేలా అందించాలని సోమ్ లాల్ భావించారు. 16 నెలల పాటు అవిశ్రాంతంగా కృషిచేసి భగవద్గీతలోని 701 శ్లోకాలను బంజారా భాషలోకి అనువదించారు. గీత అనువాదం 1989లోనే పూరయినా అది అచ్చు కావడానికి 35 ఏళ్ల నిరీక్షించాల్సి వచ్చింది. 2014లో ఈయన రచించిన గ్రంథాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురించింది.

ఆంధ్రప్రదేశ్లోని చిత్తూరు జిల్లా వెన్నంపల్లిలో జన్మించిన ఆనందాచారి వేలు హైదరాబాద్లో స్థిర పడ్డారు. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా రూపుదిద్దుకున్న యాదాద్రి ఆలయ పునర్నిర్మాణంలో ఆనందాచారి వేలు కీలకంగా వ్యవహరిం చారు. ఆలయ నిర్మాణంలో అదనపు స్థపతి సలహా దారుడిగా పనిచేశారు. గతంలో అన్నవరం, శ్రీశైలం, విజయవాడ, కాణిపాకం, సింహాచలం, యాదగిరిగుట్ట, బాసర, వేములవాడ, శ్రీకాళహస్తి ఆలయాల్లో పనిచేశారు. యాదాద్రి దేవాలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో ఈయన్ను యాదాద్రి ఆలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ (వైటీడీఏ) ప్రధాన స్థపతిగా నియమించింది. శిల్పకళలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నందుకు గాను పలు జాతీయ స్థాయి పురస్కారాలు అందుకున్నారు. పద్మశ్రీ పురస్కారాలు అందుకున్న కళామూర్తులను తంగేడు అభినందిస్తున్నది.

## తోట నిర్మలరాణికి అలిశెట్టి ప్రభాకర్ అవార్డు

నారదాసు లక్ష్మణరావు స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న అలిశెట్టి ప్రభాకర్ అవార్డును ఈ సంవత్సరానికి గాను కరీంనగర్‌లో జనవరి 12, 2024న తెలంగాణ రచయితల వేదిక, తోట నిర్మలరాణికి ప్రదానం చేశారు. ఈ సభలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్షణరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కాంచనపల్లి గోవర్దన్ రాజు, అన్నవరం దేవేందర్, కొండి మల్లారెడ్డి, నాగభూషణం, బుర్ర వెంకటేశ్వర్లు, అంజయ్య తదితర ప్రముఖ రచయితలు సభలో పాల్గొన్నారు. అలిశెట్టి ప్రభాకర్ సతీమణి భాగ్యలక్ష్మి, కుమారుడు సంగ్రామ్ ఈ సభకు హాజరయ్యారు. తనకు ప్రతిష్ఠాత్మకమైన అలిశెట్టి ప్రభాకర్ పురస్కారాన్ని ప్రధానం చేసినందుకు కవయిత్రి తోట నిర్మలరాణి కృతజ్ఞతలు తెలియజేశారు.

## సాహితీ సౌరభాలు వెదజల్లిన రాచకొండ సామ్రాజ్యం

నేడు శిధిలాల్లో ఒదిగిన రాచకొండ సామ్రాజ్యం ఒకప్పుడు వైభవోపేతంగా విలసిల్లిందని ప్రముఖ చరిత్ర పరిశోధకులు, సాహితీవేత్త డా.సంగనభట్ల నరసయ్య అన్నారు. సృజన సాహితీ ఆధ్వర్యంలో రాచకొండ సామ్రాజ్యం సాహిత్య సేవ అనే అంశంపై సాహిత్య ఉపన్యాసానికి ప్రధాన వక్తగా విచ్చేసి ప్రసంగించారు. ప్రముఖ యోగా గురువు మాదగాని శంకరయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంగనభట్ల నరసయ్య మాట్లాడుతూ రాచకొండ ప్రభువులు గొప్ప పాలకులేగాక కవులుగా సాహిత్యంలో విశిష్టమైన గ్రంథాలను రచించారన్నారు. శ్రీనాథ కవి, పోతన వంటి మహాకవులకు ఆశ్రయమిచ్చి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేయడంలో కీలక భూమిక పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో సృజన సాహితీ అధ్యక్ష, కార్యదర్శులు పెరుమాళ్ళ ఆనంద్, డా. సాగర్ల సత్తయ్య, డా. బెల్లి యాదయ్య, శీలంభద్రయ్య, భూతం ముత్యాలు, మంచిరాజు లక్ష్మీనరసింహారావు సిలివేరు లింగమూర్తి, కోమటి మధుసూదన్, బక్క పిచ్చయ్య, ఎన్. భీమార్జున్ రెడ్డి, బండారు శంకర్, సుదీర్, నందిభట్ల శంకరయ్య, రఘువీర్ ప్రతాప్, పగిడిపాటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.





## కాలోచితమైన రచయిత లేదాళ్ళ రాజేశ్వరరావు - డా॥ కాంచనపల్లి

"అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి" కవితా సంపుటి రచయిత లేదాళ్ళ రాజేశ్వరరావు కవిత్వం సందర్భోచితంగా ఉంటుందని ముఖ్య అతిథి, తంగేడు పత్రిక సహసంపాదకుడు కాంచనపల్లి అన్నారు. కరీంనగర్ ఫిలిం భవన్‌లో 12 జనవరి నాడు ఉదయం 11 గంటలకు జరిగిన కవితా సంపుటి ఆవిష్కరణ సభకు ముఖ్య అతిథిగా హాజరై కవితా సంపుటి ఆవిష్కరించి ప్రసంగించారు. లేదాళ్ల రాజేశ్వరరావు కవితా రచనలోని నిర్మాణ రహస్యాలను కాంచనపల్లి గోవర్ధన రాజు సమగ్రంగా సోదాహరణంగా వివరించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన అన్నవరం దేవేందర్, రాజేశ్వరరావు కవిత్వం ఆసక్తిదాయకం అన్నారు. గజేందర్ రెడ్డి పుస్తకాన్ని సమీక్షించారు. ఇంకా నూటెంకి రవీందర్, సంగనభట్ల రామకృష్ణ, దాస్యం సేనాధిపతి తదితరులు పాల్గొన్నారు. ఈ సభకు వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షత వహించారు. పుస్తక కర్త తన స్పందనలో అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## "మనిషిలోకి" పుస్తకపరిచయ సభ...



ఆదిలాబాద్ రూరల్ డిసెంబర్ 26 : ఆదిలాబాద్ జిల్లాలో మంచి సాహితీ పురోగమనం జరుగుతుందని ఉదారి నారాయణ సాహిత్యాన్ని చక్కగా విస్తరింప చేస్తున్నారని ప్రముఖ రచయిత సుమనస్పతి రెడ్డి అన్నారు. ఉదారి నారాయణ రచించిన మళ్లీ మనిషిలోకి పుస్తకపరిచయ సభకు ఆయన హాజరై ప్రసంగించారు. జీవిత సమస్యల నుంచి అనేక పుస్తకాలు వస్తాయని ఆయన అన్నారు. ప్రధాన వక్త గోపగాని రవీందర్ మాట్లాడుతూ 44 కవితలు ఉన్న మళ్లీ మనిషిలోకి సంపుటిలో ప్రతి కవితాక్షరం సమాజంలో ప్రత్యక్షంగా జరుగుతున్నదే అన్నారు. తండ్రి తత్వకవి నాగదాసుల బాటలో కుటుంబం సాహితీ సేవ చేయడం చాలా గొప్ప విషయం అని రవీందర్ అభినందించారు. సభలో ఐతారం ముచ్చట్లు కార్యకలాపాలు వివరించారు. కార్యక్రమంలో వసంతరావు దేశపాండే, రాజవర్ధన్, చరణదాస్, వీరన్న, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.




## విశ్లేషణ

డా॥ రాధేయ

ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్ట్

అనంతపురము

సెల్ : 99851 71411

వెల : రూ. 200/-




## ప్రేరణ

కె. ప్రభాకర్

రవి పబ్లిషింగ్ హౌస్

సెల్ : 90000 38291

వెల : రూ.550/-




## మళ్ళీ మనిషిలోకి

డా॥ ఉదారి నారాయణ

సెల్ : 94414 13666

పాలపిట్ట బుక్స్

హైదరాబాద్

వెల : రూ. 150/-




## రాయ రత్నమంజూష

గార రంగనాథం

రాజాం, విజయనగరం

సెల్ : 98857 58123

వెల రూ. 300/-




## ముందడుగు

అమ్మంగి కవితా స్వామి

సెల్ : 98663 17608

హైదరాబాద్

వెల : రూ. 40/-




## ముఖచిత్రం

అమ్మంగి వేణుగోపాల్

సెల్ : 94410 54637

వెల రూ. 30/-




## షట్చక్రం

డా॥ లక్ష్మణ చక్రవర్తి

సెల్ : 98497 14261

అముక్త ప్రచురణలు

సికింద్రాబాద్

వెల రూ. 180/-




## దిక్చక్రం - సాహిత్య వ్యాసాలు

ఆడెపు లక్ష్మీపతి

సెల్ : 97012 27207

వెల రూ. 300/-




## పాలకంకులు

మాదస్త ప్రణవి

సెల్ : 93478 10982

వెల : రూ. 100/-



స్వాతంత్ర్య సమరయోధుడు, కవి

# మఖ్దూం మొహియుద్దీన్

జయంతి : ఫిబ్రవరి 4, 1908